మంగళవారం
16•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 21
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD



SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి
040 -30915112
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచిని
www.shriramcity.in




## రేపు రాష్ట్ర మంత్రివర్గ భేటీ

గురు, శుక్రవారాల్లో అసెంబ్లీ సమావేశాలు

నూతన పురపాలకచట్టం ఆమోదానికి ప్రత్యేక భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్ర మంత్రివర్గం బుధవారం సమావేశం కానున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి మంత్రులకు సమాచారం తెలియజేశారు. పురపాలకచట్టం ఆమోదంకోసం గురు, శుక్రవారాల్లో అసెంబ్లీ, కౌన్సిల్ ప్రత్యేకంగా సమావేశంకానున్న విషయం తెలిసిందే. అసెంబ్లీలో ప్రవేశపెట్టే పురపాలకచట్టం ముసాయిదా బిల్లును రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం నాలుగుగంటలకు ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానున్నది. శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలకోసం ఈ నెల 12న అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు గవర్నర్ తరపున నోటిఫికేషన్ విడుదలచేసిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశం కానున్నది. నూతన పురపాలక చట్టం బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. మరుసటిరోజు దానికి ఆమోదం పొందనున్నారు. అదేరోజు మండలిలో ఈ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదం పొందనున్నారు. రాష్ట్రంలో నూతన పురపాలకచట్టం అమల్లోకి వచ్చిన తర్వాతే మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.





సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంపహౌస్ వద్ద ఐదు మోటర్ల నుంచి గ్రావిటీ కెనాల్‌లోకి వెళ్తున్న గోదావరి జలాలు

మంథని మండలం కాసిపేటలోని అన్నారం పంపుహౌస్ హెడ్ రెగ్యులేటరీ వరకు చేరుకున్న కాళేశ్వరం జలాలు

# కాళేశ్వరం జలభాండం

## నిండుకుండల్లా మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లు

- కన్నెపల్లిలో నిరంతరం పనిచేస్తున్న ఐదు మోటర్లు
- ప్రతిరోజు ఒక టీఎంసీ జలాల ఎత్తిపోత
- మరో మోటర్‌ను ప్రారంభించనున్న ఇంజినీర్లు
- అన్నారం పంపుహౌస్ అప్రోచ్ కాల్వవద్దకు బ్యాక్‌వాటర్
- శుక్రవారం నుంచి ఎత్తిపోతలకు ఏర్పాట్లు
- పర్యవేక్షిస్తున్న ఈఎన్సీ వెంకటేశ్వర్లు

**జయశంకర్ జిల్లా ప్రతినిధి/ హైదరాబాద్/ మంథని, నమస్తే తెలంగాణ/ మంథని రూరల్:**

కనుచూపు మేర నీళ్లు! ప్రాణహిత కలిసే కాళేశ్వరం వద్ద మేడిగడ్డ బరాజ్‌లో.. అక్కడి నీటిని కన్నెపల్లి పంప్‌హౌస్‌ద్వారా ఎత్తిపోస్తుండటంతో అన్నారం బరాజ్‌లో.. గోదావరి పరవళ్లు! వెరసి.. కాళేశ్వరం ప్రాజెక్టులోని రెండు బరాజ్‌లు జలభాండాగారాలను తలపిస్తున్నాయి. ప్రాణహిత నుంచి గోదావరిలోకి ఇన్‌ఫ్లో నిలకడగా ఉన్నది. కాళేశ్వరం వద్ద సోమవారం కూడా సుమారు 12 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించినట్లు సాగునీటిశాఖ ఇంజినీర్లు వెల్లడించారు. ఫలితంగా మేడిగడ్డ బరాజ్‌లో క్రమేణా నీటినిల్వ పెరుగుతూ సోమవారానికి 6.70 టీఎంసీలకు చేరింది. మేడిగడ్డ బరాజ్ ఎఫ్‌ఆర్‌ఎల్ 100 మీటర్లు. ప్రస్తుతం 96.4 మీటర్ల వద్ద నీటిమట్టం ఉన్నది. ఈ నీటిని కన్నెపల్లి పంపుహౌస్‌లోని 1, 3, 4, 5, 6వ నంబర్ మోటర్లు ఏకధాటిగా గ్రావిటీ

మిగతా 4వ పేజీలో

**నేడు కాళేశ్వరం జలజాతర**

అన్నారం బరాజ్‌వద్ద పదివేల కుటుంబాలతో వనభోజనాలు

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బాల్క సుమన్


**ఉరకలేస్తున్న కృష్ణమ్మ**

వంద టీఎంసీలకు ఆల్మట్టి

1.11 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

33 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో

నాలుగైదు రోజుల్లో జూరాలకు కృష్ణమ్మ



## నేడు చంద్రగ్రహణం

అర్ధరాత్రి తర్వాత 1:31కి ప్రారంభం

బుధవారం ఉదయం 4:30 వరకు..

ఆలయాల్లో పూజలు నిలిపివేత

గురుపూర్ణిమ నాడే విశేషం

149 ఏండ్ల తర్వాత అరుదైన ఘటన

2

## విద్యుత్ ఉద్యోగులకు వెసులుబాటు

ఉద్యోగుల విభజన తుది ఉత్తర్వులపై చాలెంజ్ చేసే స్వేచ్ఛ ఉన్నదన్న సుప్రీంకోర్టు

విచారణను ముగించిన సర్వోన్నత న్యాయస్థానం

సుప్రీం తీర్పుతో విద్యుత్ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు

2

## ఆగిన చంద్రయాన్

వ్యోమనౌకలో లోపాన్ని గుర్తించిన శాస్త్రవేత్తలు

ప్రయోగానికి 56.24 నిమిషాల ముందు కౌంట్‌డౌన్ నిలిపివేత

రాకెట్, ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ సురక్షితం

9

## తాత ఇచ్చిన భూమి తన్నుకుపోయారు!

ధర్మగంట

- కబ్జాదారుడితో రెవెన్యూ అధికారుల కుమ్మక్కు
- పహాణీలో పేర్లు మార్చిన రెవెన్యూ సిబ్బంది
- న్యాయంకోసం వెళ్తే దిక్కున్నచోట చెప్పుకో అంటూ బెదిరింపులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితురాలు గుత్తికొండ లక్ష్మీబాయి

5

మనుమరాలిపై ప్రేమతో ఓ తాత 3.16 ఎకరాల భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌చేశారు. కొంత కాలానికి ఆమె భర్త చనిపోవడంతో ఆ భూమిపై ఓ కబ్జాదారుడి కన్నుపడింది. ఇంకేముంది.. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూమిలోనుంచి 1.16 ఎకరాలను తన భార్యపేరిట రాయించేసుకొన్నాడు. పట్టా కూడా పొందాడు. అధికారులు పహాణీలో పేర్లు కూడా మార్చేశారు. విషయం తెలుసుకొన్న బాధితురాలు నాలుగేండ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. దిక్కున్న చోట చెప్పుకో అంటూ అధికారులు బెదిరింపులకు దిగారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, దండుమైలారం గ్రామానికి చెందిన బాధితురాలు గుత్తికొండ లక్ష్మీబాయి న్యాయం కోసం 'ధర్మగంట'ను ఆశ్రయించారు.






హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి లంబాడ బస్తీలో టీఆర్‌ఎస్ సభ్యత్వం తీసుకున్న మహిళలు

7

## ఆగస్టు 1న హైసియా సదస్సు

వెయ్యి మందికిపైగా ప్రతినిధుల రాక

కొత్త టెక్నాలజీలపై ప్రసంగాలు

స్టార్టప్స్, ఐటీ అంశాలపై ప్యానల్ డిస్కషన్స్

2


LOVED IN 70 COUNTRIES

BAJAJ
THE WORLD'S FAVOURITE INDIAN

H GEAR టెక్నాలజి ఎలాంటిదంటే
కొత్త ప్లాటినా 110 సవారి స్మూత్‌గా





సమర్పిస్తున్నాము మొదటి H-GEAR టెక్నాలజీ.
దీనిలో ఉన్నాయి ఎక్స్‌ట్రా హైపే గేయర్ మరియు
ఆధునిక గేయర్ షిఫ్ట్ గైడ్, ఇవి కంఫర్టెక్ టెక్నాలజీతో
కొనసాగిస్తాయి మీ ప్రతి సవారీని హాయిగా.
ఇప్పుడిక ప్లాటినా 110 H-GEAR తో
కుదుపులు నిషేధం.

₹0/-* డౌన్ పేమెంట్ | ₹53 504/-* నుంచి ప్రారంభం
Call 721 982 1111 | www.bajajauto.com

PLATINA
కుదుపులు నిషేధం

For Institutional/Bulk orders, please send an e-mail to corporatesales@bajajauto.co.in | *Ex-showroom Price Telangana drum variant. *Down payment excluding the processing fee. Finance at the sole discretion of financier at dealership. Terms & Conditions apply.

Authorised Dealers For Bajaj Auto Ltd.: Karimnagar STANDARD BAJAJ 08782-276545, 9848576545 • Mancherial MAHI BAJAJ 08736-259088 ,9912278641 • Adilabad SRR MOTORS 9491249451,9491159452. Authorised Service Centre: JAGITIAL 8522038460, 9949565692, SIRICILLA 8309314141, METPALLY 9866766607, KORUTLA 9440653412, HUZURABAD 9440682444, VEMULAWADA 9866838847, PEDDAPALLY 9849362096, MORTHAD 9959279313, ARMOOR 9959908353, BODHAN 9440414119, KAMAREDDY 9849852992, BHEEMGAL 9030960100, ARMOOR 9848163064, JANNARAM 9440004495, KAGAZNAGAR 9491344501, ASIFABAD 9440838208 CHENNUR 9949993645, NIRMAL 9912663515, BHAINSA 8341437171, KHANAPUR 9440229720, KADEM 9440586978, NIRMAL 9491777000,GAJWEL 9848347349,MEDAK 7702014433,SIDDIPET 7702015577.



భద్రాచలంలోని శ్రీ సీతారాముల స్వామివారి ఆలయం

# 1న హైసియా సదస్సు

- వెయ్యి మందికిపైగా ప్రతినిధుల రాక
- స్టార్టప్స్, ఐటీ అంశాలపై ప్యానల్ డిస్కషన్స్
- సన్నాహక కార్యక్రమంలో నిర్వాహకుల వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) 27వ ఎడిషన్ వార్షిక ఆవిష్కరణ సదస్సు (యాన్యువల్ ఇన్నోవేషన్ సమ్మిట్) ఆగస్టు ఒకటిన నోవాటెల్‌లో జరుగనున్నది. సోమవారం హోటల్ మ్యారియట్‌లో నిర్వహించిన సదస్సు సన్నాహక కార్యక్రమంలో నిర్వాహకులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరుకావాల్సిందిగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు తెలిపారు. ఈ ఏడాది 'నెక్ట్స్‌జెన్ బిజినెస్' పేరుతో నిర్వహిస్తున్న సదస్సులో వార్షిక పారిశ్రామిక అవార్డులను అందజేస్తామన్నారు. 120 పైగా స్టార్టప్స్, 200 మంది ఐటీ రంగ ప్రముఖులు సహా 1000 మందికిపైగా ప్రతినిధులు పాల్గొనే ఈ సదస్సులో బ్లాక్ చైన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) లాంటి కొత్త టెక్నాలజీల గురించి దేశీయ, అంతర్జాతీయ నిపుణులు ప్రసంగిస్తారని, స్టార్టప్స్, ఐటీ తదితర అంశాలపై ప్యానల్ డిస్కషన్స్ జరుగుతాయని నిర్వాహకులు వివరించారు. 'ఆకర్షణీయమైన గమ్యస్థానంగా హైదరాబాద్' అనే పేరుతో రూపొందించిన సమగ్ర ఐటీ రంగ నివేదికను ఈ సదస్సులో విడుదలచేస్తామని, బిజినెస్ ఎకో సిస్టం, టాలెంట్, ఈజ్ ఆఫ్ లివింగ్, ఈజ్ ఆఫ్ డూయింగ్‌తోపాటు హైదరాబాద్‌లోని మౌలిక సదుపాయాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఈ నివేదికలో ఉంటాయని తెలిపారు.

**పెట్టుబడులకు దిక్సూచిగా..**

ఐటీ, ఐటీ సంబంధిత సంస్థలు హైదరాబాద్ అభివృద్ధిని అంచనావేసి టెక్నాలజీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఈ నివేదిక దిక్సూచిలా నిలుస్తుందని నిర్వాహకులు అన్నారు. రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం, మౌలిక సదుపాయాలు, అనుకూలమైన విధానాలు, భౌగోళిక పరిస్థితులు ఉండటంతో పలు బడా కంపెనీలు హైదరాబాద్ బాట పడుతున్నాయని హైసియా ప్రెసిడెంట్ మురళి బొల్లు చెప్పారు. ఐటీ రంగంలో స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు హైసియా ద్వారా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. హైసియాతో కలిసి సదస్సు నిర్వహించడం గర్వంగా ఉన్నదని ఎస్‌టీపీఐ హైదరాబాద్ డైరెక్టర్ రామ్‌ప్రసాద్ అన్నారు.



# నేడు చంద్రగ్రహణం

- అర్ధరాత్రి తర్వాత 1:31కి ప్రారంభం
- ఉదయం 4:30 గంటల వరకు..



**న్యూఢిల్లీ, జూలై 17:** ఈ నెల 16న (మంగళవారం) అర్ధరాత్రి పాక్షిక చంద్రగ్రహణం సంభవించనున్నది. 2 గంటల 58 నిమిషాల పాటు సాగే ఈ చంద్రగ్రహణాన్ని దేశప్రజలందరూ వీక్షించవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. దేశంలోని పశ్చిమ, మధ్య ప్రాంతాల్లో నివసించే ప్రజలకు గ్రహణం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అయితే, ఈశాన్యంలోని కొన్ని ప్రాంతాల్లో గ్రహణం చివర్లో మాత్రమే కనిపించే అవకాశాలున్నట్టు సమాచారం. ఈ ఏడాదిలో ఇదే చివరి చంద్రగ్రహణం. మంగళవారం అర్ధరాత్రి తర్వాత 12.13 గంటలకు చంద్రుడు భూమి ఉపచ్ఛాయలోకి ప్రవేశిస్తాడు. ఆ సమయంలో చంద్రుడి చుట్టూ పలుచని నల్లటి పొర ఆవరించినట్టు కనిపిస్తుంది. చంద్రుడు 1.31 గంటల సమయంలో భూమి ప్రచ్ఛాయలోకి ప్రవేశించడంతో గ్రహణం ప్రారంభమవుతుంది. ఉదయం 3 గంటల ప్రాంతంలో గరిష్ఠ గ్రహణం కనిపిస్తుంది. తర్వాత చంద్రుడు నెమ్మదిగా బయటికి రావడం ప్రారంభిస్తాడు. ఉదయం 4:30 గంటలకు భూమి ప్రచ్ఛాయ నుంచి చంద్రుడు బయటకు రావడంతో గ్రహణం పూర్తవుతుంది. ఉదయం 5.47 గంటలకు చంద్రుడు భూమి ఉపచ్ఛాయ నుంచి పూర్తిగా బయటికి వస్తాడు.

**149 ఏండ్ల తర్వాత..**

ఈ సంవత్సరం ఏర్పడుతున్న ఈ చంద్రగ్రహణానికి ఓ ప్రత్యేకత ఉన్నది. గురుపూర్ణిమ నాడే చంద్ర గ్రహణం ఏర్పడటం చాలా అరుదు. 149 సంవత్సరాల క్రితం ఇది జరిగింది. మళ్ళీ మంగళవారం ఈ అరుదైన సంఘటన జరుగనున్నది. మంగళవారం ఏర్పడనున్న చంద్రగ్రహణం ఈ ఏడాదికి ఇదే చివరిది. తర్వాతి చంద్రగ్రహణం మే 26, 2021 నాడు సంభవించనున్నది. మంగళవారం ఏర్పడే పాక్షిక చంద్రగ్రహణాన్ని భారత్‌తో పాటు ఆసియా, ఐరోపా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికాలలోని దేశాల ప్రజలు కూడా వీక్షించవచ్చు.

## ఆలయాల్లో పూజలు నిలిపివేత

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఉత్తరాషాఢ నక్షత్రం, ధను, మకరరాశిలో గ్రహణం సంభవించనున్నట్టు బ్రాహ్మణ పరిషత్ ఉపాధ్యక్షుడు, పురోహితుడు జోషి గోపాలశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 4 నుంచి బుధవారం ఉదయం 9 గంటల వరకు ఆలయాల్లో పూజలు నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 9లోపు ఆలయాలను శుద్ధిచేసి 10 గంటలకు దేవతామూర్తుల దర్శనం కల్పిస్తారని తెలిపారు. చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు రాష్ట్రంలోని ఆలయాలను మూసివేయనున్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి, వేములవాడ రాజన్న, అలంపూర్ జోగుళాంబ, శ్రీశైల భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి, అచ్చంపేట ఉమామహేశ్వర క్షేత్రం, భద్రాచలంలో శ్రీసీతారామాలయం, కొమురవెల్లి శ్రీ మల్లికార్జునస్వామి ఆలయం మంగళవారం సాయంత్రం 6.30 గంటల నుంచి బుధవారం ఉదయం 5.30 గంటల వరకు మూసివేస్తారు. బుధవారం ఆయా ఆలయాల్లో సంప్రోక్షణ, సుప్రభాత, ప్రాతఃకాల పూజల అనంతరమే భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని ఆలయాలు ఈవోలు వెల్లడించారు. కాగా తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం సాయంత్రం 7 గంటల నుంచి బుధవారం ఉదయం 5 గంటల వరకు మూసివేయనున్నారు.

# దామరచర్లకు డబుల్ లైన్ వేయండి

- రైల్వేశాఖకు ట్రాన్స్‌కో- జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు విజ్ఞప్తి
- భవిష్యత్ అవసరాలపై రైల్వే అధికారులతో సమీక్ష
- 200 కి.మీ. మార్గాన్ని అప్‌గ్రేడ్ చేయాలని విన్నపం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మిస్తున్న 4 వేల మెగావాట్ల అల్ట్రా మెగా పవర్ ప్లాంట్‌కు సింగరేణి నుంచి బొగ్గును సరఫరాచేసేందుకు వీలుగా కొత్తగూడెం-డోర్నకల్, మోటమర్రి-విష్ణుపురం మధ్య 200 కిలోమీటర్ల సింగిల్ రైల్వేలైన్‌ను డబుల్ లైన్‌గా మార్చాలని ట్రాన్స్‌కో-జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు దక్షిణమధ్య రైల్వే అధికారులను కోరారు. దామరచర్ల పవర్ ప్లాంట్ నిర్మాణం శరవేగంగా సాగుతున్నదని, అదేవిధంగా డబుల్ లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని ఆయన విజ్ఞప్తిచేశారు. దామరచర్ల, భద్రాద్రి, కేటీపీపీ పవర్ ప్లాంట్లకు బొగ్గును రవాణా చేసేందుకు ప్రస్తుతమున్న రైల్వేలైన్లతోపాటు భవిష్యత్తులో నిర్మించాల్సిన లైన్లపై సోమవారం ఆయన విద్యుత్ సౌధలో సమీక్ష నిర్వహించారు. దక్షిణమధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మేనేజర్ కే శివప్రసాద్, చీఫ్ మేనేజర్ డీ నాగ్య, జెన్‌కో డైరెక్టర్లు నర్సింగ్‌రావు, వెంకటరాజ్యం తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. డోర్నకల్-విజయవాడ, బీబీనగర్-నడికుడి లైన్లను కలుపుతూ దక్షిణమధ్య రైల్వే కొద్దికాలం క్రితం మోటమర్రి-విష్ణుపురం మధ్య సింగిల్ లైన్‌ను నిర్మించింది. నల్లగొండ జిల్లాలోని సిమెంట్, సున్నపురాయి పరిశ్రమలకు ఈ మార్గం ద్వారానే బొగ్గు సరఫరా జరుగుతున్నది. విష్ణుపురానికి సమీపంలోని దామరచర్ల విద్యుత్ ప్లాంట్‌కు కూడా ఈ లైన్ ద్వారానే బొగ్గును రవాణా చేయాలని దక్షిణ మధ్య రైల్వే, జెన్‌కో నిర్ణయించాయి. అయితే దామరచర్ల ప్లాంట్‌కు అవసరమయ్యే మొత్తం బొగ్గును రవాణా చేసేందుకు ఈ సింగిల్ లైన్ అనువుగా లేదని నిపుణులు తేల్చడంతో ఈ లైన్‌ను డబుల్ లైన్‌గా మార్చాల్సిన అవసరమున్నదని దక్షిణమధ్య రైల్వేకి జెన్‌కో విజ్ఞప్తి చేసింది. మోటమర్రి-విష్ణుపురం మధ్య ఉన్న 100 కిలోమీటర్ల సింగిల్ లైన్‌లో రోజుకు ఐదారు రేక్స్‌కు మించి బొగ్గును రవాణా చేసేందుకు వీల్లేదు. అయితే దామరచర్ల విద్యుత్ ప్లాంట్‌కు నిత్యం 50 వేల టన్నుల (14 రేక్స్) బొగ్గు దిగుమతి కావాలి. అంటే ఈ లైనులో ప్రతిరోజూ 59 బోగీలున్న 14 గూడ్స్‌రైళ్లు రాకపోకలు సాగించాలి. కానీ ఇప్పుడున్న లైనుకు అంత సామర్థ్యంలేదు. అటు డోర్నకల్-కొత్తగూడెం లైను పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉన్నందున అటు కొత్తగూడెం-డోర్నకల్ మధ్య 100 కిలోమీటర్ల, ఇటు మోటమర్రి-విష్ణుపురం మధ్య మరో 100 కిలోమీటర్లు కలిపి మొత్తం 200 కిలోమీటర్ల మేర డబుల్ లైన్ నిర్మించాల్సిన అవసరమున్నదని ప్రభాకర్‌రావు పేర్కొన్నారు.



**భూపాలపల్లి వరకు రైలుమార్గం**

భూపాలపల్లి పవర్ ప్లాంట్‌కు కాజీపేట్-బలార్షా మార్గంలోని ఉప్పల్ నుంచి బొగ్గు సరఫరా జరుగుతున్నది. ప్రస్తుతం గూడ్స్ రైళ్లను ఉప్పల్ స్టేషన్‌లో ఆపి.. అక్కడి నుంచి లారీల ద్వారా బొగ్గును భూపాలపల్లికి తరలిస్తున్నారు. నిత్యం అత్యంత రద్దీగా ఉండే చెన్నై-ఢిల్లీ మార్గంలోని ఉప్పల్‌లో బొగ్గు అన్‌లోడింగ్ వల్ల ఇతర రైళ్లకు ఇబ్బంది కలుగుతున్నది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉప్పల్ నుంచి భూపాలపల్లి వరకు ప్రత్యేక రైలు మార్గాన్ని నిర్మించుకోవాలని, లేదంటే ఉప్పల్ నుంచి కొద్ది దూరం రైల్వే ట్రాక్‌ను నిర్మించి డంపింగ్ యార్డును ఏర్పాటుచేసుకోవాలని రైల్వే, జెన్‌కో అధికారులు నిర్ణయించారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమగ్ర నివేదికను సమర్పించాలని వారు నిశ్చయించారు.

# విద్యుత్ ఉద్యోగులకు వెసులుబాటు

- ఉద్యోగుల విభజన తుది ఉత్తర్వులపై చాలెంజ్‌చేసే స్వేచ్ఛ ఉన్నదన్న సుప్రీంకోర్టు
- విచారణను ముగించిన సర్వోన్నత న్యాయస్థానం
- సుప్రీంకోర్టు తీర్పుతో విద్యుత్ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చాలా సంవత్సరాలుగా కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల విభజన వివాదంపై సోమవారం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తెలంగాణ విద్యుత్ సంస్థలతోపాటు, విద్యుత్ ఉద్యోగుల సంఘాలకు వెసులుబాటు కల్పించింది. తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల విభజనపై ఏర్పాటుచేసిన జస్టిస్ ధర్మాధికారి తుది నిర్ణయం ఆధారంగా విద్యుత్‌సంస్థలు జారీచేసే ఉత్తర్వులపై ఉద్యోగులు సుప్రీంకోర్టులో చాలెంజ్ చేయవచ్చని సుప్రీంకోర్టు తీర్పు వెల్లడిస్తూ కేసును ముగించింది. దీనిపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**జస్టిస్ ధర్మాధికారి మార్గదర్శకాలపై సుప్రీంకు వెళ్లిన ఉద్యోగ సంఘాలు**

విద్యుత్ ఉద్యోగుల విభజనపై సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ ధర్మాధికారి విచారణను దాదాపుగా పూర్తిచేశారు. అయితే 1157 మందికి సంబంధించిన వివాదంలో.. మొత్తం 10,400 మంది ఉద్యోగుల నుంచి ఆప్షన్లు తీసుకోవాలని జస్టిస్ ధర్మాధికారి మార్గదర్శకాలు జారీచేశారు. వీటిపై వివరణ కోరుతూ టీఎస్ జెన్కో, ట్రాన్స్‌కో, రెండు డిస్కంలతోపాటు తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల సంఘం, అకౌంట్స్ అధికారుల సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. సోమవారం జస్టిస్ అరుణ్‌మిశ్రా, జస్టిస్ ఎంఆర్ షా బెంచ్ ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో తరఫున సీనియర్ న్యాయవాదులు పరంజిత్‌సింగ్ పట్వాలియా, జైదేవ్‌గుప్తా, తెలంగాణ విద్యుత్ ఇంజనీర్ల సంఘం, అకౌంట్స్ అధికారుల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది మహబీర్‌సింగ్, శ్రవణ్ కుమార్‌లు వాదనలుచేస్తూ.. గతంలో సుప్రీంకోర్టు 1157 మంది విద్యుత్ ఉద్యోగుల వివాదంపైనే జస్టిస్ ధర్మాధికారి కమిటీని నియమించిందని, అయితే జస్టిస్ ధర్మాధికారి 10,400 మంది ఆప్షన్లు కోరాలంటూ మార్గదర్శకాలు జారీచేయడంతో వివాదం మరింత జటిలం అవుతున్నదని కోర్టుకు విన్నవించారు. దీనికి స్పందించిన బెంచ్.. ఉద్యోగులను విభజిస్తూ జారీచేసే తుది ఉత్తర్వులను చాలెంజ్ చేసే స్వేచ్ఛ పిటిషనర్లకు ఉన్నదని పేర్కొంటూ కేసు విచారణను మూసివేసింది. సుప్రీంకోర్టు తీర్పుపై తెలంగాణ విద్యుత్ ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు శివాజీ, అకౌంట్స్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంజయ్య హర్షం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టులో విచారణకు హాజరైనవారు.. ఫోన్‌లో 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. తాము వేసిన అప్లికేషన్లను సుప్రీంకోర్టు విచారించి.. వెసులుబాటు కల్పించిందని చెప్పారు. సోమవారం విచారణకు హాజరైన వారిలో జెన్‌కో డైరెక్టర్ అశోక్, లీగల్ అధికారి అశోక్, పరమేశ్, ఇతర అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

## అర్చకుల వేతనాలకు రూ.27.68 కోట్లు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో అర్చకుల వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.27,68,21,000 విడుదలచేసింది. ఈ మేరకు దేవాదాయశాఖ కార్యదర్శి అనిల్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 5.54 గంటలకు

సూర్యాస్తమయం: 6.50 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, పౌర్ణమి, నక్షత్రం: పూర్వాషాఢ రాత్రి 8.44 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, అమృతఘడియలు: మధ్యాహ్నం 3.34 నుంచి సాయంత్రం 5.10 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.36 నుంచి సాయంత్రం 5.13 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.29 నుంచి 9.21 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.32 నుంచి 3.23 వరకు, వర్జ్యం: లేదు.

# తెలంగాణ రోడ్లకు ఆమోదం తెలుపండి

- హైదరాబాద్ - నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఆమోదించండి
- లోక్‌సభలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో జాతీయ రహదారులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలుపాలని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి కోరారు. తెలంగాణలో 3,155 కిలోమీటర్ల రోడ్లను జాతీయ రహదారులుగా మార్చడానికి ప్రాథమికంగా అంగీకరించినప్పటికీ.. 1,388 కిలోమీటర్లకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని పేర్కొన్నారు. మిగిలినవాటిని కూడా నోటిఫై చేయాలని విజ్ఞప్తిచేశారు. లోక్‌సభలో సోమవారం ఉపరితల రవాణా శాఖ పద్దుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం గోదావరి - ప్రాణహిత నదులపై 354 కిలోమీటర్ల మేర ప్రతిపాదనలు పంపించిందని, వీటిని ఆమెదించాలని కోరారు. కేంద్ర ఆర్థికమంత్రి ప్రతిపాదించిన పథకంలో చౌటుప్పల్ - యాచారం - షాద్‌నగర్ - చేవెళ్ల - శంకర్‌పల్లి - కంది, సంగారెడ్డి - నర్సాపూర్ -తూప్రాన్ - గజ్వేల్ - జగదేవ్‌పూర్ - భువనగిరి - చౌటుప్పల్ రోడ్లను చేర్చాలని కోరారు. భారతమాల కార్యక్రమాన్ని అభినందిస్తూ.. దీనిద్వారా తెలంగాణలోని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా తీర్చిదిద్దాలని కోరారు. జాతీయ రహదారులకు బడ్జెట్‌లో గతం కంటే రూ.630 కోట్లు తగ్గించడం షాక్‌కు గురిచేసిందన్నారు. బడ్జెట్‌లో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు పెట్రోల్, డీజిల్‌పై రూ.1 సెస్ విధించారని, ఎక్సైజ్‌డ్యూటీ పెంచడం ద్వారా ఈ పెంపుదల ఒక్క రూపాయితో ఆగలేదని, ఢిల్లీలో రూ.2.5కు, ముంబైలో రూ.3.5, హైదరాబాద్‌లో రూ.2.8కు చేరిందని వివరించారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.280 కోట్ల (0.3 శాతం) నిధులతో దేశవ్యాప్తంగా రోడ్డుభద్రత ఏవిధంగా సాధ్యమని ఎంపీ రంజిత్‌రెడ్డి కేంద్రాన్ని ప్రశ్నించారు.



**నాగపూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఆమోదించండి**

హైదరాబాద్ - నాగపూర్ పారిశ్రామిక కారిడార్ డీపీఆర్‌కు కేంద్ర మంత్రివర్గం తుది ఆమోదం తెలుపాలని రంజిత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. సోమవారం లోక్‌సభలో రూల్ 377 కింద ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ కారిడార్‌కు 2016లో కేంద్ర వాణిజ్యశాఖ ఆమోదం తెలిపిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దీనికి సంబంధించిన డీపీఆర్‌ను సమర్పించిందని గుర్తుచేశారు.

**గ్యాస్‌స్టవ్‌ను ఉచితంగా ఇవ్వాలి**

ప్రధానమంత్రి ఉజ్వల్ పథకంలో భాగంగా గ్యాస్ కనెక్షన్‌తోపాటు గ్యాస్‌స్టవ్‌ను ఉచితంగా ఇవ్వాలని రంజిత్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు.

## ఆయుర్వేదంపై అవగాహన కల్పించాలి

**పాఠశాల** విద్యలో విద్యార్థులకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించాలి. ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలకు అవగాహన చాలా తక్కువగా ఉన్నది. నా వయస్సు 80 ఏండ్లు. ప్రతిరోజూ ఉదయం ఆరుమైళ్ల దూరం నడుస్తా. దీని వెనుక రహస్యం ఆయుర్వేదమే. దేశంలో 90 శాతం మంది అల్లోపతి వైద్యాన్ని ఆశ్రయిస్తుండగా.. ఆరుశాతం ఆయుర్వేద, భారతీయ సంప్రదాయ వైద్యం చేయించుకొంటున్నారు. యూనాని, యోగా, సిద్ధ వంటివి మంచి ఫలితాలొస్తాయి. ఆయుర్వేదం ద్వారా నాన్ కమ్యునికబుల్ వ్యాధులను 2025 నాటికి 25 శాతం తగ్గించవచ్చు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండాలి.

- ఆయుష్‌బిల్లుపై చర్చ సందర్భంగా రాజ్యసభలో ఎంపీ కే కేశవరావు



## బయో టాయిలెట్స్‌కు తెలంగాణ అనుకూలం



**రాష్ట్రంలో** బయో టాయిలెట్స్ నిర్మాణానికి కేంద్రం ఆర్థికంగా, సాంకేతికంగా సహకారం అందించాలి. తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లానీటిని అందిస్తున్నది. బయో టాయిలెట్స్‌కు తెలంగాణ అనుకూలంగా ఉంటుంది. అయితే.. తెలంగాణలో డబుల్‌పిట్ విధానంలోనే టాయిలెట్లు నిర్మిస్తున్నామని కేంద్రమంత్రి గజేంద్రసింగ్ సమాధానమిచ్చారు.

- ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎంపీ బండా ప్రకాశ్

## 30 నుంచి రెండో విడుత డీసెట్ కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిప్లొమా ఇన్ ఎలిమెంట్రీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు డీసెట్-2019లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 30 నుంచి రెండోవిడుత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కన్వీనర్ ఏ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మొదటి విడుతలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకాని విద్యార్థులకు ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించనున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 20 నుంచి 22 వరకు వెబ్‌ఆప్షన్లకు దరఖాస్తు చేసుకోవాలని, 24, 25 తేదీల్లో సీట్లను కేటాయిస్తామని చెప్పారు. 26, 27 తేదీల్లో విద్యార్థులు కళాశాలల్లో చేరాల్సి ఉంటుందని సూచించారు.

## తెలంగాణలో ప్రైవేటు వర్సిటీలు

సోమవారం నుంచే చట్టం అమల్లోకి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుకు రూపొందించిన చట్టం సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినట్టు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

# ఒత్తిడిలో పెద్దపులులు

- వన్యప్రాణి పర్యాటకాన్ని కట్టడి చేయాలి
- సిఫారసు చేసిన ల్యాకోన్స్, సీసీఎంబీ అధ్యయనం

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** అస్థిరమైన వన్యప్రాణి పర్యాటకం పెద్దపులలపై ఒత్తిడిని పెంచుతున్నదని హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ (సీసీఎంబీ) వెల్లడించింది. మధ్యప్రదేశ్‌లోని రెండు ప్రధాన టైగర్ రిజర్వుల్లో పులుల పర్యాటక ఒత్తిడికి గురవుతున్నట్టు గుర్తించినట్టు సీసీఎంబీ పేర్కొన్నది. పర్యాటకులు ఎక్కువగా వచ్చిన సమయాల్లో పెద్దపులులు ఆందోళనకు గురవుతున్నాయని, ఇది వాటి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని అత్తాపూర్‌లోని ల్యాబోరేటరీ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ ఎండెంజర్డ్ స్పీసీస్ (ల్యాకోన్స్), తార్నాకలోని సీసీఎంబీ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనలో వెల్లడైంది. శాస్త్రవేత్త డాక్టర్ ఉమాపతి ఆధ్వర్యంలోని బృందం మధ్యప్రదేశ్‌లోని కన్హా, బందావ్‌ఘర్ టైగర్ రిజర్వులలో పరిశోధనలు జరిపింది. ఇక్కడి పెద్దపులుల మలంలో ఒత్తిడికి గురిచేసే గ్లుకోకార్టికాయిడ్ మెటాబోలైట్ (ఎఫ్‌జీసీఎం) స్థాయిలను గుర్తించారు. అధిక మొత్తంలో ఎఫ్‌జీసీఎం.. పులుల పెరుగుదల, పునరుత్పత్తి, కండరాల క్షీణతతోపాటు రోగనిరోధకశక్తిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అధ్యయనం పేర్కొన్నది. పర్యాటకులు ఉన్నప్పుడు, లేని సమయాల్లో 341 పులుల నుంచి మలం నమూనాలు సేకరించి పరిశోధనలు చేశారు. ఇలాంటి కారణాలతోనే రాజస్థాన్‌లోని సారిస్కా అభయారణ్యంలో పెద్దపులుల పునరుత్పత్తి నిలిచిపోయిందని ఈ బృందం తమ గత అధ్యయనంలో తేల్చింది. ఎకో-టూరిజం నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసి క్రమపద్ధతిలో సందర్శకులను అనుమతించాలని, సందర్శకుల వాహనాల రాకపోకలను తగ్గించాలని, పులులు సంచరించే ప్రాంతాలకు సమీపంలో ఉన్న గ్రామాలను మరో ప్రాంతానికి తరలించడం వంటి చర్యలు తీసుకోవడం ద్వారా పులులు ఒత్తిడికి గురవకుండా చూడవచ్చు అంటూ డాక్టర్ ఉమాపతి బృందం సిఫారసు చేసింది.

## కవ్వాల్‌కు పులుల వలస

- మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన రేడియో కాలర్ పులులు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పొరుగు రాష్ట్రాల నుంచి తెలంగాణ కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లోకి పెద్ద పులుల వలస మళ్లీ మొదలైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ఆనుకొని మూడువైపులా ఉన్న అభయారణ్యాల నుంచి పెద్దపులులు తెలంగాణ సరిహద్దుల్లోకి వస్తున్నాయి. మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లాలోని తడోబా-అంధేరీ టైగర్ రిజర్వ్ నుంచి తెలంగాణలోని థాంసీ, కాగజ్‌నగర్, మంచిర్యాల, జన్నారం వైపు పులులు పరుగులు తీస్తున్నాయి. మెడకు రేడియో కాలర్ ఉన్న రెండు పులులు మహారాష్ట్ర తిప్పేశ్వర్ టైగర్ రిజర్వ్ నుంచి ఆదిలాబాద్ అడవుల వైపు వచ్చిన విషయాన్ని కాలర్లు బిగించిన వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు.. రాష్ట్ర అటవీ అధికారులకు చేరవేసి అప్రమత్తం చేశారు. దీంతో పులుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించి వాటికి ఎలాంటి హాని కలుగకుండా చూసేందుకు కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో 15 మందితో కూడిన ప్రత్యేక బృందం ఏర్పాటైంది. కొత్తగా వచ్చిన రెండింటితో కలిసి కవ్వాల్ అభయారణ్యం పరిధిలో పెద్దపులుల సంఖ్య ఎనిమిదికి చేరినట్టు అధికారులు చెప్తున్నారు. మరోవైపు సందర్శకుల సంఖ్య పెరుగడంతో పులులు అలజడిలేని ప్రాంతాలను వెతుక్కొంటూ వలస వెళ్తున్నాయి. ఈ క్రమంలో వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో దాదాపు 25-30 పులుల మెడకు రేడియో కాలర్లను వేశారు. మొదటి దశలో రేడియో కాలర్ బిగించిన పులులు రెండు ప్రస్తుతం తిప్పేశ్వర్ నుంచి ఆదిలాబాద్ థాంసీ ప్రాంతానికి వచ్చినట్లు వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ గుర్తించింది.



**లోకం పోకడ**





దూసుకుపోవాల్సింది కెరీర్‌లోనయ్యా.. ఇలా రోడ్ల మీద కాదు!!



సోమవారం మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఐసీ - టీఎస్సీ జనరల్ మేనేజర్ ఏబీ ప్రభురాజ్

## జేఎన్టీయూ విద్యార్థులకు వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ

- మంత్రి జగదీశ్‌రెడ్డి సమక్షంలో జేఎన్టీయూతో ఎన్ఎస్ఐసీ ఒప్పందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/కాప్రా:** జేఎన్టీయూ విద్యార్థులకు వృత్తినైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చేందుకు ఏఎస్‌రావునగర్‌లోని ఎన్ఎస్ఐసీ - టీఎస్సీ (నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్- టెక్నికల్ సర్వీసెస్ సెంటర్) జేఎన్టీయూతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎన్ఎస్ఐసీ - టీఎస్సీ జనరల్ మేనేజర్ ఏబీ ప్రభురాజ్ సోమవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సూచించారు. సమక్షంలో ఒప్పందపత్రంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు వృత్తినైపుణ్యాలు పెంచుకొంటేనే ఉద్యోగాలు సులువుగా లభిస్తాయన్నారు. ప్రస్తుతం జేఎన్టీయూ పరిధిలోని 160 కళాశాలల్లో 22 యూజీ ప్రోగ్రాంలు, 60 పీజీ ప్రోగ్రాంలు అందిస్తున్నామని చెప్పారు. డాటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సరికొత్త కోర్సులను ప్రవేశపెట్టామని చెప్పారు. సాంకేతిక విద్యలో అత్యుత్తమ ప్రమాణాల్ని అందజేయడంతో జేఎన్టీయూ నిరంతరం కృషిచేస్తున్నదన్నారు. కార్యక్రమంలో జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్ యాదయ్య, డైరెక్టర్ వెంకటరమణారెడ్డి, డాక్టర్ వాణి, యూకే మిశ్రా, ఎస్ కౌశిక్, ముత్తుకుమార్, అబ్దుల్‌ఖాదర్, ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వేంరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Bharat 6
Petrol & Diesel

PRESENTING

# SELTOS

## BADASS BY DESIGN

| Signature Kia Design | Next-gen AT & MT | 1.4 Turbo GDI with DCT | 37 Connectivity Features |
|---|---|---|---|
| Globally Acclaimed | Petrol & Diesel BS VI Engines | First-in-segment | With Kia UVO Connect |





**Pre-book your Seltos today**

Visit www.kia.com/in
Book Kia Seltos

Contact your nearest
**Kia Dealership** today

@KiaMotorsIN | @KiaMotorsIN | Kia Motors India | @KiaMotorsIN





- First-in-segment — Smart 8.0 Head-up Display
- Best-in-segment — BOSE Premium 8-speaker Music System with LED Sound Mood Lights
- Best-in-segment — 10.25 HD Touchscreen Navigation
- First-in-world — Smart Pure Air Purifier with UVO Controls
- First-in-India — 360° View Camera with Blind View Monitor (BVM)
- UVO Connect — Remote Start and Voice Recognition with 37 Connectivity Features

**26 New Additional Features:**

Signature Tiger Nose Grille | R17 Crystal-cut Alloy Wheels | 6 Airbags | Ventilated Front Seats | Crown Jewel LED Headlamps | Sweeping LED Light Bar | Heartbeat LED DRL | Multi-layer Turn Indicator | Heartbeat LED Tail Lamps | Ice Cube LED Fog Lamps | Electric Sunroof | Dual Trims – GT Line and Tech Line | Dual Muffler Design | Red Brake Caliper | Red Center Cap | Ambient Mood Lighting | Advance 7.0 Colour Display Cluster | Multi-drive Mode | Multi-traction Mode | Front Sensor | 4 Disc Brakes | Rear Sunshade Curtains | Reclining Rear Seats | Solar Glass | Driving Rear View Monitor (DRVM) | 8-way Driver Power Seat

## Close to you, no matter where you are

Our long term commitment to India is as big as our ambition. That is why we begin our journey in India with a nation-wide network of dealerships and service centres which ensures ready spare parts availability and quick service. So, no matter where you are in India, you are not very far from Kia.

**160** City Coverage **265** Consumer Touchpoints **206** Sales Points **192** Service Points

**For more information contact - 1800 108 5000**


T&C Apply. Visit your nearest Kia dealership for more details. The product shown is for representation purpose only, actual features, colours and specifications as shown may not be part of standard fitment and may vary. Segment is defined as Mid SUV whose length lies between 4260-4390mm and width between 1775-1825mm. Kia urges you to follow traffic rules, these are meant to keep you safe on roads.

KIA
The Power to Surprise

**FOR INFORMATION CONTACT: HYDERABAD: CAR AUTOMOTIVE,** JUBILEE HILLS, PH: 7997705333, **PPS MOTORS,** HITECH CITY, PH: 6309908117, LB NAGAR, NAGOLE, PH: 6309908118, **VIHAAN AUTO,** SECUNDERABAD, PH: 9738312345, **VIHAAN AUTO,** KUKATPALLY, PH: 9394812345

# కాళేశ్వరం జలభాండం

జలాభిషేకం



అన్నారం బరాజ్ వద్ద గోదావరి నదిలో బ్యాక్ వాటర్ ఏరియల్ వ్యూ



మేడిగడ్డ బరాజ్

మొదటిపేజీ తరువాయి...

కెనాల్‌లోకి ఎత్తిపోస్తున్నాయి. ఈ నీరు కన్నెపల్లి- అన్నారం గ్రావిటీ కాల్వద్వారా 13.34 కిలోమీటర్ల దూరం ప్రవహించి.. అన్నారం బరాజ్‌లో కలుస్తుండటంతో బ్యాక్‌వాటర్ అన్నారం పంప్‌హౌస్ సమీపానికి ఎదురెక్కింది. సోమవారం నాటికి అన్నారం బరాజ్‌లో నీటి నిల్వ 4.59 టీఎంసీలకు పెరిగింది. ఫలితంగా.. ఫ్లడ్ రివర్ లెవల్ (ఎఫ్‌ఆర్‌ఎల్) 119 మీటర్లకుగాను సోమవారానికి నీటిమట్టం 115.60 మీటర్లకు చేరింది.

### అన్నారం పంప్‌హౌస్ వద్దకు జలాలు

అన్నారం బరాజ్ బ్యాక్‌వాటర్ గుంజపడుగు పంపుహౌస్ అప్రోచ్ కెనాల్ వద్దకు చేరిందని ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సాయంత్రానికి అన్నారం బరాజ్‌లో నీటి నిల్వ 5.59 టీఎంసీలకు చేరే అవకాశం ఉన్నది. అన్నారం నీటినిల్వ సామర్థ్యం 10.87 టీఎంసీలు. ఇక్కడి పంప్‌హౌస్‌నుంచి నీటిని ఎత్తిపోయాలంటే బరాజ్‌లో నీటినిల్వ 6.70 టీఎంసీలకు చేరాలి. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి వస్తున్న నీటితో బుధవారం రాత్రి వరకు బరాజ్‌లో నీటినిల్వ 6.70 టీఎంసీలు దాటవచ్చని సాగునీటిశాఖ ఇంజినీర్లు భావిస్తున్నారు. ఆ వెంటనే ఇక్కడి పంపుహౌస్‌లోని మోటర్లతో ఎత్తిపోతలకు చురుకుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే నాలుగు మోటర్ల వెట్‌రన్‌కు ప్రాథమిక పరీక్షలు నిర్వహించినట్టు ఈఎన్సీ వెంకటేశ్వర్లు తెలిపారు. మూడు లేదా నాలుగు రోజుల్లో అన్నారం పంపుహౌస్ నుంచి గోదావరి జలాల ఎత్తిపోత ప్రారంభం కానుందని చెప్పారు. మొదట ఒకటోనంబర్ మోటర్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి ఎత్తిపోతలతో ఎదురెక్కివచ్చిన గోదావరి జలాలు సోమవారం పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేట వద్ద నిర్మించిన అన్నారం పంపుహౌస్ హెడ్‌రెగ్యులేటరీ వరకు చేరుకున్నాయి. మేడిగడ్డ నుంచి దాదాపు 74 కిలోమీటర్ల దూరం వరకూ ఎదురెక్కుతూ అన్నారం పంపుహౌస్ తీరాన్ని తాకగా, నీటిని శుక్రవారం ఎత్తిపోసేందుకు ముహూర్తం ఖరారుచేశారు. రోజురోజుకు పెద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చుతుండటంతో ఇప్పటివరకు నదిలో ఫిల్టర్లు వేసుకొని సాగుచేస్తున్న రైతులంతా అప్రమత్తమై బోర్లకు బిగించిన మోటర్లను తొలిగిస్తున్నారు.

### కన్నెపల్లిలో మరో మోటర్ వెట్‌రన్‌కు ఏర్పాట్లు

కన్నెపల్లి పంపుహౌస్‌లో సిద్ధమైన మోటర్లలో ఒకటైన రెండోనంబర్ మోటర్ వెట్‌రన్‌కు సాగునీటిశాఖ ఇంజినీర్లు సన్నద్ధం అవుతున్నారు. తద్వారా మొత్తం ఆరు మోటర్లతో గోదావరి జలాలు ఎత్తిపోయాలనే పట్టుదలతో ఉన్నారు. ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కొన్నిరోజులుగా ఇక్కడే ఉండి కన్నెపల్లి పంపుహౌస్‌లో నీటి ఎత్తిపోత, రెండు బరాజ్‌లలో నీటి నిల్వ, అన్నారం పంపుహౌస్‌లో మోటర్ల వెట్‌రన్ ప్రారంభానికి జరుగుతున్న ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు వివరాలను ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు.

### పెరిగిన సందర్శకుల తాకిడి

అనునిత్యం గోదావరి జలాలతో పునీతమవుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాంతం జల దేవాలయాన్ని తలపిస్తున్నది. కాళేశ్వరం, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల.. ఇలా ఎక్కడచూసినా అద్భుత జలదృశ్యాలు కనిపిస్తున్నాయి. గోదావరి నది కిలోమీటర్ల మేర నీటితో కళకళలాడుతున్నది. దిగువ నుంచి గోదారమ్మ ఎదురేగి వస్తున్న దృశ్యాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. సీఎం కేసీఆర్ భగీరథ ప్రయత్నాలు విజయవంతమయ్యాయంటూ అన్నివర్గాల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. అటు కాళేశ్వరం ప్రాజెక్టు, ఇటు రిజర్వాయర్ల మధ్య పారుతున్న గోదారమ్మను చూసేందుకు వస్తున్న సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. ఎగిసిపారుతున్న గోదావరి జలాలను... రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఆరాధిస్తున్నారు. పూజలు, హోమాలతో గోదావరి పరీవాహక ప్రాంతమంతా జల అధ్యాత్మిక శోభ సంతరించుకున్నది.

## నీటి ఎత్తిపోతపై ఈఎన్సీ సమీక్ష

కాసిపేటకు చేరుకున్న కాళేశ్వరం నీళ్లను ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు పరిశీలించారు. అంతకుముందు ప్రభుత్వ ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డితో కలిసి ఇరిగేషన్ ఇంజినీర్లు, మెగా కంపెనీ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం నీటిని ఎత్తిపోసేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఆలోగా పంపుహౌస్, సుందిల్ల బరాజ్‌కు సంబంధించిన అన్ని పరీక్షలను చేయనున్నారు. హెడ్‌రెగ్యులేటరీ వద్ద కావాల్సిన ఎత్తులోకి నీరు చేరగానే పంపుహౌస్‌లోని నాలుగు మోటర్లతో ఎత్తిపోసేలా చర్యలు తీసుకుంటున్నారు. గోదావరిలో క్రమంగా నీరు పెరుగుతున్నందున తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈఎన్సీ సూచించారు. ఆయన వెంట సుందిల్ల బరాజ్, గోలివాడ పంపుహౌస్ ఈఈ బండ విష్ణుప్రసాద్, అన్నారం పంపుహౌస్ డీఈ వల్లాల మధుసూదన్, మెగా పీఎం జనార్దన్, ఏఈ రవీందర్ ఉన్నారు.



అన్నారం పంప్‌హౌస్ హెడ్ రెగ్యులేటరీ వద్దకు చేరిన జలాలను పరిశీలిస్తున్న కాళేశ్వరం ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు తదితరులు

**ఇదీ నీటి నిల్వ**

| మేడిగడ్డ బరాజ్ | అన్నారం బరాజ్ |
|---|---|
| పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం : 16.17 | పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 10.87 |
| ప్రస్తుత నీటినిల్వ : 6.70 టీఎంసీలు | ప్రస్తుత నీటినిల్వ : 4.59 టీఎంసీలు |
| ఎఫ్‌ఆర్‌ఎల్ : 100 మీటర్లు | ఎఫ్‌ఆర్‌ఎల్ : 119 మీటర్లు |
| ప్రస్తుత నీటిమట్టం : 96.4 మీటర్లు | ప్రస్తుత నీటిమట్టం : 115.60 మీటర్లు |



మహారాష్ట్ర సిరొంచ వద్ద ప్రాణహిత నదిలో పారుతున్న నీరు



పెద్దపల్లి జిల్లా ఉప్పట్లకు చేరుకున్న గోదావరి నీటికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీటీసీ దేవక్క, గ్రామస్థులు



మంథనిలో గోదావరి వద్ద నీట మునుగుతున్న ఛాతుర్ముక బ్రహ్మ లింగం.



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కన్నెపల్లి పంపహౌస్ నుంచి అన్నారం బరాజ్‌లోకి వెళ్తున్న గోదావరి నీరు



అన్నారం బరాజ్ వద్ద జలజాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాల్క సుమన్

## నేడు కాళేశ్వరం జలజాతర

**అన్నారం బరాజ్ వద్ద వనభోజనాలు..పాల్గొననున్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు**

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ప్రాజెక్టు జలకళ సంతరించుకున్న నేపథ్యంలో చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ కాళేశ్వరం జలజాతర పేరుతో మంగళవారం అన్నారం బరాజ్‌వద్ద సామూహిక వనభోజనాల కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత, పెద్దపల్లి పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గ ప్రాంతానికి చెందిన పది వేల మంది కుటుంబాలతో సహా హాజరుకానున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే బాల్క సుమన్ సోమవారం పరిశీలించారు. కార్యకర్తలు, నేతలకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో పాల్గొనే మంత్రులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు తొలుత మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లు, కన్నెపల్లి పంపుహౌస్, గ్రావిటీ కెనాల్‌ను సందర్శిస్తారని నిర్వహకులు తెలిపారు.

## ఆల్మట్టి @ వంద టీఎంసీలు

- స్థిరంగా లక్షా11 వేల క్యూసెక్కుల ప్రవాహం
- కృష్ణమ్మకు గతేడాదికంటే మెరుగ్గానే వరద

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి:** కృష్ణమ్మ వరద గతేడాదికంటే కొంత మెరుగ్గానే వస్తున్నది. గతేడాది జూలై 15 నాటికి 93 టీఎంసీల నీటి నిల్వ ఉండగా..ఇప్పుడు 100 టీఎంసీలకు చేరింది. ఎగువ వర్షాలతో వరద ఉధృతంగా కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో గణనీయంగా ఉండటంతో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించి నదిలోకి నీటిని వదులుతున్నారు. సోమవారం ఉదయం వరకు ఆల్మట్టికి 1,11,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... రాత్రివరకు అంతే వరద కొనసాగింది. ఉదయం వరకు 99.39 టీఎంసీలు ఉండగా... సోమవారం రాత్రి 9 గంటల వరకు నీటినిల్వ 100 టీఎంసీలు దాటింది. ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 129.72 టీఎంసీలు. వరద ఎక్కువగా వస్తుందనే సమాచారంతో విద్యుత్‌ఉత్పత్తి యూనిట్లు ఐదింటిని ప్రారంభించి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ఆల్మట్టికి వస్తున్న ఇన్‌ఫ్లో, అక్కడి నుంచి నారాయణపూర్‌కు విద్యుత్ ఉత్పత్తి ద్వారా వదులుతున్న అవుట్ ఫ్లో ప్రకారం నాలుగైదు రోజుల్లోనే జూరాలకు వరద వస్తుందని భావిస్తున్నారు.

**11 రోజుల్లో 80.27 టీఎంసీలు రాక**

ఆల్మట్టిలో కేవలం 11 రోజుల్లో 80 టీఎంసీల నీరు చేరినట్లు నీటిలెక్కలు పేర్కొంటున్నాయి. ఎగువన భారీవర్షాలు కురుస్తుండటంతో కృష్ణకు వరద వచ్చింది. ఈ నీటి సంవత్సరంలో సోమవారంవరకు ఆల్మట్టికి 80.27 టీఎంసీల నీరు చేరిందని కృష్ణా బేసిన్ అధికారులు వెల్లడించారు. నారాయణపూర్ జలాశయానికి 11 నుంచే స్థానిక వరద రాగా.. 13 నుంచి ఆల్మట్టి నుంచి వరద వచ్చి చేరింది. దీంతో నారాయణపూర్‌కు 9.22 టీఎంసీల నీరు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 37.64 టీఎంసీలుకాగా సోమవారం రాత్రి వరకు 26 టీఎంసీల నీటినిల్వ ఉన్నది. ప్రస్తుతం ప్రాజెక్టుకు 42,453 క్యూసెక్కుల వరద వస్తుండగా, ఉజ్జయిని ప్రాజెక్టుకు 15.23 టీఎంసీలు చేరాయని అధికారులు తెలిపారు.

**తుంగభద్రకు స్థిరంగా వరద**

తుంగభద్రకు వరద స్థిరంగా కొనసాగుతున్నది. సోమవారం 15,026 క్యూసెక్కుల నీరు రాగా, నీటినిల్వ 12 టీఎంసీలకు చేరింది. ఇప్పటి వరకు తుంగభద్రలో 10.65 టీఎంసీల నీరు చేరింది.

## అంగన్‌వాడీలకు రెట్టింపు సెలవులు

- 90 నుంచి 180 రోజులకు పెంచుతూ ఉత్తర్వులు జారీ
- సెలవురోజుల్లో స్థానిక మహిళలకు నిర్వహణ బాధ్యత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, సహాయకుల సెలవులు పెంచుతూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు 90 రోజులున్న పరిమితిని 180 రోజులకు పెంచింది. సెలవులో ఉన్నప్పుడు సిబ్బందికి గౌరవవేతనం మంజూరుచేయరాదని ప్రభుత్వం పేర్కొన్నది. కేంద్రాల నిర్వహణ నిలిచిపోరాదని, సెలువులోఉన్నవారి స్థానంలో స్థానిక మహిళలు, గ్రామైక్య సంఘం మహిళలు, ప్రతినిధులకు బాధ్యతలను అప్పగించాలని, టీచర్లు, సహాయకులకు ఇచ్చే గౌరవవేతనం సెలవు రోజుల్లో బాధ్యతలను నిర్వహించేవారికి ఇవ్వాలని సూచించింది. అంగన్‌వాడీ కేంద్రాలు, మినీ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులకు ఈ నిబంధనలు వర్తిస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సెలవులను పెంచినందుకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం భిక్షమమ్మ తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఉన్న సెలవులకు రెండింతలకు పెంచడం మంచి పరిణామమని అన్నారు. దీనిపై ప్రభుత్వానికి, సీఎం కే చంద్రశేఖర్‌రావుకు రుణపడి ఉంటామని తెలిపారు.

## రీజినల్ రింగ్‌రోడ్డుపై మూడ్రోజుల్లో కేంద్రానికి నివేదిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఔటర్ రింగ్ రోడ్డు అవతల 360 కిలోమీటర్లు నిర్మించే రీజినల్ రింగ్‌రోడ్డు సాధ్యాసాధ్యాలపై మూడ్రోజుల్లో కేంద్రానికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర రోడ్డు, రవాణశాఖ ఇంజినీరింగ్ అధికారులు నివేదికను రూపొందిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో తెలంగాణ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన జాతీయ రహదారుల సంస్థ.. రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణంపై పలుసందేహాలను వ్యక్తంచేసి నివృత్తిచేయాలని కోరింది. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాలు, రవాణా సౌకర్యాల మెరుగుదల, భూ వినియోగం, అలైన్‌మెంట్ తదితర అంశాలపై అధ్యయనం చేసింది.

### బీసీ స్టడీ సర్కిల్ నుంచి ఎస్సైకి 15 మంది ఎంపిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందినవారిలో 15 మంది అభ్యర్థులు సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు ఎంపికైనట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ బాలాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదేండ్లలో బీసీ స్టడీ సర్కిళ్లలో శిక్షణ పొందినవారిలో 1,573 మంది వివిధ ఉద్యోగావకాశాలు పొందినట్టు పేర్కొన్నారు.



టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావును ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేస్తున్న టీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు. చిత్రంలో ఎంపీ బండా ప్రకాశ్ కూడా ఉన్నారు.

## ఆడబిడ్డల భూమిపై డీఎస్పీ కన్ను

- పోలీసుల అండతో చెలరేగిపోతున్న ఏఆర్ డీఎస్పీ
- అన్నిపత్రాలున్నా.. పట్టించుకోని అధికారులు
- రోడ్డున పడ్డ తల్లి, ఐదుగురు కూతుళ్లు



భూమి పత్రాలు చూపిస్తున్న మన్నె పద్మ, ఆమె ఐదుగురు కుమార్తెలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజల రక్షణ కోసం ఉన్న పోలీసే భక్షకునిగా మారాడు. భద్రత కల్పించాల్సిన పోలీసు అధికారే భూబకాసురుడిగా అవతరించాడు. ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో డీఎస్పీ బొమ్మ శంకర్ తప్పుడు పత్రాలు సృష్టించి అమాయక తల్లీకూతుళ్ల పొలం ఆక్రమించేశాడు. ఇదేమి అన్యాయమని ప్రశ్నించిన ఆడబిడ్డలను బెదిరిస్తున్నాడు. నల్లగొండ జిల్లా, అక్కలాయిగూడెం గ్రామానికి చెందిన మన్నె పద్మ(50)కు సర్వే నంబర్ 418లో 2.21 ఎకరాల భూమి ఉండేది. ఆర్థిక ఇబ్బందులతో 1992లో గ్రామానికే చెందిన బొమ్మ కొమురయ్య, కునుకుంట్ల మల్లమ్మకు చెరొక ఎకరం అమ్మగా.. 21 గుంటల భూమి మిగిలింది. భూమికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయి. భూరికార్డుల ప్రక్షాళన తర్వాత కొత్త పాస్‌పుస్తకం కూడా ఇచ్చారు. గ్రామం నల్లగొండ పట్టణంలో కలిసిపోయి.. భూమి ధర పెరుగటంతో బొమ్మ కొమురయ్య, అతని తమ్ముడు శంకర్, మరో ఇద్దరు సోదరుల కన్ను పడింది. ఇందులో శంకర్ ఏఆర్ డీఎస్పీగా నాగర్‌కర్నూల్‌లో పనిచేస్తున్నారు. ఎలాంటి అండలేని మన్నె పద్మ భూమిని ఆక్రమించి తన భార్య నాగమణి, అన్న కొడుకు పెద్దులు కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించాడు. భూమిలోకి రాకుండా పద్మ, ఆమె కూతుళ్లను బెదిరిస్తున్నాడు. 21 గుంటల భూమి పద్మ పేరిటే ఉన్నదని తాసిల్దార్ ఆర్డర్ ఇచ్చారు. వాటిని చూపించినా బొమ్మ సోదరులు దౌర్జన్యం కొనసాగిస్తున్నారు. స్థానిక పోలీసులు కూడా వారితో జతకట్టారు. కోర్టుకెళ్లి ఇంజెక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నా ఖాతరు చేయడంలేదు. పోలీసులను ఆశ్రయిస్తే 'భూమి వైపు వెళ్లకండి.. వారు కొడతారు' అని చెప్తున్నారని, మూడేండ్లుగా చర్య లు తీసుకోవడం లేదని వాపోయారు.



నల్లగొండ జిల్లా, అక్కలాయిగూడెంలో పెద్దులుకు సర్దిచెప్తున్న పోలీసులు.. హద్దురాయిని తొలగిస్తున్న పెద్దులు.. తిరిగి అక్కడే హద్దురాళ్లను పాతుతున్న పద్మ కుమార్తెలు

**మా భూమిని మాకు ఇప్పించండి**

నా భర్త 2006లో చనిపోయాడు. ఐదుగురు కూతుళ్లను కూలినాలి చేసి పోషించాను. 21 గుంటల భూమి ఎంతో భరోసాగా ఉండేది. పోలీసు అధికారి మా భూమిని ఆక్రమించాడు. అన్ని పత్రాలున్నాయి.. దయచేసి మా భూమి మాకు ఇప్పించండి.

–మన్నె పద్మ, భూమి యజమాని

**ఎవరూ న్యాయం చేయడం లేదు**

మా భూమి ఆక్రమించారని హైదరాబాద్‌కు వచ్చి పోలీసు ఉన్నతాధికారులకు, ఏసీబీకి ఫిర్యాదు చేశాం. రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నాం. బొమ్మ శంకర్ ఏఆర్ డీఎస్పీ కావటంతో ఎవరూ మాకు న్యాయం చేయడం లేదు. మాకు ఆ భూమే దిక్కు. దయచేసి ఇప్పించండి.

–స్వప్న, పద్మ పెద్ద కుమార్తె

## కార్మిక సమస్యలను పరిష్కరించండి

- కేంద్ర మంత్రులకు ఎంపీలు, టీఆర్ఎస్కేవీ విజ్ఞప్తి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వివిధ పథకాల్లో పనిచేస్తున్నవారికి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర మంత్రులకు టీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకులు వినతి పత్రం సమర్పించారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, హర్షవర్ధన్‌ను టీఆర్ఎస్ ఎంపీల ఆధ్వర్యంలో టీఆర్ఎస్‌కేవీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు కలిశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న తమ సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి, కేంద్రంపై ఒత్తిడి తేవాలని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు కే కేశవరావు, ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, బండా ప్రకాశ్, రంజిత్‌రెడ్డిలకు కూడా వినతి పత్రాలు అందజేశారు. కేంద్ర మంత్రులను కలిసినవారిలో టీఆర్ఎస్కేవీ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు మారయ్య, అంగన్‌వాడి సంఘ అధ్యక్షురాలు నల్లా భారతి, హనుమాండ్లు, వరలక్ష్మి, శ్రవణ్, సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌లాల్, సరోజ, సుజాత, కిరణ్ తదితరులు ఉన్నారు.

## పారదర్శకంగా మున్సిపోల్స్

- ఎన్నికల పరిశీలకులకు ఎస్ఈసీ నాగిరెడ్డి సూచన
- ఎన్నికల వివరాలు తెలిపే టీ-పోల్‌కు రూపకల్పన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పురపాలక ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు కృషిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) వీ నాగిరెడ్డి సూచించారు. సోమవారం హోటల్ మారియట్‌లో ఎన్నికల విధివిధానాలపై పరిశీలకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 132 పురపాలక సంఘాలు, 3,149 వార్డుల్లో త్వరలో ఎన్నికలు జరుపనున్నట్టు తెలిపారు. ఎన్నికల పరిశీలకులు వారికి కేటాయించిన వార్డుల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని చెప్పారు. ఎన్నికల ప్రక్రియనంతా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పురపాలక ఎన్నికల వివరాలు తెలుసుకొనేందుకు టీ-పోల్ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్టు తెలిపారు.

**పార్టీల ప్రతినిధులతో సమావేశం**

ఎన్నికల్లో పోటీచేసే వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో రిటర్నింగ్ అధికారులు సమావేశమై ఎన్నికల నిర్వహణలో సమస్యలను తెలుసుకోవడంతోపాటు, వారి సలహాలు తీసుకోవాలని ఎస్ఈసీ నాగిరెడ్డి సూచించారు. సున్నితమైన, క్లిష్టమైన పోలింగ్ కేంద్రాల సమీక్షకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన మైక్రో అబ్జర్వర్లను నియమించనున్నట్టు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు వెబ్ క్యాస్టింగ్‌కు ఏర్పాట్లుచేయాలని సూచించారు. కాగా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సురేష్ చందా, అదనపు డీజీపీ గోవింద్‌సింగ్‌ను మున్సిపల్ ఎన్నికల పర్యవేక్షకులుగా రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది.



మీడియాతో మాట్లాడుతున్న ఎస్ఈసీ వీ నాగిరెడ్డి

## నామినేటెడ్ పోస్టు పేరిట రూ.కోట్లు వసూలు చేశారు

- నాలుగు నెలలు గడుస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోలేదు
- హైకోర్టును ఆశ్రయించిన ప్రవర్ణారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నామినేటెడ్ పోస్టు ఇస్తామని చెప్పి రూ.కోట్లు వసూలు చేశారని, ఫిర్యాదు చేసినా సరూర్‌నగర్ పోలీసులు నాలుగునెలలుగా చర్యలు తీసుకోలేదంటూ తాళ్ల ప్రవర్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. బీజేపీ నాయకుడి పీఏ కృష్ణకిశోర్, జర్నలిస్టు ఈశ్వర్‌రెడ్డి, కారా అడ్వైజరీ కమిటీ చైర్మన్ మండ రాంచంద్రారెడ్డి తన నుంచి దాదాపు రూ.3 కోట్లు వసూలు చేశారని తెలిపారు. నామినేటెడ్ పదవి ఇప్పించకపోతే డబ్బు తిరిగి ఇస్తామని లిఖితపూర్వంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోగా.. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు పేరుచెప్పి బెదిరిస్తున్నారని, కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ఫోర్జరీ సంతకంతో ఉన్న పత్రాలిచ్చారని ఆరోపించారు. పిటిషన్‌లో సరూర్‌నగర్ పోలీసులతోపాటు కృష్ణకిశోర్, ఈశ్వర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, మురళీధర్‌రావును ప్రతివాదులుగా చేర్చారు. సోమవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. దర్యాప్తు ఆలస్యం కావడంపై వివరణ అడిగింది. చార్జిషీట్ దాఖలుకు నాలుగువారాల సమయం ఇవ్వాలని పోలీసులు కోరడంతో తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తున్నట్టు హైకోర్టు ధర్మాసనం ప్రకటించింది.

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE







సిద్దిపేట జిల్లా చేర్యాల దవాఖానలో చికిత్సపొందుతున్న బీమ బాలయ్య,

తమ భూమి పాత, కొత్త పాస్‌పుస్తకాల ప్రతులను చూపుతున్న రైతు బీమ మల్లయ్య దంపతులు

## తాసిల్‌లో పురుగులమందు తాగిన రైతు

**భూసమస్య పరిష్కరించాలని వేడుకోలు ■ సిద్దిపేట జిల్లా ముద్దూరులో ఘటన**

**మద్దూరు:** తమ భూసమస్యను పరిష్కరించాలని వేడుకొంటూ సిద్దిపేట జిల్లా ముద్దూరు తాసిల్ కార్యాలయంలో సోమవారం ఓ రైతు పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. బాధిత రైతు కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దూరు మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన బీమ మల్లయ్యకు బెక్కల్ గ్రామ శివారులో సర్వే నంబర్ 205/బీలో 1.20 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నది. అయితే అధికారులు ఇటీవల సదరు భూమిని రెవెన్యూ రికార్డుల్లో నుంచి తొలగించారు. దీంతో తన భూమిని తిరిగి రికార్డుల్లో ఎక్కించాలని బీమ మల్లయ్య కొన్ని రోజులుగా తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు భూమిని ఆన్‌లైన్ రికార్డుల్లో చేర్చకపోవడంతో మనస్తాపానికి గురైన మల్లయ్య పెద్ద కుమారుడు బాలయ్య సోమవారం తాసిల్ కార్యాలయంలో పురుగులమందు తాగారు. దీంతో అతడిని చికిత్స కోసం ఎస్సై రాజిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు హుటాహుటిన చేర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ సందర్భంగా బాలయ్య తల్లిదండ్రులు బీమా మల్లయ్య, బాలవ్వ మాట్లాడుతూ.. తమ పొలం పక్కనే ఉన్న భూమిని గ్రామానికి చెందిన మేడిచెల్మి అంజయ్య, కృష్ణ, కాంత్ కొన్నారని, తమ భూమిని కూడా కొన్నామని సదరు వ్యక్తులు పలుమార్లు భూమిలోకి ప్రవేశించి తమపై దాడిచేశారని తెలిపారు. ఈ విషయం కోర్టు వరకు వెళ్లిందన్నారు. ఈ క్రమంలో తమ పేరిట ఉన్న భూమిని అధికారులు రికార్డుల్లో నుంచి తొలగించారని చెప్పారు. మా భూమిని మేడిచెల్మి అంజయ్య పేరిట రికార్డుల్లో ఎక్కించేందుకు మాజీ సర్పంచ్ రాజమల్లయ్య సహకరిస్తున్నారని ఆరోపించారు. తమ భూమిని రెవెన్యూ రికార్డుల్లో వెంటనే తమ పేరిట చేర్చి న్యాయంచేయాలని అధికారులను వేడుకొన్నారు. ఈ విషయమై తాసిల్దార్ గీయాసున్నీసాబేగంను వివరణ కోరగా.. ఈ భూమి సమస్యపై గ్రామంలో వీఆర్వో విచారణచేపట్టి తనకు నివేదిక అందజేశారని చెప్పారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపించి వారి ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకొనున్నట్టు తెలిపారు.

## భూమి కోసం రైతు కుటుంబం ధర్నా

**మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం**



సోమవారం మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట రైతు నుంచి కిరోసిన్ సీసాను లాక్కుంటున్న పోలీసులు

**మంచిర్యాల రూరల్:** తన భూమి ఇప్పించాలని కోరుతూ ఓ రైతు సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట కుటుంబసభ్యులతో కలిసి ధర్నాకు దిగారు. అనంతరం ఆత్మహత్యకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొన్నారు. కన్నెపల్లి మండలానికి చెందిన నికాడి రాజుకు నాగవెల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 49/4లో ఉన్న నాలుగెకరాల భూమిని 1980లో అప్పటి ప్రభుత్వం సీలింగ్ పట్టా కింద ఇచ్చింది. అయితే రెవెన్యూ అధికారుల అండదండలతో కొందరు రాజకీయ నాయకులు దొంగపట్టా చేయించుకొన్నారని, ఈ విషయంలో తమకు న్యాయంచేయాలని కోరుతూ తాసిల్దార్‌కు, ఎస్సైకి ఎన్నిసార్లు దరఖాస్తు ఇచ్చినా పట్టించుకోవడంలేదని వాపోయారు. నాలుగెకరాల భూమిని సీలింగ్ పట్టా కింద అప్పటి ప్రభుత్వం ఇవ్వగా, నేటికీ సాగు చేసుకొంటున్నాని చెప్పారు. రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో భూమిని గత ఏడాది చింతపూరి అజ్జు పేరిట మార్పుచేశారని పేర్కొన్నారు. ఈ విషయంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా తమపైనే కేసు పెడుతామని ఎస్సై బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్‌పై డీఆర్వోకు బాధిత కుటుంబం ఫిర్యాదుచేసింది. కలెక్టరేట్ నుంచి బయటకు వచ్చిన బాధితుడు రాజు అధికారులు పట్టించుకోవడంలేదని, తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని తిరిగి వచ్చేలా చూడాలంటూ వెంట తెచ్చుకొన్న కిరోసిన్‌ను ఒంటి పోసుకొనేందుకు యత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకొన్నారు.

# తాత ఇచ్చిన భూమి తన్నుకుపోయారు!

కబ్జాదారుడితో రెవెన్యూ అధికారుల కుమ్మక్కు

పహాణీలో పేర్లు మార్చిన రెవెన్యూ సిబ్బంది

న్యాయంకోసం వెళ్తే దిక్కున్నచోట చెప్పుకో అంటూ బెదిరింపులు

'ధర్మగంట'ను ఆశ్రయించిన బాధితురాలు గుత్తికొండ లక్ష్మీబాయి




తన భూమి రిజిస్ట్రేషన్ పత్రాలను చూపుతున్న బాధితురాలు గుత్తికొండ లక్ష్మీబాయి

**ఇబ్రహీంపట్నం రూరల్:** రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, దండుమైలారం గ్రామానికి చెందిన గుత్తికొండ లక్ష్మీబాయికి ఆమె తాత మడూరి తిరుమల్‌రావు 1987లో గ్రామంలోని సర్వే నంబర్లు 351, 352 లలో 3.16 ఎకరాల భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌చేశారు. అనంతరం (రిజిస్ట్రేషన్ నంబర్ 250/87) రెవెన్యూ కార్యాలయంలో ఆర్వోఆర్ కాపీ ఇచ్చారు. 1991లో గుత్తికొండ లక్ష్మీబాయి పేరిట పహాణీలో ఎక్కించిన అధికారులు అదే ఏడాది పట్టాదారు పాస్‌పుస్తకం కూడా జారీచేశారు. 1992లో గ్రామానికే చెందిన మడూరి జంగయ్య రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తన భార్య సుశీల పేరిట.. లక్ష్మీబాయి పేరిట ఉన్న భూమిలోనుంచి 1.16 ఎకరాలను అక్రమంగా పట్టా చేసుకొన్నారు. అధికారులు పహాణీలో పేర్లు మార్చేశారు. విషయం తెలుసుకొన్న బాధితురాలు లక్ష్మీబాయి తన భూమిని ఇప్పించాలని నాలుగేండ్లుగా కలెక్టరేట్, ఆర్డీవో, తాసిల్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినప్పటికీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆమె ఆరోపిస్తున్నారు. తన భర్త మృతిచెందడంతో ఉన్న భూమిని కాపాడుకొని పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలనుకొన్నానని, తమ కష్టాలను ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళననే గౌరవం కూడా లేకుండా 'అవుతుంది వెళ్లమ్మా.. ఏంటీ నీ నస.. ప్రతిరోజు నీదే చూడాలా అవుతుందిలే మెల్లగా చేస్తాం.. నీ దిక్కున్నచోట చెప్పుకో' అని అధికారులు కసురుకొంటున్నారని వాపోయారు.

### నాలుగేండ్లయినా పట్టించుకుంటలేరు

మా తాత మడూరి తిరుమల్‌రావు 1987లో ఎంతో ప్రేమతో దండుమైలారం గ్రామంలో 3.16 ఎకరాలను నాకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్‌చేశారు. ఆ భూమిని అక్రమంగా లాక్కొన్నారు. భూమిని మా తాత నా పేరిట పట్టాచేసిన కొన్నాళ్లకు నా భర్త మృతిచెందడంతో చిన్న పిల్లలను పెంచుకొంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు ఎవరూ లేరనే నెపంతో నా భూమిని అక్రమంగా తమ పేరిట రాయించుకొన్న మడూరి జంగయ్య, సుశీల వద్దనుంచి నా భూమి ఇప్పించాలని అధికారుల చుట్టూ ఎన్నోసార్లు తిరిగినా, చెత్తులెత్తి వేడుకొన్నా నా సమస్యను పరిష్కరించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భూమిని ఇప్పించాలని కోరుతున్నాను. ముఖ్యంగా ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకొని నాలాంటి కష్టాలు ఇంకెవరికీ రాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తున్నారు.

- గుత్తికొండ లక్ష్మీబాయి, దండుమైలారం



పహాణీలో లక్ష్మీబాయి పేరును దిద్దిన దృశ్యం

### ఈ సమస్య మా దృష్టికి రాలేదు

దండుమైలారం గ్రామంలోని సర్వే నంబర్లు 351, 352 లలో ఉన్న 3.16 ఎకరాల భూమికి సంబంధించిన వివాదం మా దృష్టికి ఇంకా రాలేదు. ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి అర్హులైనవారికి త్వరలో న్యాయంచేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు అందజేస్తాం. ఇప్పటివరకు బాధితులు నా దృష్టికి తీసుకురాలేదు.

- వెంకటేశ్వర్లు, ఇబ్రహీంపట్నం తాసిల్దార్

## అమలుకాని ఆర్డీవో ఉత్తర్వులు

- రెండేండ్లుగా తిప్పించుకొంటున్న కరీంనగర్ రూరల్ అధికారులు
- బాధితుడి భూమిని అమ్ముకొన్న అదేపేరుతో ఉన్న మరో రైతు
- విచారించకుండానే గుడ్డిగా పట్టాచేసిన రెవెన్యూ అధికారులు
- ఆర్డీవో విచారణలో తేలిన నిజం.. సరిచేయాలని ఆదేశం
- అయినా పట్టించుకోని మండల రెవెన్యూ అధికారులు

'ఇద్దరు రైతుల పేర్లు, వారి తండ్రుల పేర్లు ఒకటే ఉండటంతో భూమి రిజిస్ట్రేషన్‌లో తప్పు జరిగింది. తప్పుడు రిజిస్ట్రేషన్‌తోచేసిన మ్యుటేషన్ చెల్లదు. నిజమైన హక్కుదారుడైన రైతు పేరును తిరిగి పహాణీలో ఎక్కించాలని' అని సాక్షాత్తూ కరీంనగర్ ఆర్డీవో ఇచ్చిన ఉత్తర్వులను కరీంనగర్ రూరల్ తాసిల్ అధికారులు అమలుచేయడంలేదు. 2017 నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో బాధిత రైతు చివరికి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన రైతు దాడి లక్ష్మయ్యకు దుర్షేడు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 381/బీలో తన తండ్రి మల్లయ్య పేరిట ఎకరం అరగుంట భూమి ఉన్నది. తండ్రి మరణించిన తర్వాత 2004లో లక్ష్మయ్య తన పేరిట విరాసత్ చేసుకొన్నారు. బాటకు రెండున్నర గుంటలు పోవడంతో ఆయనకు 38 గుంటల భూమి మిగిలింది. ముగ్గురు ఆడ పిల్లలు ఉన్న లక్ష్మయ్య దంపతులు.. వారి పెండ్లిళ్లు చేయడంతో పెద్దమొత్తంలోనే అప్పులు అయ్యాయి. వాటిని తీర్చేందుకు ఈ భూమిని అమ్మాలని బేరంపెట్టగా.. సర్వే నంబర్ 381/బీలో తన పేరిట భూమి లేదని లక్ష్మయ్యకు అధికారులు చెప్పారు. ఎందుకు లేదని ప్రశ్నించగా ఈ భూమి వేరే వాళ్లు కొన్నారని, వారికి మ్యుటేషన్ కూడా అమలైందని తెలిపారు. తన భూమిని ఎవరికీ అమ్మలేదని అధికారుల ముందు ఎంత మొత్తుకున్నా ఎవరూ పట్టించుకోలేదు.

**అసలు ఏం జరిగిందంటే..**

గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన దాడి లక్ష్మయ్యకు చెందిన భూమిని అమ్మిన మాట నిజమే. కానీ, అమ్మింది మాత్రం ఈ భూమిపై హక్కు ఉన్న లక్ష్మయ్య కాదు. దాడి లక్ష్మయ్య పేరుతోనే ఉన్న మరో వ్యక్తి ఇదే గ్రామానికి చెందిన వ్యక్తికి అమ్మారు. నిజానికి సర్వే నంబర్ 382/బీలో దాడి లక్ష్మయ్య తండ్రి మల్లయ్యకు 22 గుంటలు, అతని అన్న చంద్రయ్యకు మరో 22 గుంటల భూమి ఉన్నది. వీరిద్దరికీ సంబంధంలేని 381/బీలో మరో దాడి లక్ష్మయ్య తండ్రి మల్లయ్య పేరిట ఉన్న భూమి 38 గుంటలు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నంబర్ 10583/2004 ద్వారా 2004 అక్టోబర్ 25వ తేదీన ఇదే గ్రామానికి చెందిన అమ్ముల మల్లయ్యకు విక్రయించారు. దీంతో అసలు హక్కుదారుడైన దాడి లక్ష్మయ్యకు సర్వే నంబర్ 381/బీలో భూమి లేకుండా పోయింది. ఈ భూమిని కొనుగోలుచేసిన అమ్ముల మల్లయ్య ఆ తర్వాత తన కోడలు పేరిట రిజిస్ట్రేషన్ చేయించి మ్యుటేషన్ అమలుచేయించారు. ప్రస్తుతం ఈ భూమి అమ్ముల ప్రేమ పేరిట రికార్డుల్లో వస్తున్నది.

**వివాదానికి పరిష్కారం చూపిన ఆర్డీవో**


ఇద్దరి పేర్లు, తండ్రి పేర్లు ఒకటే ఉండటంతో అమ్ముల మల్లయ్యకు విక్రయించే సందర్భంలో పొరపాటు జరిగిందా? లేక ఉద్దేశపూర్వకంగానే చేశారా? అనేది పక్కన పెడితే మల్లయ్య మ్యుటేషన్ కోసం పెట్టుకొన్న అర్జీని పరిశీలించకుండానే అధికారులు పట్టా మార్పిడిచేశారు. అసలు హక్కుదారుడైన దాడి లక్ష్మయ్య తన పేరిట భూమి పట్టాచేయాలని కోరుతూ 2015 నవంబర్‌లో కరీంనగర్ ఆర్డీవో కోర్టులో అప్పీలు చేసుకొన్నారు. కేసు పూర్తి వివరాలు తెలుసుకొన్న అప్పటి ఆర్డీవో బీ రాజాగౌడ్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ ఎంజాయ్‌మెంట్ సర్వేచేశారు. దీంతో సర్వేనంబర్ 381/బీలో దాడి లక్ష్మయ్య, చంద్రయ్య సోదరులకు ఎలాంటి భూమి లేదని తేలింది. బాధిత రైతు దాడి లక్ష్మయ్యకు 38 గుంటల భూమి ఉన్నట్టు నిర్ధారించడంతో 2017 డిసెంబర్ 30న లక్ష్మయ్యకు అనుకూలంగా ఆర్డీవో ఉత్తర్వులు ఇచ్చారు. వాటిని అమలు చేయాలని కరీంనగర్ రూరల్ తాసిల్ అధికారులకు అర్జీ పెట్టుకొని ఏడాదిన్నర దాటినా ఇప్పటికీ పట్టించుకోవడం లేదని బాధిత రైతు లక్ష్మయ్య వాపోతున్నారు.



భూమి పత్రాలు చూపుతున్న లక్ష్మయ్య

## రికార్డుల్లో ఎకరం తగ్గించారు

- అధికారులు కుట్ర పన్ని మాయంచేశారు
- నల్లగొండ జిల్లా ఉమ్మాపురం బాధితురాలు కర్నాటి శోభ ఆవేదన



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నా పేరు కర్నాటి శోభ (భర్త రఘుమారెడ్డి). మాది నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం ఉమ్మాపురం గ్రామం. 1997లో పసుపు కుంకుమ కింద గ్రామంలోని సర్వే నంబర్ 49లో 3.30 ఎకరాల భూమిని మా నాన్న నాకిచ్చారు. దీనికి సంబంధించిన పత్రాలు కూడా ఉన్నాయి. భూరికార్డుల ప్రక్షాళన అనంతరం కొత్త పాస్‌పుస్తకం కూడా వచ్చింది. రైతుబంధు సాయం ఇప్పటివరకు రెండుసార్లు అందుకొన్నాను. గత నెలలో రెవెన్యూ అధికారులు ఆర్వోఆర్ రికార్డులో ఎకరం భూమిని అకస్మాత్తుగా తొలగించారు. 3.30 ఎకరాలకు గాను నా పేరిట 2.30 ఎకరాలు మాత్ర మే ఉన్నట్టు రికార్డుల్లో ఎక్కించారు. విషయం తెలిసి నా పేరిట 3.30 ఎకరాలు ఉన్నట్టు చూపే ఆర్వోఆర్, పాస్‌పుస్తకం రెవెన్యూ అధికారుల ముందుంచాను. అయినప్పటికీ వీఆర్వో మహేందర్, తాసిల్దార్ సునంద నా సమస్యను పట్టించుకోలేదు. కారణాలు అడుగుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినా అధికారుల్లో కదలిక లేదు. సర్వే నంబర్ 49 లో మొత్తం 16.18 ఎకరాల భూమి ఉన్నది. అందులో నా పేరిట 3.30 ఎకరాలు ముప్పై ఏండ్లుగా వస్తున్నది. కుట్ర పూరితంగా ఆర్వోఆర్‌లో ఎకరం భూమిని తగ్గించారు. అలా ఎందుకు చేశారో అర్థం కావడంలేదు. నా భూమిని కాజేసే కుట్ర జరుగుతున్నదని అనుమానంగా ఉన్నది. రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండా ఇది జరుగదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నాకు న్యాయంచేయాలి.

## అధికారుల తీరుతో యాతన


నల్లగొండ జిల్లా సురేపల్లి మహిళారైతు ఆవేదన



**నిడమనూరు:** నా పేరు సలాది లక్ష్మమ్మ. మాది నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం సూరేపల్లి గ్రామం. మా తల్లిదండ్రులు 1993లో సూరేపల్లి గ్రామశివారులోని సర్వే నంబర్ 39 ఏలో మా సమీపబంధువు సంకూరి చిన్న నాగయ్యకు చెందిన 1.25 ఎకరాల భూమిని కొనుగోలుచేసి నాకు పసుపు కుంకుమ కింద ఇచ్చారు. అప్పటినుంచి ఆ భూమిని సాగుచేసుకొంటున్నాను. పంటరుణం కూడా తీసుకొన్నాను. కాగా భూరికార్డుల ప్రక్షాళనలో నా భూమి గల్లంతయ్యింది. అధికారులను ప్రశ్నించగా ఆ భూమిని మా గ్రామానికి చెందిన పసుపులేటి వెంకట ప్రశాంత్‌కుమార్ 2001లో సంకూరి నాగయ్య వద్ద కొనుగోలు చేసినట్టు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉన్నందున అతడి పేరిట రికార్డుల్లో నమోదు చేసినట్టు చెప్పారు. నా భూమి హద్దులు, వెంకట ప్రశాంత్‌కుమార్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న హద్దులు వేరువేరుగా ఉన్నాయి. మోఖాపై విచారణ చేపట్టి నా భూమి నాకు ఇప్పించాలని అధికారులను రెండేండ్లుగా వేడుకొంటున్నా పట్టించుకోవడం లేదు. నా భర్త అనారోగ్యంతో మృతిచెందడంతో ముగ్గురు కొడుకులను పోషించుకోలేక ఇబ్బందులు పడుతున్నా. ఇప్పటికైనా అధికారులు స్పందించి నా భూమి నాకు ఇప్పించాలి.

## కాస్తులో ఒకరు.. పట్టా మరొకరికి

- **రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం.. రెండెకరాలు అన్యాక్రాంతం**
- **'ధర్మగంట'ను ఆశ్రయించిన నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ బాధితుడు**



**అమ్రాబాద్ రూరల్:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూర్ రెవెన్యూ గ్రామానికి (నూతన పంచాయతీ ప్రశాంత్‌నగర్)కు చెందిన మేతరి నిరంజన్‌కు సర్వేనంబర్ 50లో రెండెకరాల భూమి వారసత్వంగా వచ్చింది. భూరికార్డుల ప్రక్షాళనలోనూ 1-బీ ఫారం వచ్చింది. కాగా సదరు భూమిని రెవెన్యూ అధికారులు మరొకరికి పట్టాచేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మేతరి నిరంజన్ సర్వే నంబర్ 50లో రెండెకరాల భూమిని 30 ఏండ్లుగా సాగుచేసుకొంటున్నారు. ప్రస్తుతం ఆ భూమిలోనే పత్తిపంట కూడా వేశారు. ఆ భూమి తనదంటూ గ్రామానికి చెందిన మరోరైతు అడ్డుపడుతున్నారు. ఇదిలా ఉండగా రెవెన్యూ అధికారులు ఆరేండ్ల కింద నిరంజన్‌కు సర్వే నంబర్ 50లో కాకుండా సర్వే నంబర్ 51లో రెండెకరాల భూమిని తప్పుగా పట్టాచేశారు. ఆరేండ్లుగా తమ భూమికి పాస్‌పుస్తకం ఇవ్వాలని నిరంజన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోలేదు. మరోవైపు సర్వే నంబర్ 51లో ఉన్న భూమి కూడా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో తనకు న్యాయం చేయాలంటూ నిరంజన్ ధర్మగంటను ఆశ్రయించారు. తన భూమిని పట్టాచేసేందుకు వీఆర్వో వెంకటయ్య రూ.30 వేలు లంచం తీసుకొన్నట్టు నిరంజన్ ఆరోపించారు. ఈ విషయంపై వీఆర్వో వెంకటయ్యను వివరణ కోరగా మేతరి నిరంజన్ చాలా కాలంగా సర్వే నంబర్ 50లో సాగులో ఉంటున్న విషయం వాస్తవమేనని.. అది పట్టా భూమి కనుక అతనికి చెందదని చెప్పారు. గతంలో మేతరి నిరంజన్‌కు 51వ సర్వే నంబర్‌లో పట్టాచేశారని ప్రస్తుతం ఆ భూమి కూడా ఆన్‌లైన్లో చూపించడం లేదన్నారు.

# అసలు రైతులకు ఎసరు


**భూపరిహారం చెల్లింపులో రెవెన్యూ లీలలు ■ రికార్డులో లేనివారి పేర్లు భూస్వాధీనం నోటీస్‌లో..**

**కొత్త పేర్లతో పైసలు కాజేసేందుకు అధికారుల ప్రయత్నం**

**రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన్‌వెళ్లి భూసేకరణలో సిబ్బంది చేతివాటం**

రెవెన్యూ అధికారుల చేతివాటానికి అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు చేపడుతున్న భూసేకరణ పరిహారంలోనూ రెవెన్యూ లీలలు సాగిస్తున్నారు. ఏండ్లుగా సాగుచేస్తున్న అసలు రైతుల పరిహారానికి ఎసరు పెడుతున్నారు. భూములే లేనివారి పేర్లను భూస్వాధీనం నోటీస్‌లో చేర్చారు. స్థానిక నేతలతో కుమ్మక్కై పరిహారం జాబితాలో ఎక్కించారు. ఇదేమని ప్రశ్నిస్తే కనీసం పట్టించుకొనేవారే కరువయ్యారు. వాస్తవంగా భూములున్న అన్నదాతల పరిహారానికి గండికొడుతున్నారు. తమకు న్యాయంచేయాలని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సోలిపేట గ్రామానికి చెందిన బాధిత రైతులు 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

**రంగారెడ్డి జిల్లా, నమస్తే తెలంగాణ:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సోలిపేటకు చెందిన రామయ్య, ఆయన చెల్లెలు బుచ్చమ్మకు 1961లో ప్రభుత్వం సర్వే నంబర్ 190యూ, 196 (ఖాతా నంబర్ 304) లలో పదెకరాలను అసైన్డ్ చేసింది. ఇద్దరికీ ఐదెకరాల చొప్పున పట్టా సర్టిఫికెట్లు అందజేసింది. భూమి సాగు చేసుకొనేందుకు వ్యవసాయ బావి కోసం రామయ్య పేరుతో ఏపీఎస్ఈ బోర్డు విద్యుత్ మీటర్ నంబర్ 52003ను మంజూరుచేసింది. 58 ఏండ్లుగా ఈ భూమిని సాగుచేస్తూ జీవిస్తున్నారు. రామయ్యకు ముగ్గురు కుమారులు దేవయ్య, బాషయ్య, ఆనందం ఉన్నారు. బుచ్చమ్మ తన అన్న కుమారుడు ఆనందం ను దత్తత తీసుకొన్నారు. వీరంతా కలిసి పదెకరాల్లో సాగు చేస్తున్నారు. ఇప్పుడు ఈ అసైన్డ్ భూముల్లో నూతన పారిశ్రామికవాడ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చందన్‌వెళ్లి పరిసరాల్లో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఈ భూములను అప్పగించింది. రైతులకు పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. ఇదే అదనుగా భావించిన కొందరు స్థానిక నాయకు లు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారు. పరిశ్రమల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులకు చెల్లించే నష్టపరిహారం జాబితాలో అనర్హులకు చోటు కల్పిస్తున్నారు. అప్పటి వరకు రికార్డుల్లో లేనివారి పేర్లను పరిహారం జాబితాలో ఎక్కించేశారు. అసలు రైతుల పరిహారానికి ఎసరు పెట్టేలా ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. అక్కడి భూమితో సంబంధంలేని ముగ్గురి పేర్లను రామయ్యకు చెందిన సర్వే నంబర్లలో చేర్పించారు. ఆ సర్వే నంబర్‌లో ఎలాంటి రెవెన్యూ రికార్డులో లేనివారి పేర్లను భూములు స్వాధీనం చేసుకొనే అభ్యంతరాల నోటీస్‌లో పొందుపర్చారు. దీనివల్ల అసలు రైతుల పరిహారానికి గండిపడే పరిస్థితి నెలకొన్నది. ఈ విషయాన్ని గతంలో ఇక్కడ పనిచేసిన చేవెళ్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, అప్పటి తాసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 2017 వరకు తామే సాగుచేశామని, ఆ తర్వాత పదెకరాలు పరిశ్రమ ఆధీనంలోకి వెళ్లిందని చెప్తున్నారు. సోలిపేట-చందన్‌వెళ్లి గ్రామాల శివారులో ఈ పదెకరాలు భూమి ఉండటంతో రెవెన్యూ అధికారుల అండతో చందన్‌వెళ్లి వాసులు కొందరు అసలు రైతుపై దౌర్జన్యం చేస్తున్నారు.



### మాకు న్యాయం చేయండి

మా తాతకు 1961లో సోలిపేట గ్రామంలోని సర్వే నంబర్లు 190యూ, 196 (ఖాతా నంబర్ 304)లో పదెకరాలను ప్రభుత్వం కేటాయించింది. చందన్‌వెళ్లి గ్రామంలో 2000 ఎకరాల్లో ఏర్పాటుచేస్తున్న పరిశ్రమ ఆధీనంలోకి మా వ్యవసాయ భూమి కూడా పోయింది. ఈ భూమికి ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం కోసం స్థానిక నేతలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారు. నష్టపరిహారం చెల్లింపులో మాకు అన్యాయం చేయాలని చూస్తున్నారు. సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్తే.. తామేం చేయలేమని చెప్తున్నారు. భూమి స్వాధీన టెండర్‌లో పేరు వచ్చిందని అంటున్నారు. దీనివల్ల మాకు రావాల్సిన పరిహారంలో గండి పడనున్నది. ఉన్నతాధికారులు మాకు న్యాయం చేయాలి.

- ప్రవీణ్‌కుమార్, రామయ్య మనుమడు



ఉత్తరప్రదేశ్‌తో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో మతపరమైన నినాదాలు చేయమని ప్రజలను ఒత్తిడిచేయడం, దారుణాలకు పాల్పడటం వంటి తప్పుడు చర్యలు ప్రారంభమయ్యాయి. దీన్ని ఖండించాలి.

**మాయావతి, బీఎస్పీ అధినేత్రి**

మేము గోర్ఖా ప్రజల అభివృద్ధి కోరుకుంటున్నాం. గోర్ఖాలాండ్ రాష్ట్ర డిమాండు పట్ల మాకు సానుభూతి ఉన్నది. కానీ మేము ప్రత్యేక రాష్ట్రంపై ఎప్పుడూ వాగ్దానం చేయలేదు. ఈ విషయంలో మేము శాశ్వత రాజకీయ పరిష్కారం కోరుకుంటున్నాం.

**దిలీప్ ఘోష్, బెంగాల్ బీజేపీ చీఫ్**



**చరిత్రలో నేడు**




1661

మొదటిసారి యూరప్‌లో స్టాక్‌హోమ్ బ్యాంక్ 'బ్యాంక్ నోట్స్'ను జారీచేసింది.

1940

ఆపరేషన్ సీ లయన్ పేరుతో బ్రిటన్‌పై యుద్ధ సన్నాహాలు ప్రారంభించిన హిట్లర్.





1969

చంద్రం మండలం పైకి మొదటిసారి మనిషిని తీసుకెళ్లిన అపోలో-11

చైనాను శత్రువుగా చూడటం ప్రతికూల ఫలితాలను ఇస్తుందని హితవు చెబుతూ అమెరికాలోని వంద మందికి పైగా ప్రముఖులు అధ్యక్షుడు ట్రంప్‌కు లేఖ రాశారు. ఈ ప్రముఖుల్లో నిపుణులు, మేధావులు, మాజీ అధికారులు మొదలైనవారున్నారు. వీరంతా అమెరికాలోని శ్రేష్ఠవర్గంలో భాగం కనుక దానిని అమెరికా గొంతుకగా భావించవచ్చు. ఇప్పటికైనా రెండు దేశాలు ఒసాకాలో ఇటీవల జరిగిన జీ20 సదస్సులో కుదిరిన ఏకాభిప్రాయం ప్రకారం ముందుకుపోవడం మంచిది. వాణిజ్య యుద్ధం రెండు దేశాలకు నష్టదాయకమే.

**గ్లోబల్ టైమ్స్**

క్రికెట్‌తో సహా ఉన్నతమైన రంగాలన్నీ ప్రైవేటు పాఠశాలల్లో చదువుకున్న వారితోనే నిండిపోయి ఉంటున్నాయి. డేవిడ్ కామెరాన్ హయాంలో విద్యా కార్యదర్శిగా పనిచేసిన మైకెల్ గవ్ ప్రైవేట్ పాఠశాలలను ఏదోరకంగా రద్దు చేద్దామనే సూచన చేశారు. దేశ ప్రజల నుంచి కొద్దిమంది ధనికులను విడదీయడం ఎందుకని అడుగడం సరైందే. ఒకరిని పణంగా పెట్టి మరొకరు జీవితాన్ని ప్రారంభించడానికి ముందే పైచేయి సాధించడం సరైంది కాదు. ఆర్థిక సామాజిక అన్యాయాలను తొలిగించాల్సిందే. ఇందుకు విద్యా వ్యవస్థ అతీతం కాదు.

**ది గార్డియన్**



# జయాపజయములు!

ఒక్కోసారి గెలుపు ఓటమికి మధ్య రెప్పపాటు తేడా కూడా ఉండదు. క్రికెట్ ప్రపంచకప్ తుది పోరు చూసిన తర్వాత జయాపజయాలు ఒక్కోసారి మన చేతిలో ఉండవనే తాత్విక భావన కలుగుతుంది. ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య హోరాహోరీ పోరు ఎంత ఉద్వేగభరితంగా సాగింది! ఎవరు విజేతలో ఎవరు పరాజితులో తేల్చడం కష్టమైంది. సూపర్ ఓవర్ కూడా టై కావడంతో ఎక్కువ బౌండరీల నిబంధన ప్రకారం ఇంగ్లండ్ గెలిచినట్టు ప్రకటించారే కానీ, నిజానికి న్యూజిలాండ్ ఓడిపోలేదు. న్యూజిలాండ్ జట్టుకు ఆ దేశ ప్రజలే కాదు, ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులు మనసులో జేజేలే పలుకుతున్నారు. అతి కష్టం మీద సెమీ ఫైనల్‌కు చేరుకున్న న్యూజిలాండ్ జట్టు ఆ తరువాత అత్యంత ప్రతిభావంతంగా ఆడింది. భారత్ జట్టును ఎంతగా కట్టడి చేసిందంటే, ఒక దశలో ఓటమి కూడా అత్యంత అవమానకరంగా ఉంటుందనిపించింది. ఇక ఇంగ్లండ్– న్యూజిలాండ్ మ్యాచ్ టై కావడమే ఒక విచిత్రం. మళ్లా సూపర్ ఓవర్ టై కావడం మరింత ఆశ్చర్యకరం. ఇది రెండు జట్ల ఆటగాళ్ళు తమ శక్తినంతా కూడదీసుకొని ఆడిన ఫలితం! విజయాన్ని ఇరువురికి చెరి సమానంగా ఇవ్వాల్సింది. కానీ ఎవరో ఒకరే విజేతగా ఉండాలె కనుక నిబంధనల ప్రకారం నిర్ణయించారు. ఇరుపక్షాలు సమానంగా ఉన్నప్పుడు నాణేన్ని ఎగరేసి తేల్చడం కన్నా ఏదో ఒక నిబంధన ప్రకారం నిర్ణయించడం మంచిదే. కానీ బౌండరీల ఆధారంగా నిర్ణయించడమనేది క్రీడాభిమానులు ఆమోదించలేకపోతున్నారు. తీర్పు ఓడిపోయిన వారు కూడా న్యాయం జరిగిందని అంగీకరించేంత న్యాయబద్ధంగా ఉండాలె. కానీ బౌండరీల కన్నా కనీసం వికెట్ల ఆధారంగా నిర్ణయించినా బాగుండేదనే అభిప్రాయమూ వ్యక్తమవుతున్నది.

ఏ జట్టు గెలిచినా క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలే తప్ప ఒక దేశం మీద గెలుపు సాధించడమే గొప్పతనమనే భావన సరైంది కాదు. క్రీడాభిమానులు కూడా ఆట పట్ల అభిమానం కలిగి ఉండాలే తప్ప దేశాల మధ్య ఆటలపోటీలను యుద్ధాల మాదిరిగా భావించకూడదు. ఆటల ద్వారా దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గి స్నేహ సంబంధాలు నెలకొనాలె. క్రీడల లక్ష్యమే ప్రపంచదేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంచడం.

అనేక ఆంతరంగిక, అంతర్జాతీయ కారణాలు ఇంగ్లండ్ ప్రజల్లో ఆత్మన్యూనతను పెంచుతున్న కాలమిది. క్రికెట్‌కు పుట్టినిల్లయిన ఇంగ్లండ్‌లో నే ఈ ఆట ప్రభ కోల్పోతున్న దశలో ఈ గెలుపు లభించింది. ఈ గెలుపు క్రికెట్ క్రీడకు ఊపునివ్వడమే కాదు, ఇంగ్లండ్ ప్రజలలోనూ జాతీయాభిమానాన్ని ఉప్పొంగించింది. ప్రపంచకప్ ప్రారంభమైన నాటినుంచి ఇంగ్లండ్ విజయం సాధించడం ఇదే మొదటిసారి. ఎప్పటినుంచో వెంటాడుతున్న ఈ కలను నిజం చేయడంలో కీలక పాత్ర పోషించిన క్రీడాకారుడు బెన్ స్టోక్స్. ఇక ఇంగ్లండ్ పని అయిపోయింది అనుకున్న సమయంలో చివరి ఓవర్‌లో 3 బంతులకు 9 పరుగులు చేయాల్సిన స్థితితో స్టోక్స్ చాలా సంయమనంతో ఆడటం వల్ల మ్యాచ్ టై అయింది. ఆ తరువాత సూపర్ ఓవర్‌లోనూ స్టోక్సే కీలక పాత్రధారి. ఫైనల్‌లో ఇంగ్లండ్‌తో తలపడిన న్యూజిలాండే బెన్‌స్టోక్స్ మాతృదేశం కావడం యాదృచ్ఛికం. బెన్‌స్టోక్స్ చిన్నతనంలోనే వారి కుటుంబం ఇంగ్లండ్‌కు వలసవచ్చింది. వలస వచ్చిన ఆ వజ్రమే ఇంగ్లండ్‌ను విశ్వవిజేతగా నిలిపాడు. అట్లనే సూపర్ ఓవర్‌లో న్యూజిలాండ్‌ను కట్టడిచేసిన జోఫ్రా ఆర్చర్‌ది కూడా కరీబియన్ దీవుల్లోని బార్బడోస్. ఈ ఇద్దరు ఆటగాళ్ళే ఇంగ్లండ్‌కు చిరస్మరణీయమైన విజయంలో ప్రముఖ పాత్ర పోషించడం గమనార్హం.

ఈ ప్రపంచకప్ సెమీస్‌లో భారత్ న్యూజిలాండ్ మ్యాచ్, ఫైనల్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్ మ్యాచ్ థ్రిల్లర్ సినిమాలను తలపించాయి. ప్రతి క్షణం ఏం జరుగుతుందా అన్న ఉత్కంఠ లార్డ్స్ స్టేడియంలో ప్రత్యక్షంగా చూస్తున్న వారిని, టీవీల ముందు కూర్చున్న కోట్లాదిమందిని కదలకుండా చేసింది. భారత్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ మొదలైన జట్లు ఏ స్థానంలో ఉన్నా ఆడిన తీరు ప్రశంసనీయం. ఆటను ఆస్వాదించడానికి జయాపజయాలతో సంబంధం లేదు. ఒక మంచి ఆటతీరు చూసి ప్రజలు ఆనందిస్తారు, ఉద్వేగాలను పంచుకుంటారనడానికి ఈ ప్రపంచకప్ క్రీడలే నిదర్శనం. ఆఫ్ఘనిస్థాన్ జట్టు ఒక్క గెలుపునూ అందుకోలేకపోవచ్చు. కానీ వారు ఆటతీరుతో దేశ సరిహద్దులతో నిమిత్తం లేకుండా క్రీడాభిమానుల మనసులు దోచుకున్నారు. అత్యంత తీవ్ర సంక్షోభంలో ఉన్న ఒక దేశం నుంచి ఒక మేలైన జట్టు ఏర్పడటమే గొప్ప విషయం. పాకిస్థాన్‌లో కాందిశీకులుగా బతుకుతూ అక్కడి యువకులతో, పునరావాస శిబిరాల్లో కూడి క్రికెట్ నేర్చుకున్న పిల్లగాళ్ళు... తమ దేశంలో సంక్షోభ పరిస్థితుల దృష్ట్యా అక్కడి మైదానాల్లో కూడా ఆడలేని పరిస్థితి! జాతీయ పోటీలు కూడా విదేశీ మైదానాలలో ఆడవలసిందే. మొదట క్రికెట్‌ను నిషేధించిన తాలిబన్లు కూడా వీరి ఆటతీరు సాధించిన ప్రజామోదంతో నిషేధాన్ని ఎత్తివేయవలసి వచ్చింది. అయినా దేశంలో క్రికెట్ ఆడటమంటే యుద్ధానికి దిగినట్టే. అటువంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ వారు ఆటపై సాధించిన పట్టు అబ్బురపరిచింది. ప్రపంచకప్ పోటీల్లో బలమైన భారత్ జట్టును కూడా తిప్పల పెట్టారు. ఏ జట్టు గెలిచినా క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలే తప్ప ఒక దేశం మీద గెలుపు సాధించడమే గొప్పతనమనే భావన సరైంది కాదు. క్రీడాభిమానులు కూడా ఆట పట్ల అభిమానం కలిగి ఉండాలే తప్ప దేశాల మధ్య ఆటలపోటీలను యుద్ధాల మాదిరిగా భావించకూడదు. ఆటల ద్వారా దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గి స్నేహ సంబంధాలు నెలకొనాలె. క్రీడల లక్ష్యమే ప్రపంచదేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంచడం.

**జనగళం**

### బాధ్యతగా వ్యవహరించాలె

మానవ జీవనశైలి మార్పుల వల్ల అనేక వ్యాధులు సంభవిస్తున్నాయి. బీపీ, మధుమేహం, గుండెజబ్బులు, అంటువ్యాధులు, క్యాన్సర్ లాంటి ఎన్నో వ్యాధులు ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. ఎంతో మంది విద్యార్థులు అనాథలవుతున్నారు. ఎంతో మంది యువతులు వితంతవులవుతున్నారు. తల్లిదండ్రులకు గర్భశోకం మిగులుతున్నది. వాతావరణంలో వస్తున్న మార్పులు, ఆహారపదార్థాల విషతుల్యం లాంటి వాటివి ప్రధాన కారణమని చెప్పక తప్పదు. కాబట్టి వీటి నిర్మూలన పట్ల విద్యార్థులను, ప్రజలను, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పించి, చైతన్యవంతులను చేయాలి. అవగాహన కల్పించాలి. ఆరోగ్య భారతం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

**- నర్మాల కృష్ణతేజ, లక్ష్మీనగర్, కరీంనగర్**

### వ్యతిరేక ప్రచారం మానుకోవాలె

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంత ప్రాజెక్టులపై వివక్ష చూపేవారు. గోదావరి, కృష్ణా నదులు తెలంగాణలోనే ఎక్కువ దూరం ప్రయాణిస్తున్నా ఇక్కడి రైతులకు సాగునీటి ఇబ్బందులుండేవి. చెరువులను కూడా నిర్లక్ష్యం చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోరు బావులపైనే ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు అన్నివిధాలుగా నష్టపోయారు. కానీ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం టీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించింది. ఏటా బడ్జెట్‌లో ప్రాజెక్టుల నిర్మాణానికి సింహభాగం నిధులు కేటాయిస్తూ వస్తున్నది. దాని ఫలితమే ఇవాళ కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి దశకు చేరుతున్నది. ఈ ప్రాజెక్టు ప్రారంభం కావడం వల్ల సముద్రంలోకి ఏటా వృథాగా పోయే నీటిని ఒడిసిపట్టుకుంటున్నాం. అట్లనే దశలవారీగా వేలాది చెరువులను పునరుద్ధరిస్తున్నది. కానీ ఇవేవీ ప్రతిపక్షాలకు కనిపించడం లేదు. మన ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఇక్కడి ప్రతిపక్షాలే అడ్డుతగులుతున్నాయి. దీన్ని ప్రజలు హర్షించరు. సుదీర్ఘ కాలం ఉద్యమంలో పనిచేసిన వారికి కూడా నీటి బాధలు అర్థం కాకపోవడం శోచనీయం. మన ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పనిచేయడం అంటే రాష్ట్రానికి ద్రోహం చేయడమే. ప్రజల మద్దతు పొందాలంటే రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలి.

**- పి. లక్ష్మణ్, సిరిసిల్ల**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

**జాతీయం**

**ఇప్సితా చక్రవర్తి**

# 'పౌర' చిక్కుల్లో అస్సామీలు

పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రక్రియ అస్సాంలో ఓ బృహత్తర కార్యంగా మారింది. ఇది అనేక దశలుగా కొనసాగుతున్నది. మొదట రాష్ట్రవ్యాప్తంగా జనాభా గణన చేపడుతారు. ఈ క్రమంలో గమనించాల్సిన విషయం ఏమంటే.. ఒంటరి వ్యక్తులు తమ పౌరసత్వాన్ని నిరూపించుకునే ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. వారు తమ పేరు నమోదు కోసం జాతీయ పౌర నమోదు రిజిష్టర్ (ఎన్‌ఆర్‌సీ) దరఖాస్తు చేసుకోవాలి. వారి కుటుంబీకులు, పూర్వీకులు 1971కన్నా ముందునుంచే అస్సాంలో నివసిస్తున్నారని రుజువులు చూపాలి. వారితో తమకు ఉన్న రక్త సంబంధాన్ని నిరూపించుకోవాలి. అప్పుడే వారి దరఖాస్తు పరిశీలనకు నోచుకుంటుంది.

అస్సాంలో జాతీయ పౌరసత్వ నమోదు రిజిష్టర్ తుది జాబితాను ఈ జూలై 31న విడుదల చేస్తామని అస్సాం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నది. బహుశా ఇది ప్రపంచలోనే అతిపెద్ద పౌరజాబితా పరిశీలనా కార్యక్రమంగా చెప్పబడుతున్నది. ఈ పౌర నమోదు కార్యక్రమం కారణంగా లక్షలాది మంది జీవితాలు త్రిశంకు స్వర్గంలో చిక్కుకున్నాయి. అంతిమ (ఫైనల్) పౌర నమోదు ప్రక్రియగా చెబుతున్న ఈ కార్యక్రమం నెలరోజులుగా కొనసాగుతున్నది. ఈ క్రమంలో పౌర నమోదు ప్రక్రియ అంటే ఏమిటి? అది అస్సాంలో ఎందుకు చేపట్టాల్సి వచ్చింది? లాంటి అనేక ప్రశ్నలను దేశ ప్రజల ముందు ఉంచింది. ఈ నేపథ్యంలో దాని పూర్వాపరాలను, సమస్యలను పరిశీలించవలసి ఉన్నది. పౌర రిజిష్టర్ అంటే అస్సాంలో నివసిస్తున్న భారత పౌరుల పేర్ల నమోదు రిజిష్టర్ అని అర్థం. దశాబ్దాలుగా అస్సాంలోకి వలస వచ్చిన వారిని వలస వచ్చిన వారు, లేదా విదేశీయులు అన్న పేరుతో పిలుస్తున్నారు. అస్సాంలోకి దఫ దఫాలుగా అనేక మార్లు ప్రజా వలసలు సాగాయి. మొదటిసారి బ్రిటిష్ వలస పాలనలో జరిగితే, దేశ స్వాతంత్ర్యం తర్వాత సరిహద్దు దేశాల నుంచి పెద్ద ఎత్తున వలసలు అస్సాంలోకి జరిగాయి. ఈ విదేశీయులు అన్న దానితోనే అస్సాంలోని సమస్య అంతా ముడిపడి ఉన్నది. వలసకారులు, లేదా విదేశీయుల రాకతో స్థానిక ప్రజలు మైనార్టీలో పడిపోయి వారి సాంస్కృతిక, రాజకీయ జీవితం ప్రమాదంలో పడిపోయిందన్న భావన స్థానిక అస్సామీయుల్లో నెలకొన్నది.

మొదటిసారి 1951లో జనాభా గణనను చేపట్టి ఓ ఏడాది కాలంలో పౌర నమోదు రిజిష్టర్‌ను పూర్తిచేశారు. దేశ విభజనతో చోటుచేసుకున్న మత కలహాలలో పెద్ద ఎత్తున దేశ సరిహద్దుల వెంట వలసలు, చొరబాట్లు చోటుచేసుకున్నాయి. ఈ విధంగా ప్రజల వలసల నేపథ్యంలో నాటి పౌరగణనపై అనేక అసంతృప్తులు, అనుమానాలు ఏర్పడినాయి. 1951 నుంచీ అస్సాంలో పౌర రిజిష్టర్‌ను 2015 దాకా పౌర నమోదు ప్రక్రియను నిరంతర ప్రక్రియగా కొనసాగుతూనే ఉన్నది. ఈ పౌరగణన లక్ష్యమేమంటే రాష్టంలో ఉన్న అక్రమ వలసదారులను, విదేశీయులను గుర్తించటమే. 1971 బంగ్లాదేశ్ యుద్ధం తర్వాత పెద్ద ఎత్తున అస్సాంలోకి బంగ్లా నుంచి వలస వచ్చారని, అలాంటి వలస వచ్చిన విదేశీయులను గుర్తించి వెనక్కి పంపేయాలని అస్సాం ప్రజల ఆకాంక్ష. ఈ నేపథ్యంలోంచే బంగ్లాదేశ్ అవతరణ జరిగిన ఎనిమిదేండ్ల తర్వాత 1979లో అస్సాంలో విదేశీ వ్యతిరేక ఉద్యమం ప్రారంభమైంది. విదేశీయులు అస్సాంలోకి పెద్ద ఎత్తున చొరబడి ఎన్నికల్లో రాజకీయ ఆధిపత్యం చేసే పరిస్థితి వచ్చి, భవిష్యత్తుకు ప్రమాదం ఏర్పడిందని స్థానిక ప్రజలు ఆందోళన బాట పట్టారు.

విదేశీ చొరబాటుదారుల సమస్య మీదనే 1985లో ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఏఏఎస్‌యూ) విదేశీ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ క్రమంలోంచే ఏఏఎస్‌యూ 'అస్సాం ఒప్పందం' ఉనికిలోకి వచ్చింది. అస్సాం ఒప్పందం ప్రకారం.. 1966 నుంచి 1971 మధ్య అస్సాంలోకి వచ్చిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలిగించి, వారిని పదేండ్ల కాలం వరకు ఎన్నికల్లో పోటీ చేయటానికి అనర్హులుగా ప్రకటించాలి. పదేండ్ల కాలం పూర్తయిన తర్వాత తొలిగించిన పేర్లను తిరిగి ఓటర్ జాబితాలో చేర్చాలని ఒప్పందంలో రాసుకున్నారు. 1971 మార్చి 25 తర్వాత బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలో అస్సాంలోకి వచ్చినవారిని విదేశీయులుగా పరిగణించాలని అందులో పొందుపరిచారు. అస్సాంలో ఇప్పుడు చేపట్టిన జాతీయ పౌరసత్వ నమోదు రిజిష్టర్ ప్రకారం.. విదేశీయుల అన్న దానికి కొత్త నిర్వచనం చెబుతున్నారు. ఎవరైతే వారసత్వంగా అస్సామీకి చెందిన వారమనే రుజువులు సమర్పించకపోతే వారంతా విదేశీయులుగానే పరిగణింపబడుతారు. అంటే దీనర్థం.. 1971కి ముందు భారత్‌లో జన్మించినా తన కుటుంబీకులు, పూర్వీకులు తమ భారతీయతను రుజువు చేసుకోవాలి. లేనట్లయితే ఇక్కడ పుట్టినవారై 48 ఏండ్లు నిండినా విదేశీయులగానే పరిగణింపబడే పరిస్థితి ఏర్పడింది.

విదేశీయులని పిలువబడుతున్న వారి గుర్తింపు ప్రక్రియను అక్రమ వలసలను గుర్తించే 1983 చట్టం ప్రకారం చేస్తున్నట్లు చెప్పారు. అయితే దాన్ని సుప్రీంకోర్టు 2005లో కొట్టివేసింది. అలాగే ఆ చట్టం ప్రకారం.. అక్రమ వలసలు, చొరబాటుదారులు, విదేశీయులు అన్నదాన్ని గుర్తించటం చట్ట సమ్మతంగా లేదని అలా గుర్తించటం కూడా అసాధ్యమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సరిగ్గా ఆ సమయంలోనే నాటి అస్సాం ముఖ్యమంత్రి, ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ నేతలు, ప్రధాని మన్మోహన్‌సింగ్ కూర్చొని అస్సాం సమస్యపై చర్చించారు. జాతీయ పౌరగణన రిజిష్టర్‌ను ఎలా రూపొందించాలో ఈ త్రైపాక్షిక చర్చల్లో నిర్ణయించారు. అదే సందర్భంలో ఓ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టుకు పోయిన నేపథ్యంలో పౌర నమోదు రిజిష్టర్ నుంచి పేర్లను తొలిగించే ప్రక్రియను నిలిపివేయాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు జాతీయ పౌర నమోదు ప్రక్రియ విధివిధానాలను రూపొందించాలని 2013లో కేంద్రాన్ని కోరింది. అప్పటినుంచి పౌర నమోదు ప్రక్రియ అంతా సుప్రీం కనుసన్నల్లోనే కొనసాగుతున్నది.

పౌరసత్వాన్ని నిర్ధారించే ప్రక్రియ అస్సాంలో ఓ బృహత్తర కార్యంగా మారింది. ఇది అనేక దశలుగా కొనసాగుతున్నది. మొదట రాష్ట్రవ్యాప్తంగా జనాభా గణన చేపడుతారు. ఈ క్రమంలో గమనించాల్సిన విషయం ఏమంటే.. ఒంటరి వ్యక్తులు తమ పౌరసత్వాన్ని నిరూపించుకునే ప్రక్రియ సంక్లిష్టంగా మారింది. వారు తమ పేరు నమోదు కోసం జాతీయ పౌర నమోదు రిజిష్టర్ (ఎన్‌ఆర్‌సీ) దరఖాస్తు చేసుకోవాలి. వారి కుటుంబీకులు, పూర్వీకులు 1971కన్నా ముందునుంచే అస్సాంలో నివసిస్తున్నారని రుజువులు చూపాలి. వారితో తమకు ఉన్న రక్త సంబంధాన్ని నిరూపించుకోవాలి. అప్పుడే వారి దరఖాస్తు పరిశీలనకు నోచుకుంటుంది. దరఖాస్తుదారులు దాఖలుపరిచిన నిజ ప్రతులు ఆధారంగా ఎన్‌ఆర్‌సీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ధారిస్తారు. అలా ఒక దరఖాస్తుదారున్ని రక్తసంబంధీకులకు చెందినవారిగా గుర్తించి వారి కుటుంబ సభ్యుడిగా పరిగణిస్తారు.

ఈ నేపథ్యంలో అస్సాంలోని బెంగాలీ ముస్లింలు ఎక్కువగా బంగ్లాదేశీయులుగా, విదేశీయులుగా పరిగణింపబడుతున్న స్థితి ఉన్నది. ఎక్కువగా వారిపైనే అనేక విధాలుగా పరిశీలనలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఎన్‌ఆర్‌సీలో అస్సాంలోని నిజ వాస్తవ్యుల సమస్య 2017లో ముందుకువచ్చింది. ఎన్‌ఆర్‌సీ అధికారుల ప్రకారం కూడా నిజ వాస్తవ్యుల విషయంలో శల్యపరీక్షలు, పరిశీలనలు ఉండటం లేదన్న వాదన కూడా ఉన్నది. దీంట్లో ఎక్కువగా ముస్లింలున్నారన్న ప్రచారం కూడా ఉన్నది. ఈ నేపథ్యంలో గౌహతి హైకోర్టు 2017లో గ్రామపంచాయతీ ఇచ్చిన నివాస పత్రాలు 1971 తర్వాత జన్మించిన వారి విషయంలో అనుసంధాన పత్రాలుగా పరిగణించబడవని తీర్పునిచ్చింది. ఈ విధమైన పరిస్థితి వివాహమైన మహిళలకు మరిన్ని కష్టాలను తెచ్చింది. ఆ తర్వాత పరిణామాల్లో గ్రామపంచాయతీ ఇచ్చిన సర్టిఫికెట్లకు మరికొన్ని పత్రాలు జతపరిస్తే చెల్లుతాయన్నారు. 2017 డిసెంబర్ 31న ప్రకటించిన మొదటి జాబితాలో ఈ మహిళల సమస్య తీవ్రంగా కనిపించింది. 2018 జూలై 30న ప్రకటించిన రెండో డ్రాఫ్ట్ ప్రకారం.. 2.48 లక్షల మదిని 'డి' ఓటర్లుగా గురించారు. డీ అంటే డౌట్‌ఫుల్ (అనుమానాస్పద) పౌరులని అర్థం. ఇలా లక్షలాదిగా డీ ఓటర్లుగా ఉన్నవారి సమస్యలను ఎలా పరిష్కరిస్తారన్న దానికి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారమేదీ కనిపించటంలేదు.

ఎన్‌ఆర్‌సీ విడుదల చేసే తుది జాబితా 42 లక్షల మంది పౌరుల భవిష్యత్తును తేల్చనున్నది. ఇంత జనాభా కలకత్తా నగరంలో సగం జనాభాకు సమానం. అలాగే స్విట్జర్‌లాండ్ దేశ జనాభాకు సగం. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు పౌరసత్వం తేలని స్థితి ఉండటం దుర్లభం. ఇలాంటి పరిస్థితి మరెన్నో సమస్యలకు దారితీస్తుంది.

ఇప్పటిదాకా ఎన్‌ఆర్‌సీకి 3.29 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 2.89 లక్షల మందిని మాత్రమే 2018 జూలై 30న విడుదల చేసిన డ్రాఫ్ట్‌లో చేర్చారు. కానీ ఇంకా 40.7లక్షల మంది ఇంకా ఎటూ తేలని స్థితిలో ఉన్నారు. ఇందులో సైనికులుగా పనిచేసినవారు, ప్రభుత్వోద్యోగులు మరెంతో మంది ఉన్నారు. ఎవరెక్కడ పుట్టారన్న దానికి విస్పష్ట గణాంకాలేవీ లేవు. కానీ దీంతో బెంగాల్‌కు చెందిన వారే ఎక్కువగా ప్రభావితమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఏదేమైనా ఎన్‌ఆర్‌సీ విడుదల చేసే తుది జాబితా 42 లక్షల మంది పౌరుల భవిష్యత్తును తేల్చనున్నది. ఇంత జనాభా కలకత్తా నగరంలో సగం జనాభాకు సమానం. అలాగే స్విట్జర్లాండ్ దేశ జనాభాకు సగం. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు పౌరసత్వం తేలని స్థితి ఉండటం దుర్లభం. ఇలాంటి పరిస్థితి మరెన్నో సమస్యలకు దారితీస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు విదేశీయుల గుర్తింపునకు అనుసరిస్తున్న విధివిధానాలతో పాటు, మానవీయ కోణంలో ఆలోచించి అడుగులు వేయాలి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం విదేశీయులుగా తేలినవారిని ఉంచేందుకు ప్రత్యేక నివాస కేంద్రాలను ఏర్పాటు చేయటం గమనార్హం. ఇప్పటికే మూడు వేల మంది ఉండేవిధంగా నిర్బంధ క్యాంపులను ఏర్పాటుచేసింది. ఒక సమస్య పరిష్కారానికి తీసుకునే చర్యలు మరిన్ని సమస్యలకు ఆజ్యం పోయకుండా ఉండాలి. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచించాలి, అడుగులు వేయాలి.

**(స్క్రోల్ సౌజన్యంతో..)**

# ప్రజాపండుగకు పాలకుల పట్టం

**తెలంగాణం**



**కోలేటి దామోదర్**

తెలంగాణలో జరిపే బతుకమ్మ, బోనాలు, పీర్ల పండుగలు, తీజ్ ఉత్సవం తెలంగాణ జీవన విధానానికి ప్రతీకలు. మరే ప్రాంతంలోనూ ఇలాంటి పండుగలు లేవు. నిరుపమానమైన, ఎంతో ఉత్కృష్టమైన తెలంగాణ సంస్కృతి రాజకీయ కారణాల వల్ల ఉమ్మడి రాష్ట్రంలో మరుగున పడిపోయింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం మన సంస్కృతి పట్ల మనలో స్ఫూర్తిని రగిలించిన మహావ్యక్తి సీఎం కేసీఆర్. తెలంగాణ ప్రజలను రాజకీయంగా, సాంస్కృతికంగా జాగృతం చేసి, గాంధీ పంథాలో అహింసా పద్ధతిలో సుదీర్ఘకాలం పాటు ఒక మహోద్యమాన్ని నడిపారు. మన గత వైభవాన్ని గుర్తుకుచేసి, రాష్ట్రాన్ని సాధించిన పరిణతి చెందిన రాజనీతిజ్ఞుడు కేసీఆర్.

తెలంగాణ ఉద్యమస్ఫూర్తి మన సంస్కృతికి పునర్వికాసం, పునరుజ్జీవనం కలిగాయి. ఈ విషయంలో మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పోషించిన పాత్ర అద్వితీయం. తెలంగాణ జాగృతి సంస్థను స్థాపించి, బతుకమ్మ పండుగను వాడవాడలా నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావ అనంతరం తెలంగాణ సాంస్కృతిక ఉత్సవాలైన బోనాలు, బతుకమ్మ వంటి పండుగలను రాష్ట్ర పండుగలుగా గుర్తించి ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నది. ఈ ప్రోత్సాహం తెలంగాణ సంస్కృతి, కళల వికాసానికి ఎంతగానో దోహదపడుతుందనడంలో సందేహం లేదు.

తెలంగాణ సంస్కృతిలో బోనాలు, బతుకమ్మ పండుగలు అతి ముఖ్యమైన సామాజిక ఉత్సవాలు. బోనాలు ఆషాఢమాసంలో తొలకరి ప్రారంభమైన తర్వాత పంటలు వేస్తూ చేసుకునే పండుగ. బతుకమ్మ ఆశ్వయుజ మాసంలో పొలాలు పైరుపచ్చలతో కళకళలాడుతుండగా చేసుకునే పండుగ. రెండు ప్రకృతికి సంబంధించిన పండుగలే.

బోనాల పండుగ అమ్మవారి పండుగ. అమ్మవారికి పెట్టే నైవేద్యమే బోనం. బోనం అంటే భోజనం. కొత్త కుండలో బియ్యం, బెల్లం కలిపి వండుతారు. ఒక కొత్త కుండకు సున్నం పూసి, జాజు, పసుపు, కుంకుమలతో బొట్లుపెట్టి అందంగా అలంకరిస్తారు. ఆ కుండలో ఈ బెల్లం అన్నం నైవేద్యాన్ని వంచి, కుండపై చుట్టూ వేపాకులు పేర్చి, దానిపై చిన్న గిన్నెలో పానకం పోసి, ఆ పానకం గిన్నెపై ఒక ప్రమిదను అమర్చి మహిళలు బోనాన్ని ఎత్తుకొని, అమ్మవారి ఆలయానికి బయల్దేరుతారు. కొందరు అమ్మవారికి పెరుగన్నాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. దీన్ని చద్ది అని పిలుస్తారు. పసుపు నీటిని వేపాకులతో చల్లుకుంటూ బోనం ఎత్తుకున్న వారిని అనుసరించి ఇంటిల్లిపాదీ డప్పులు, కొమ్ములు, డోళ్ళు వాయించుకుంటూ అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకుంటారు. బోనాన్ని అమ్మవారికి సమర్పించిన తర్వాత ఆ ప్రసాదాన్ని భక్తులు ఇంటికి తెచ్చుకొని, కుటుంబ సభ్యులకు, చుట్టుపక్కల వారికి పంచిపెడుతారు. కొందరు భక్తులు బోనంతో పాటుగా కోడిపుంజులను, మేకపోతులను, పొట్టేళ్ళను కూడా అమ్మవారికి బలిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. బోనాల పండుగలకు ఆడపిల్లలను పుట్టిళ్ళకు పిలుచుకోవడం కూడా తెలంగాణలో ఆనవాయితీ.

తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్–సికింద్రాబాద్ జంటనగరాల్లో అత్యంత వైభవంగా జరుపుకునే బోనాల పండుగకు చారిత్రక నేపథ్యం ఉన్నది. ఇది తెలంగాణ ప్రజల జీవనవిధానంలో ఒక భాగం. ఆషాఢమాసంలో ముప్పై రోజులు మూడు ప్రధాన ప్రాంతాల్లో వేర్వేరుగా జాతరలు నిర్వహిస్తారు. ఇది వనదేవతల ఆరాధన. పురాతనమైన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ఆషాఢమాసం ప్రారంభమయ్యే మొదటిరోజే బోనాల జాతర ప్రారంభమవుతుంది. ఏడాది మొత్తం పొలాలు పచ్చదనంతో కళకళలాడాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రశాంత జీవనం గడుపాలని కోరుకుంటారు.

హైదరాబాద్ చారిత్రక నేపథ్యానికి నిలువెత్తు నిదర్శనమైన గోల్కొండ కోటలో శ్రీ జగదాంబిక అమ్మవారి రూపంలో వెలసిన ఆదిపరాశక్తికి తొలి బోనం, తొట్టెలను సమర్పించడంతో ఈ బోనాల జాతర మహాఘట్టం ప్రారంభమవుతుంది. ఆషాఢమాసం చివరిరోజున మళ్ళీ ఇక్కడి అమ్మవారికి చివరి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత బోనాల జాతర ముగుస్తుంది.

హైదరాబాద్ చారిత్రక నేపథ్యానికి నిలువెత్తు నిదర్శనమైన గోల్కొండ కోటలో శ్రీ జగదాంబిక అమ్మవారి రూపంలో వెలసిన ఆదిపరాశక్తికి తొలి బోనం, తొట్టెలను సమర్పించడంతో ఈ బోనాల జాతర మహాఘట్టం ప్రారంభమవుతుంది. ఆషాఢమాసం చివరిరోజున మళ్ళీ ఇక్కడి అమ్మవారికి చివరి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత బోనాల జాతర ముగుస్తుంది. గోల్కొండ కోటలో తొలి బోనాల జాతర ప్రారంభమైన తర్వాత సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి జాతర జరుగుతుంది.

వందల సంవత్సరాల ఘన చరిత్ర గల హైదరాబాద్ నగరం పాతబస్తీలో నెలకొని ఉన్న మహిమాన్విత దేవాలయం లాల్‌దర్వాజలోని శ్రీ సింహవాహిని మహంకాళి దేవాలయం. ఈ దేవాలయానికి 4 వందల ఏండ్ల మహత్తర చరిత్ర ఉన్నది. ఇక్కడ వెలసిన మహంకాళి అమ్మవారు భక్తులకు కొంగుబంగారంగా నెలకొని ఉండి, కోరికలను తీర్చుతుందనేది భక్తుల విశ్వాసం.

2014 జూన్ 2న తెలంగాణ ప్రజల కలల పంటగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. తెలంగాణ ప్రజలు తరతరాలుగా ఎంతో వైభవోపేతంగా జరుపుకుంటున్న బోనాల పండుగను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని తెలంగాణ ఉద్యమకాలంలో కేసీఆర్ బలంగా నినదించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల పండుగను రాష్ట్ర పండుగగా ప్రకటించడమే కాకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ అమ్మవారికి స్వయంగా బంగారు బోనం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రజల ఆకాంక్ష నెరవేరిన సందర్భంగా మొక్కు చెల్లించుకున్నారు. 1908వ సంవత్సరంలో నిజాం నవాబు మూసీ నది వరదల సందర్భంగా బోనం ఎత్తిన తర్వాత మళ్లీ 106 సంవత్సరాలకు మరొక తెలంగాణ పాలకుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ అమ్మవారికి బోనం ఎత్తారు. అమ్మవారి పట్ల తనకున్న భక్తి ప్రపత్తులను, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తనకు గల అపారమైన గౌరవాదరాలను కేసీఆర్ ప్రకటించారు. అంతేగాక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పంతో దేశ రాజధాని ఢిల్లీలో కూడా 2015 నుంచి ఏటా బోనాల పండుగను నిర్వహిస్తున్నారు. బోనాలు జరిగే ప్రతి ఆలయానికి ప్రభుత్వమే నిధులు కేటాయించి, వసతి సౌకర్యాలు, అలంకరణ వంటి ఏర్పాట్లు చేస్తున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ అనుసరించే విధానాన్ని తెలంగాణ భాషా సంస్కృతులను ప్రేమించే ప్రజలంతా సంతోషంగా స్వాగతిస్తూ ఆయనకు అభినందనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు బోనాల పండుగ శుభాకాంక్షలు.

**(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



చింతమడక గోదాం వద్ద సీఎం సమావేశ వేదిక ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

■ చింతమడకను పరిశీలించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తేతెలంగాణ:** సీఎం కేసీఆర్ తన స్వగ్రామమైన చింతమడకకు రానున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. మంగళవారం ఆయన కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి సిద్దిపేట జిల్లా చింతమడకలో సుమారు రెండు గంటలపాటు పర్యటించారు. చింతమడకలో సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయనున్న బీసీ గురుకుల పాఠశాల వసతిగృహ స్థలంతోపాటు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్న డబుల్‌బెడ్‌రూం ఇండ్లను పరిశీలించి ప్రారంభోత్సవ ఏర్పాట్లపై కలెక్టర్, సర్పంచ్‌తో చర్చించారు. గ్రామ శివారులో ఏర్పాటుచేసిన హెలీపాడ్ స్థలాన్ని, సభ సమావేశం జరిగే స్థలాన్ని పరిశీలించారు. ఐకేపీ గోదాం సీసీ ప్లాట్‌ఫామ్ వద్ద సీఎం సభ నిర్వహించాలని, దాదాపు 3,200 మంది గ్రామస్థులకు, 200 మంది అధికారులకు కుర్చీలు ఏర్పాటుచేయాలని, మరో 200 కుర్చీలతో ప్రెస్‌గ్యాలరీ ఏర్పాటుచేయాలని సూచించారు. సభా ప్రాంగణం మొత్తం రెయిన్ ప్రూఫ్‌తో ఉండాలన్నారు. పెద్దమ్మ దేవాలయ ప్రాంగణంలో వనభోజనాలు చేసే స్థలాన్ని పరిశీలించారు. ఆలయం పక్కనున్న చింతచెట్టు కింద సీఎం కేసీఆర్ సహపంక్తి భోజనం చేయనున్న స్థలంలో జరుగుతున్న ఏర్పాట్లపై కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, ఏసీపీ రామేశ్వర్, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డితో చర్చించారు.



వనపర్తి జిల్లా కొత్తకోటలో సోమవారం పలు అభివృద్ధి పనులకు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలను సుందరీకరిస్తామని, ఇందుకోసం కొత్తకోటకు రూ.20 కోట్ల నిధులు మంజూరైనట్టు చెప్పారు. - మదనాపురం





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో టీఆర్ఎస్ సభ్యత్వాలను అందజేస్తున్న మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్




నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



జగిత్యాలలో ఆటో డ్రైవర్లకు టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్. చిత్రంలో ఇంచార్జి రూప్‌సింగ్



వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తిలో సోమవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి




# సభ్యత్వాల హవా..

జోరుగా టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ■ గడువుకు ముందే లక్ష్యాన్ని దాటుతున్న జిల్లాలు ■ ఆనందంలో పార్టీ శ్రేణులు



సోమవారం మహబూబ్‌నగర్‌లో టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



మేడ్చల్ జిల్లా అన్నోజిగూడలో మహిళలకు సభ్యత్వ నమోదు రసీదు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** సభ్యత్వాల నమోదులో టీఆర్ఎస్ హవా కొనసాగుతున్నది. గడువుకు ముందే లక్ష్యానికి మించి సభ్యత్వాలు నమోదవుతున్నాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు, ఇతర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. సభ్యత్వ నమోదుకు వస్తున్న స్పందనను చూసి పార్టీ నాయకులు సంబురపడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ పలువురికి సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ భవిష్యత్తులో టీఆర్ఎస్ తిరుగులేని శక్తిగా ఎదిగి ప్రజల గుండెల్లో మరింత నాటుకుపోతుందన్నారు. వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండలంలోని 39 గ్రామాల్లో నిర్వహిస్తున్న టీఆర్ఎస్ సభ్యత్వ నమోదుపై మండల పార్టీ నాయకులు, ముఖ్య నేతలతో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం రాయపర్తిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో ప్రస్తుతం 75వేల మార్క్‌ను దాటి లక్ష సభ్యత్వాల నమోదు వైపు పరుగులు పెడుతున్నట్టు తెలిపారు. సమావేశంలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జి జన్ను జఖార్య తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ, అన్నోజిగూడలో నిర్వహించిన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి పార్టీ సభ్యత్వాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని పార్టీ నాయకులకు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాకలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఇదే జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పార్టీ సభ్యత్వం అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కోడ్గల్‌లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి చాడ కిషన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, ఉప్పునుంతల మండల కేంద్రంలో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జగిత్యాలలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఇంచార్జి రూప్‌సింగ్ పలువురికి పార్టీ సభ్యత్వాలను అందజేశారు.



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కోడ్గల్‌లో గిరిజనులకు సభ్యత్వాలను అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో మాజీ మంత్రి తుమ్మలకు టీఆర్ఎస్ సభ్యత్వాన్ని అందజేస్తున్న రాష్ట్ర కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి



మహబూబాబాద్ పట్టణంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, బోడకుంటి, ఎమ్మెల్యే శంకర్ నాయక్

# పట్టణాల అభివృద్ధికి కృషి

పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, రానున్న రోజుల్లో అన్ని మున్సిపాలిటీలు అద్దంలా మెరుస్తాయని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మంత్రి ఎర్రబెల్లి మహబూబాబాద్ జిల్లాలో పర్యటించారు. ముందుగా నెల్లికుదురులో 50 డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదుట రూ.5.58 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మహబూబాబాద్ పట్టణం సమీపంలోని గుమ్మడూర్‌లో 160 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మున్సిపాలిటీలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇటీవల మున్సిపాలిటీలకు భారీగా నిధులు విడుదల చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సమావేశంలో కలెక్టర్ శివలింగయ్య, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు బోడకుం టి వెంకటేశ్వర్లు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**పార్టీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన**

**రాయపర్తి:** వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు.

# పేదలందరికీ ఉచిత వైద్యం సీఎం లక్ష్యం

■ దేశంలోనే అభివృద్ధిలో అగ్రగామిగా తెలంగాణ

■ మంత్రులు ఈటల, జగదీశ్‌రెడ్డి

■ నాగార్జునసాగర్‌లో 100 పడకల దవాఖాన ప్రారంభం





నాగార్జునసాగర్‌లో 100 పడకల దవాఖానను ప్రారంభిస్తున్న మంత్రులు ఈటల, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే నోముల, తదితరులు.. సభకు హాజరైన జనం

**హాలియా, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని పేదలందరికీ రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందించడం సీఎం కేసీఆర్ లక్ష్యమని వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా నందికొండ(నాగార్జునసాగర్) మున్సిపాలిటీలో రూ.18 కోట్ల వ్యయంతో నిర్మించిన కమలానెహ్రూ వంద పడకల దవాఖానను విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అభివృద్ధి కుంటుపడుతుందని ఆంధ్ర పాలకులు అపోహలు సృష్టించారని అన్నారు. తెలంగాణ వస్తే చీకట్లు కమ్ముకుంటాయని, ఎడారిగా మారుతుందన్న వలస పాలకుల కుట్రను ఛేదించిన సీఎం కేసీఆర్ అభివృద్ధిలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలుకాని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయన్నారు. జిల్లాకేంద్రాల్లో సైతం రాజధాని తరహా కార్పొరేట్ వైద్యాన్ని అందేలా నల్లగొండ, సూర్యాపేటల్లో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వ దవాఖానాలో అన్ని వైద్యసేవలు అందుతాయన్నారు. అమ్మఒడి, కేసీఆర్ కిట్ పథకాల ద్వారా సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. వ్యవసాయరంగానికి రాష్ట్రంలో 24గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామనీ, తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేసే దమ్ముందా అని మంత్రి ఈటల ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు కమీషన్ల యావ తప్ప ప్రజల కష్టాలు పట్టవని మండిపడ్డారు. విద్యాశాఖామంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ఆకలి చావులు, ఆత్మహత్యలు లేకుండా ప్రజల్లో విశ్వాసం కల్గించేలా పాలన కొనసాగుతుందన్నారు. నెల్లికల్లు లిఫ్టును మంజూరు చేయించి స్వయంగా సీఎం కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి ఆత్మహత్యా యత్నం

**మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఘాట్‌రోడ్‌లో కరీంనగర్ జిల్లా చెర్ల భూత్కూర్ గ్రామానికి చెందిన ఇజ్జగిరి విజయ్ అనే విద్యార్థి సోమవారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. విజయ్ మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో మైనింగ్ డిప్లొమా కోర్సు అభ్యసిస్తున్నాడు. చదువుపై విరక్తిచెంది సోమవారం రాత్రి కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్‌లో నీటిట్యాంక్ వద్ద పురుగుల మందు తాగి డయల్ 100కు ఫోన్‌చేశాడు. సమాచారం అందుకున్న మల్యాల పోలీస్‌స్టేషన్ బ్లూకోట్స్ విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుళ్లు శ్రీనివాస్, బాబు చేరుకొని 108 కు సమాచారం అందించారు. జగిత్యాల ఏరియా దవాఖానకు తరలించారు.

# 'అరాగట్స్'ను అధిరోహించిన జగిత్యాల యువకుడు



అరాగట్స్ పర్వతంపై జాతీయ జెండాతో మరిపెల్లి ప్రవీణ్

**మెట్‌పల్లి రూరల్:** అర్మేనియా దేశంలోని అత్యంత ఎత్తైన 'అరాగట్స్' పర్వతాన్ని జగిత్యాల జిల్లా యువకుడు అధిరోహించాడు. మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన మరిపెల్లి ప్రవీణ్ గుజరాత్ రాష్ట్రం వడోదరలోని యోగానికేతన్‌లో యోగా శిక్షకునిగా పని చేస్తున్నాడు. ఎత్తైన పర్వతాలను అధిరోహిస్తూ తక్కువ ఉష్ణోగ్రతలో సూర్యనమస్కారాలు చేయడాన్ని అలవాటుగా మార్చుకున్నాడు. ఈ నెల 14న అర్మేనియా దేశంలోని అత్యంత ఎత్తయిన అరాగట్స్ పర్వతాన్ని అధిరోహించి 3,995 మీటర్ల ఎత్తులో మైనస్ 3 డిగ్రీల ఉష్ణోగ్రతలో 108 సూర్య నమస్కారాలను 25 నిమిషాల్లో పూర్తి చేశాడు. అనంతరం జాతీయ జెండాను చేత పట్టుకొని జాతీయ గీతాలాపన చేశాడు. కాగా ప్రవీణ్ గతంలో హిమాచల్‌ప్రదేశ్‌లోని మనీమహేశ్ కైలాస్ పర్వతం, ఎవరెస్టు బేస్ క్యాంప్, మేరా పర్వతం, జర్మనీలోని గ్రున్‌టెన్ పర్వతం, జుగ్‌స్పైట్జ్ పర్వతం, ఫ్రాన్స్‌లోని మౌంట్‌బ్లా పర్వతాలను అధిరోహించి మైనస్ డిగ్రీల్లో 108 సార్లు సూర్య నమస్కారాలు చేశాడు. మేరా పర్వతంపై చేసిన సూర్య నమస్కారాలకు 2019లో 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్' చోటు దక్కింది.

# వసతి గృహంలో అగ్నిప్రమాదం

బాలిక మృతి.. మరో నలుగురికి గాయాలు




స్పందన (ఫైల్)

**మామిళ్లగూడెం:** ఎస్సీ వసతి గృహంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఒక విద్యార్థిని మృతిచెందగా నలుగురికి స్వల్పగాయాలైన ఘటన ఖమ్మం నగరంలో ఆదివారం రాత్రి 11:30 గంటల సమయంలో చోటుచేసుకున్నది. ప్రమాదంలో నాలుగో తరగతి చదువుతున్న బరపటి స్పందన(9) అక్కడికక్కడే మృతి చెందింది. ఆదివారం రాత్రి వసతి గృహంలో విద్యార్థులు నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం వచ్చి మంటలు చెలరేగగా, దట్టంగా పొగలు అలుముకున్నాయి. విద్యార్థుల కేకలువేయడంతో స్థానికులు వసతి గృహం వద్దకు చేరుకుని పిల్లలను రక్షించారు. లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో చిన్నారులు ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో స్పందన అనే విద్యార్థిని మంటల్లో చిక్కుకుని ప్రాణాలు విడిచింది. బాధిత కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం తరుపున రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు బాధ్యులైన వసతి గృహ సంక్షేమాధికారి వినోదను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. వసతి గృహంలో జరిగిన సంఘటనపై రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పందించారు. ప్రమాదం గురించి జిల్లా ఎస్సీ అభివృద్ధి సంక్షేమాధికారి కస్తాల సత్యనారాయణకు ఫోన్ చేసి మాట్లాడారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యంగా ఉండాలని సూచించారు.

# పూడూరులో పురాతన నాణేలు లభ్యం


11 బంగారు, 19 వెండి నాణేలు స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు



పూడూరులో లభించిన పురాతన నాణేలు

**గద్వాల క్రైం:** జోగుళాంబ గద్వాల జిల్లా పూడూరు గ్రామంలో పురాతన నాణేలు లభ్యమయ్యాయి. గ్రామానికి చెందిన వెంకన్న గత మంగళవారం తన ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టాడు. మట్టి తవ్వుతుండగా చిన్న మట్టికుండలో పురాతన బంగారు, వెం డి నాణేలు కొన్ని బయటపడ్డాయి. ఈ విష యం బయటికి పొక్కడంతో సోమవారం తాసిల్దార్ జ్యోతి, గద్వాల రూరల్ ఎస్సై నాగశేఖర్‌రెడ్డి వెంకన్న ఇంట్లో తనిఖీ చేశారు. తన కు మట్టికుండలో 11 బంగారు, 19 వెండి నాణేలు లభించాయని వెంకన్న అధికారులకు చెప్పారు. దీంతో సుమారు తులం బరువున్న 11 బంగారు నాణేలు, 2 తులాల బరువున్న 19 వెండి నాణేలు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. వాటిని పురావస్తు శాఖకు అప్పగించనున్నట్టు తాసిల్దార్ జ్యోతి తెలిపారు.

# రాజోళిలో బయటపడ్డ ఫిరంగి



రాజోళిలో బయటపడిన రాజులకాలం నాటి ఫిరంగి

**రాజోళి:** జోగుళాంబ గద్వాల జిల్ల రాజోళిలో రాజుల కాలం నాటి యుద్ధ ఫిరంగి బయటపడింది. రాజోళిలో ఏండ్ల క్రితం రాజుల పరిపాలించగా, వారి పాలనకు సంబంధించిన ఆనవాళ్లు అప్పుడప్పుడు బయటపడుతున్నాయి. తాజాగా సోమవారం వైకుంఠ నారాయణ స్వామి ఆలయ సమీపంలోని పొలంలో ఫిరంగి బయటపడింది. రాజుల కాలంలో నిర్మించిన కోట గోడలు కూడా ఇక్కడ ఇంకా ఉండగా.. ఆ కోట బురుజులో ఉన్న ఫిరంగే కింద పడి, బరువుగా ఉండటంతో మట్టిలో కూరుపోయి ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇటీవల రైతు పొలం దున్నుతుండగా నిత్యం కొంత బయటకు వచ్చింది. సోమవారం పూర్తిగా బయటపడటంతో వెలుగులోకి వచ్చింది.

## ట్రిపుల్ ఐటీ ఘటనపై కోర్టుకు దర్యాప్తు నివేదిక

**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ:** బాసర ట్రిపుల్ ఐటీలో లైంగిక వేధింపుల ఘటనపై సోమవారం ఏవో శ్రీహరి, పీఆర్వో మధుసూదన్‌లతో పాటు ఎస్పీ, డీఎస్పీ తరపున సీఐ శ్రీనివాస్ హాజరై దర్యాప్తు నివేదికను జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శికి అందజేశారు. విద్యార్థినిని అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఈ నెల 8న దినపత్రికల్లో ప్రచురితమైన వార్తలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సుమోటాగా తీసుకొని ఐదుగురిపై 1382 పీఎల్‌సీ కింద కేసు నమోదు చేశారు.

## ఖమ్మం కార్పొరేషన్‌లో టిక్‌టాక్ వీడియోలు

**ఖమ్మం నమస్తే తెలంగాణ:** ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు టిక్‌టాక్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన వీడియోలు సోమవారం చర్చనీయాంశంగా మారాయి. కార్పొరేషన్ కార్యాలయంలో అనిత, జ్యోతి, రవి, ప్రవీణ్, వీరన్న ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారు. వీరు పని సమయంలో కార్యాలయంలోనే టిక్‌టాక్ వీడియోలు తీసుకుంటూ విధుల్లో అలసత్వం ప్రదర్శించారు. రెండు నెలల క్రితం వీడియోలు వెలుగులోకి రావడంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మందలించారు. పస్తుతం ఆ వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి.

## ఏఎస్సై మోహన్‌రెడ్డిపై కేసు కొట్టివేత

**కరీంనగర్ లీగల్ :** అక్రమ వడ్డీ వసూలు వ్యవహారంలో కరీంనగర్ కెన్‌క్రెస్ట్ పాఠశాల యజమాని ప్రసాద్‌రావు ఆత్మహత్య కేసులో ఏఎస్సై మోహన్‌రెడ్డి,అతని అనుచరులను నిర్దోషులుగా పేర్కొంటూ కరీంనగర్ కోర్టు న్యాయమూర్తి సతీశ్‌కుమార్ తీర్పునిచ్చారు. 2013లో ఏఎస్సై మోహన్‌రెడ్డి వద్ద ప్రసాదరావు రూ.75 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తర్వాత అప్పు చెల్లించాలంటూ ప్రసాద్‌రావును అతని కుటుంబీకులను మోహన్‌రెడ్డి బెదిరింపులకు గురిచేశాడు. దీంతో ప్రసాదరావు 2015 అక్టోబర్ 28న ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం సీఐడీ పోలీసులకు బదిలీ చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు 56 మంది సాక్షులను విచారించి పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి సతీశ్‌కుమార్ సోమవారం ఏఎస్సై మోహన్‌రెడ్డితోపాటు అతని అనుచరులు నిర్దోషులుగా తీర్పు చెప్పారు.

## గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్‌లకు కొత్త గవర్నర్లు


కల్‌రాజ్ మిశ్రా, దేవవ్రత్

**న్యూఢిల్లీ, జూలై 15:** గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలకు కేంద్రం సోమవారం కొత్త గవర్నర్లను నియమించింది. గుజరాత్ గవర్నర్‌గా ఆచార్య దేవవ్రత్‌ను, హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా కల్‌రాజ్ మిశ్రాను కేంద్రం నియమించింది. ఆచార్య దేవవ్రత్ గతంలో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్‌గా పని చేశారు. ఈయన్ని గుజరాత్ గవర్నర్‌గా నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. హిమాచల్‌ప్రదేశ్ కొత్త గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా 2017లో మోదీ క్యాబినెట్‌లో బాధ్యతలు నిర్వహించారు. 78 సంవత్సరాల వయసున్న ఈయన బీజేపీ వయసు నిబంధన మూలంగా.. గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేదు.

## సాక్షి మిశ్రా దంపతులపై కోర్టు ఆవరణలో లాయర్ల దాడి

బీజేపీ ఎమ్మెల్యే కుమార్తె వివాహం వివాదంలో మరో పరిణామం

**అలహాబాద్:** ఉత్తర్‌ప్రదేశ్ బీజేపీ ఎమ్మెల్యే రాజేశ్ మిశ్రా కుమార్తె సాక్షి మిశ్రా కులాంతర వివాహం విషయంలో సోమవారం మరో పరిణామం చోటుచేసుకుంది. తమకు రక్షణ కల్పించాలంటూ కోర్టు గుమ్మం తొక్కిన ఈ జంటపై కొందరు లాయర్లు కోర్టు ఆవరణలోనే దాడి చేయడం కలకలం రేపింది. ప్రేమ వివాహం చేసుకున్న సాక్షి మిశ్రా, ఆమె భర్త అజితేశ్ కుమార్ తమకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం ఉదయం అలహాబాద్ హైకోర్టులో హాజరయ్యారు. కోర్టు విచారణ పూర్తయి, బయటకు వస్తున్న ఈ జంటపై కొందరు న్యాయవాదులు దాడికి పాల్పడ్డారు. అయితే ఆ దాడుల నుంచి ఈ దంపతులను అక్కడే ఉన్న మరికొందరు లాయర్లు కాపాడారు. సాక్షి మిశ్రా, అజితేశ్ కుమార్‌కు రక్షణ కల్పించాలని జస్టిస్ సిద్దార్థ వర్మ ఆదేశించిన కొద్దిసేపట్లోనే ఈ దాడి జరుగడం గమనార్హం. జరిగిన ఘటనపై సాక్షి దంపతులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, వాళ్లపై దాడి జరిగినట్టు మీడియాలో వచ్చిన వార్తలు నిరాధారమని కంటోన్మెంట్ పోలీసు అధికారి ఏ కే గౌతమ్ తెలిపారు. కాగా కోర్టు ఆవరణలో అదే సమయంలో మరో జంటను కొందరు దుండగులు అపహరించారని, గాలింపు చేపట్టి ఆ జంటను కాపాడామని



అలహాబాద్ ఎస్పీ అతుల్ శర్మ తెలిపారు. అయితే, ఈ వ్యవహారంలో కిడ్నాప్‌కి గురైన వాళ్లు సాక్షి, అజితేశ్ అన్న వదంతులు వ్యాపించాయని చెప్పారు. పెండ్లి చేసుకున్న అనంతరం తన తండ్రి నుంచి తమకు ప్రాణహాని ఉందంటూ సాక్షి మిశ్రా ఇటీవల ఓ వీడియోలో పేర్కొన్న విషయం తెలిసిందే.

## బాబ్రీ మసీదు కేసు ముగించేందుకు..
## మరో ఆరు నెలల గడువు ఇవ్వండి!

- సుప్రీంకోర్టును కోరిన ప్రత్యేక న్యాయమూర్తి

**న్యూఢిల్లీ:** బాబ్రీ మసీదు కూల్చివేత కేసు విచారణను ముగించేందుకు మరో ఆరు నెలల గడువు కావాలని ఈ కేసుపై విచారణ జరుపుతున్న ప్రత్యేక న్యాయమూర్తి సుప్రీంకోర్టును కోరారు. బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో బీజేపీ సీనియర్ నేతలు ఎల్ కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి, ఉమా భారతితో పాటు పలువురు నాయకుల ప్రమేయంపై ప్రత్యేక న్యాయమూర్తి విచారణ జరుపుతున్నారు. గత మే 25న ఆయన సుప్రీంకోర్టుకు ఒక లేఖ రాస్తూ.. ఈ ఏడాది సెప్టెంబర్ 30న తాను రిటైర్ అవుతున్నట్టు తెలియజేశారు. గత రెండేండ్లుగా తాను ఈ కేసును రోజువారీ విచారణ జరుపుతున్నానని, విచారణ ముగించడానికి మరో ఆరు నెలల వ్యవధి కావాలని కోర్టుకు విన్నవించారు. ఈ అంశంపై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ నారిమన్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం.. ప్రత్యేక జడ్జి రిటైర్ అవుతున్నప్పుడు, గడువు పెంచే విషయంలో ఎలాంటి నిబంధనలు ఉన్నాయో ఈ నెల 19నాటికి తెలియజేయాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# సాంకేతిక సమస్యతో
# ఆగిన చంద్రయానం

వ్యోమనౌకలో లోపాన్ని గుర్తించిన శాస్త్రవేత్తలు

ప్రయోగానికి 56.24 నిమిషాల ముందు కౌంట్‌డౌన్ నిలిపివేత

రాకెట్, ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ సురక్షితం ● నెలాఖరున మళ్లీ ప్రయోగించే అవకాశం





**శ్రీహరికోట, జూలై 15:** రెండోసారి జాబిల్లి యాత్రకు వెళ్లాలన్న భారత్ ప్రయత్నాలకు విఘాతం ఏర్పడింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-2 ప్రయోగం ఆగిపోయింది. 'బాహుబలి'గా పిలుస్తున్న జీఎస్‌ఎల్వీ మార్క్-3 రాకెట్ ద్వారా చంద్రయాన్-2ను సోమవారం వేకువజామున 2.51 గంటలకు ప్రయోగించాలని తొలుత నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే జీఎస్‌ఎల్వీలో సాంకేతిక లోపం ఏర్పడటాన్ని గుర్తించిన శాస్త్రవేత్తలు ప్రయోగ సమయానికి 56 నిమిషాల, 24 సెకన్ల ముందు కౌంట్‌డౌన్‌ను నిలిపివేశారు. ఆ వెంటనే శ్రీహరికోట నుంచి ప్రత్యక్ష ప్రసారాలను కూడా నిలిపివేయడంతో అంతటా గందరగోళం ఏర్పడింది. కొద్ది నిమిషాల తరువాత ఇస్రో ఒక ప్రకటన విడుదల చేస్తూ చంద్రయాన్-2 ప్రయోగం రద్దయినట్టు తెలిపింది. వ్యోమనౌకలో సాంకేతిక సమస్యను గుర్తించామని, అందువల్ల ప్రస్తుతానికి చంద్రయాన్-2ను రద్దు చేశామని ఇస్రో అసోసియేట్ డైరెక్టర్ బీఆర్ గురుప్రసాద్ తెలిపారు. మళ్లీ ఎప్పుడు చేపట్టేది త్వరలోనే వెల్లడిస్తామని చెప్పారు. చంద్రయాన్-2ను వాస్తవానికి ఈ ఏడాది జనవరి చివరి వారంలో ప్రయోగించాలని తొలుత భావించారు. ఆ తరువాత జూలై 15వ తేదీని ఖరారు చేశారు. ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌తో కూడిన 3,850 కిలోల అంతరిక్ష నౌకను శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి చంద్రునిపైకి పంపాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ అద్భుతమైన ఘట్టాన్ని వీక్షించేందుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ఆదివారం రాత్రే శ్రీహరికోటకు చేరుకున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి గత వారమే పూర్తిస్థాయిలో రిహార్సల్స్ చేశారు. అనంతరం ఆదివారం ఉదయం 6.51 గంటలకు కౌంట్‌డౌన్‌ను ప్రారంభించారు. ప్రయోగానికి ముందు అవసరమైన ఇంధనాన్ని రాకెట్‌లో నింపారు. అంతా అనుకున్నది అనుకున్నట్టు జరిగి ఉంటే శ్రీహరికోట నుంచి జీఎస్‌ఎల్వీ మార్క్-3 వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లి ఉండేది. ఆపై కేవలం 16.13 నిమిషాల వ్యవధిలో చంద్రయాన్-2ను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టి ఉండేది. చంద్రునిపై సురక్షితంగా ఓ రోవర్‌ను దింపిన నాలుగో దేశంగా భారత్ చరిత్ర పుటల్లోకి ఎక్కేది. ఇంతకుముందు రష్యా, అమెరికా, చైనా మాత్రమే తమ రోవర్లను చంద్రునిపై దింపాయి.

ISRO tweets: A technical snag was observed in launch vehicle system at T-56 minute. As a measure of abundant precaution, Chandrayaan2 launch has been called off for today. Revised launch date will be announced later.

**ప్రయోగం నిలిపివేతపై ఇస్రో ట్వీట్**

**రాకెట్, ఉపగ్రహం సురక్షితం**

లాంచ్‌ప్యాడ్‌పైకి ప్రయోగ వాహనాన్ని (జీఎస్‌ఎల్వీ-మార్క్3)ని చేర్చి, కౌంట్‌డౌన్ ప్రారంభించి, రాకెట్‌లో ఇంధనాన్ని నింపిన తరువాత చంద్రయాన్-2ను రద్దు చేసినప్పటికీ ఎటువంటి నష్టం జరుగలేదని ఇస్రో అధికారులు తెలిపారు. రాకెట్‌లో ముందుగానే లోపాన్ని పసిగట్టడం అదృష్టమని వారు పేర్కొన్నారు. రాకెట్ క్రయోజనిక్ ఇంజిన్‌లో ఇంధనం లీకవుతుండటాన్ని అధికారులు కొద్ది నిమిషాల ముందు గుర్తించినట్టు తెలుస్తున్నది. 'రాకెట్ పనితీరు నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం లేదు. ప్రయోగానికి ముందే దీన్ని మేం గుర్తించాము. అప్పటికి అన్నీ మా నియంత్రణలోనే ఉన్నాయి. రాకెట్, అందులోని ఆర్బిటార్, ల్యాండర్, రోవర్ సురక్షితంగా ఉన్నాయి' అని ఓ అధికారి చెప్పారు. వ్యోమనౌకలో తలెత్తిన సాంకేతిక సమస్యలను నిపుణుల కమిటీ పరిశీలిస్తుందని తెలిపారు. తప్పు ఎక్కడ జరిగిందో గుర్తించి, దానిని సరిచేయడానికి ప్రయత్నిస్తారని చెప్పారు. ఇందుకోసం కనీసం వారం రోజుల సమయం అవసరమని వారు పేర్కొన్నారు. ప్రయోగం నిలిపివేసిన అనంతరం తీవ్రంగా మండే స్వభావం ఉన్న ద్రవరూపంలోని హైడ్రోజన్, ఆక్సిజన్‌ను వ్యోమనౌక నుంచి వేరు చేశామని ఒక అధికారి వెల్లడించారు. సాంకేతిక సమస్యను తెలుసుకోవడానికి రాకెట్‌ను పూర్తిగా విడదీయాల్సి ఉంటుందని మరో అధికారి తెలిపారు.


లాంచ్‌ప్యాడ్‌పై జీఎస్‌ఎల్వీ మార్క్-3 రాకెట్

### నెలాఖరులో మళ్లీ ప్రయోగం!

చంద్రయాన్-2 ప్రయోగం మళ్లీ ఈ నెలలోనే ఉండే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. ప్రయోగానికి అవసరమైన 'లాంచ్ విండో'కు ఈ నెలలోనే సమయం ఉందని ఇస్రో అధికారులు చెప్తున్నారు. చంద్రయాన్ ప్రయోగానికి అనువైన నాలుగు లాంచ్ పీరియడ్‌లు ఈ నెలలో ఉన్నట్టు ఇంతకుముందే గుర్తించారు. అవి జూలై 1-15, జూలై 16, జూలై 29, జూలై 30 తేదీలు. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరున 29 లేదా 30వ తేదీన చంద్రయాన్‌ను ప్రయోగించే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది.


సోమవారం చంద్రయాన్ ప్రయోగాన్ని వీక్షించేందుకు వచ్చిన సందర్శకులు

## సందర్శకుల నిరుత్సాహం

అర్ధరాత్రి అయినప్పటికీ అనేకమంది ఔత్సాహికులు చంద్రయాన్-2 ప్రయోగాన్ని వీక్షించేందుకు శ్రీహరికోట పరిసరాల్లోకి చేరుకున్నారు. కొందరు తమ పిల్లలతోపాటు దూర ప్రాంతాల నుంచి వాహనాలపై వచ్చారు. ఇస్రో ఇటీవల ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలో వేచి ఉన్న వారంతా ప్రయోగం వాయిదా పడిందని తెలియడంతో నిరుత్సాహంగా తిరిగి వెళ్లిపోయారు. చంద్రయాన్ ప్రయోగాన్ని చూడాలనుకున్న వారి పేర్లను ఇస్రో అధికారులు వారం రోజుల ముందుగానే నమోదు చేసుకున్నారు. 'రాకెట్ ఇంకా భూమిపై ఉన్నప్పుడే శాస్త్రవేత్తలు దానిని నిలిపివేయడం మంచిదైంది. ఒకవేళ రాకెట్ అంతరిక్షంలోకి వెళ్లిన తరువాత సాంకేతిక లోపం ఏర్పడి ప్రయోగం విఫలమై ఉంటే వందల కోట్ల రూపాయలు వృథా అయిపోయేవి' అన్న వ్యాఖ్యలు వినిపించాయి.

### అప్రమత్తత అపార నష్టాన్ని నివారించింది

- ఇస్రోపై శాస్త్రవేత్తల ప్రశంసలు

**న్యూఢిల్లీ:** ఇస్రో అప్రమత్తత అపార నష్టాన్ని నివారించిందని పలువురు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. చంద్రయాన్-2 ప్రయోగాన్ని నిలిపివేయడం ద్వారా ఇస్రో నిపుణులు ముప్పును కొనితెచ్చుకోకుండా ముందుజాగ్రత్తగా వ్యవహరించారని అన్నారు. సాంకేతిక లోపం కారణంగా చంద్రయాన్-2ను రద్దు చేసిన సంగతి తెలిసిందే. 'అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించి ఇస్రోకు అసాధారణమైన సక్సెస్ రేటుంది. సంక్లిష్టమైన వ్యవస్థను చివరి నిమిషం వరకు పరిశీలించి, లోపాలు గుర్తించడం ఓ ప్రత్యేకమైన కళ. ఈ కళలో ఇస్రో నిపుణులు ఆరితేరారు' అని కోల్‌కతాలోని భారత శాస్త్రీయ విద్య, పరిశోధన సంస్థ (ఐఐఎస్ఈఆర్)లో అంతరిక్ష శాస్త్రాల కేంద్ర అధిపతిగా ఉన్న రాజేశ్ కుంబ్లే నాయక్ పేర్కొన్నారు. ముప్పును కొని తెచ్చుకోవడానికి బదులుగా ప్రయోగాన్ని నిలిపివేయాలని ఇస్రో నిర్ణయించడం హర్షించదగిన విషయం అని అన్నారు. కొద్ది వారాల తరువాత ఈ ప్రయోగాన్ని మళ్లీ చేపడుతారని ఆయన చెప్పారు. సాంకేతిక సమస్యలను ఇస్రో పరిష్కరిస్తుందని, త్వరలోనే చంద్రయాన్‌ను విజయవంతంగా ప్రయోగిస్తుందని ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ అసోసియేట్ ప్రొఫెసర్ సుదీప్ భట్టాచార్య పేర్కొన్నారు. 'ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం మంచిది కాదు. చివరి క్షణం వరకు అప్రమత్తంగా ఉండాలి. అత్యంత అప్రమత్తంగా ఉండటం వల్లనే ఈ ప్రయోగాన్ని నిలిపివేశారు. ఎంతో విలువైన సంపదను కాపాడారు. ఈ గొప్పదనం అంతా ఇస్రో బృందానిదే' అని అన్నారు. ఐఐఎస్ఈఆర్‌కు చెందిన ప్రొఫెసర్ దిబ్యేందు నంది కూడా ఇస్రోపై ప్రశంసలు కురిపించారు.

### గతంలోనూ సాంకేతిక సమస్యలు

వాటిని అధిగమించి ప్రయోగాలను విజయవంతం చేసిన ఇస్రో

ఇస్రోకు సాంకేతిక సమస్యలు కొత్త కాదు. గతంలోనూ ఇలాంటి సాంకేతిక సమస్యలు ఎదురైనప్పటికీ, వివిధ రకాల ఉపగ్రహ వాహక నౌకలను విజయవంతంగా ప్రయోగించింది. జీఎస్‌ఎల్వీ-మార్క్3 రాకెట్ ద్వారా చంద్రయాన్-2ను ప్రయోగించాలని ఇస్రో నిర్ణయించింది. అయితే చివరి నిమిషంలో జీఎస్‌ఎల్వీలో సాంకేతిక సమస్య ఏర్పడటంతో ఆ ప్రయోగాన్ని రద్దు చేశారు. చిన్న ఉపగ్రహాల ప్రయోగానికి ఇస్రో ఇదివరకు జీఎస్‌ఎల్వీ-మార్క్-2ను వినియోగించింది. 2001 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 13సార్లు జీఎస్‌ఎల్వీ-మార్క్2ను ఉపయోగించారు. అయితే మూడుసార్లు జీశాట్-5పీ, జీశాట్-4, ఇన్‌శాట్-4సీ ప్రయోగాలు మాత్రం విఫలమయ్యాయి. బాహుబలిగా పేరొందిన జీఎస్‌ఎల్వీ మార్క్-3రాకెట్ 4 టన్నుల బరువు వరకు అంతరిక్షానికి మోసుకెళ్లగలదు. ఈ రాకెట్‌ను ఉపయోగించి ఇంతకుముందు జీశాట్-29, జీశాట్-19 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారు. ఇదే రాకెట్‌ను ఉపయోగించి 'క్రూ మాడ్యూల్ అట్మాస్ఫియరిక్ రీ ఎంట్రీ' ప్రయోగాన్ని ఇస్రో విజయవంతంగా నిర్వహించింది. 'గగన్‌యాన్' మిషన్‌కు కూడా జీఎస్‌ఎల్వీ మార్క్-3నే ఉపయోగిస్తామని ఇస్రో చైర్మన్ శివన్ ఇటీవల చెప్పారు.

# వరదలోనే 'ఈశాన్యం'

- అసోంలో 44 లక్షల మందిపై వరద ప్రభావం
- 15కు చేరిన మృతుల సంఖ్య
- త్రిపుర, మేఘాలయ, మిజోరంలో ప్రజల అవస్థలు
- రంగంలోకి దిగిన సైన్యం
- బీహార్‌లో ఐదుగురు చిన్నారులు మృతి


అసోంలోని కామ్‌రూప్ జిల్లాలో బావిలో నుంచి మంచినీరు తోడుతున్న ఓ మహిళ


**గువాహటి (అసోం), జూలై 15:** ఈశాన్య రాష్ట్రాలతోపాటు బీహార్‌ను వరద ముంచెత్తుతున్నది. దీంతో 70 లక్షల మందిపై వరద ప్రభావం పడింది. వర్షాలు, వరదల వల్ల ఇప్పటి వరకు 44 మంది మరణించారు. అసోంలోని 33 జిల్లాలకుగాను 30 జిల్లాలు వరదను ఎదుర్కొంటున్నాయి. ఈ రాష్ట్రంలో 43 లక్షల మంది వరద ప్రభావానికి గురికాగా.. 15 మంది ప్రాణాలు కోల్పోయారు. సహాయక చర్యల కోసం సైన్యం కూడా రంగంలోకి దిగింది. తాము ఇప్పటి వరకు 150 మందిని రక్షించామని సైనికాధికారి ఒకరు చెప్పారు. వరద ధాటికి ఈశాన్య రాష్ట్రాల్లో ప్రధాన నదులైన బ్రహ్మపుత్ర, జింజిరామ్ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాని మోదీ అసోం సీఎం సర్బానంద సోనోవాల్‌కు ఫోన్ చేసి వరద పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మరోవైపు నైరుతి రుతుపవనాలు దేశ రాజధాని ఢిల్లీని తాకాయి. దీంతో ఢిల్లీ పరిధిలో సోమవారం వర్షం కురిసింది.

**అసోం అతలాకుతలం**

అసోంలో ఆదివారం నాటికి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ దళాలు కలిసి 7,833 మందిని రక్షించాయి. రాష్ట్రంలోని బ్రహ్మపుత్ర నది ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తున్నది. 3,181 గ్రామాలు నీట మునిగాయి. 1,53211 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. ప్రధాని మోదీ అసోం సీఎం సర్బానంద సోనోవాల్‌కు సోమవారం ఫోన్ చేసి వరద పరిస్థితిపై వాకాబు చేశారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. త్రిపురలో వరద ప్రభావం ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే తగ్గుముఖం పడుతున్నది. మేఘాలయలోనూ దాదాపు 1.14 లక్షల మందిపై వరద ప్రభావం పడింది. మిజోరంలో ఐదుగురు మరణించారు.

**ఢిల్లీని తాకిన 'నైరుతి'**


**న్యూఢిల్లీ:** నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు ఢిల్లీని తాకాయి. దీంతో ఢిల్లీ, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. మరోవైపు మహారాష్ట్రలోని పాల్ఘడ్, థాణె జిల్లాల్లో ఉన్న రెండు ప్రధాన డ్యాంలు దాదాపు నిండిపోవడంతో వాటి చుట్టుపక్కల నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. బీహార్‌లోనూ వరద తీవ్రత అధికంగా ఉన్నది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 24 మంది మరణించారు. సోమవారం వరద నీటిలో మునిగి ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. 25 లక్షల మందిపై వరద ప్రభావం పడింది.



### సాయం చేయండి

ప్రపంచ దేశాలను కోరిన నేపాల్

**కాఠ్మండు:** నేపాల్‌లో కురుస్తున్న వర్షాల వల్ల వరద పెరిగి మరణించిన వారి సంఖ్య సోమవారం నాటికి 67కు చేరుకుంది. దీంతో నేపాల్ ప్రభుత్వం ప్రపంచ దేశాల సాయాన్ని కోరింది. వరదల వల్ల అంటురోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నదని, దీనిని నివారించడానికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కురుస్తున్న వర్షాల వల్ల వరద పెరిగి నీలం వ్యాలీలో 23 మంది మరణించారు.


బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో నీటమునిగిన ఓ గ్రామం

# ఎన్‌ఐఏకు మరిన్ని అధికారాలు

బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దేశ ప్రయోజనాల కోసమే బిల్లును తెచ్చామన్న కేంద్రం

ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యమని వెల్లడి

దేశాన్ని పోలీస్ రాజ్యంగా మార్చే యత్నం: విపక్షాల ధ్వజం

**న్యూఢిల్లీ, జూలై 15:** జాతీయ దర్యాప్తు సంస్థకు (ఎన్‌ఐఏకు) మరిన్ని అధికారాలను కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్‌ఐఏ సవరణ బిల్లు-2019కి లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. భారతీయులపై, భారతీయ ప్రయోజనాలపై ప్రపంచంలో ఏ ప్రాంతంలో జరిగే ఉగ్రదాడిపైనైనా దర్యాప్తు చేసే అధికారాన్ని ఎన్‌ఐఏకు కల్పిస్తూ బిల్లులో సవరణలు చేశారు. అలాగే సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా కేసులను దర్యాప్తు చేసే అధికారాన్ని కూడా ఎన్‌ఐఏకి కల్పించారు. 166 మంది ప్రాణాలను బలిగొన్న ముంబై ఉగ్రదాడి అనంతరం 2009లో ఎన్‌ఐఏని ఏర్పాటుచేశారు. ఓ వర్గానికి చెందినవారిని టార్గెట్ చేసేందుకే ఈ బిల్లును తెచ్చారన్న విపక్షాల ఆరోపణలను ప్రభుత్వం తోసిపుచ్చింది. ఉగ్రవాదం నుంచి దేశాన్ని రక్షించేందుకే ప్రజలు తమకు అధికారాన్ని అప్పగించారని తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఉగ్రవాదులకు, ప్రపంచానికి సందేశం పంపేందుకు పార్లమెంట్ మొత్తం ఒకేమాటపై నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, చర్యలు తీసుకునే ముందు నిందితుడి మతాన్ని చూడబోమని స్పష్టం చేశారు.

**ఎన్‌ఐఏ బలోపేతమే లక్ష్యం..**

చర్చకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి జీ కిషన్‌రెడ్డి సమాధానమిస్తూ.. ఉగ్రవాదం నుంచి దేశాన్ని రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చౌకీదార్ సారథ్యంలో నడుస్తున్న ఈ ప్రభుత్వం దేశ భద్రత విషయంలో ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. ఉగ్రవాదానికి మతం, కులం, ప్రాంతం అనే తేడాలు లేవన్నారు. ఎన్‌ఐఏ విషయంలో సమాఖ్య వ్యవస్థకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని, రాష్ట్రాలు, రాష్ట్ర సంస్థల సమన్వయంతో ఎన్‌ఐఏ పనిచేస్తున్నదని తెలిపారు. ఎన్‌ఐఏ 272 కేసులపై విచారణ జరుపుతున్నదని, 199 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసిందని కిషన్‌రెడ్డి తెలిపారు. 51 కేసుల్లో కోర్టులు ఇదివరకే తీర్పులు వెలువరించాయని, వీటిల్లో 46 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయని చెప్పారు. నేర నిరూపణ రేటు 90 శాతంగా ఉన్నదని పేర్కొన్నారు. ఎన్‌ఐఏను బలోపేతం చేయాలని తాము అనుకుంటున్నామని, ఇందులో మతానికి, రాజకీయ పార్టీలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అనంతరం ఈ బిల్లుపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డివిజన్ ఓటింగ్ కోరారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎవరు నిలుస్తారో తేల్చేందుకు డివిజన్ ఓటింగ్ చేపట్టాలని అమిత్ షా కూడా కోరారు. 278 మంది సభ్యులు బిల్లుకు మద్దతునివ్వగా, కేవలం ఆరుగురు మాత్రమే వ్యతిరేకించారు. అనంతరం మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది.

**పోలీస్ రాజ్యంగా మార్చేందుకే**

చర్చ సందర్భంగా కాంగ్రెస్ సభ్యుడు మనీశ్ తివారీ మాట్లాడుతూ.. దేశాన్ని పోలీస్ రాజ్యంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. అయితే తమ ప్రభుత్వం ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోదని, దేశ ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తెస్తున్నట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌ఐఏ చట్టం రాజ్యాంగబద్ధతపై తివారీ ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్‌ఐఏ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లు పలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

**మక్కా పేలుళ్లు, సంఝౌతా కేసుల్లో ఎందుకు అప్పీల్‌కు వెళ్లలేదు: ఒవైసీ**

**నమస్తే తెలంగాణ:** మక్కా మసీదు బాంబు పేలుళ్ల కేసు, సంఝౌతా ఎక్స్‌ప్రెస్, అజ్మీర్ పేలుళ్ల కేసులు ఏమయ్యాయని అసదుద్దీన్ ఒవైసీ ప్రశ్నించారు. ఏదేని కేసులో ముస్లింలు నిందితులైతే ఒకలా, బాధితులైతే మరోలా కేంద్రం స్పందిస్తున్నదని విమర్శించారు. ముస్లింలు బాధితులుగా ఉన్న మక్కా మసీదు పేలుళ్లు, సంఝౌతా ఎక్స్‌ప్రెస్ పేలుళ్ల కేసులో ప్రభుత్వం అప్పీల్‌కు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. తనను ఇండియాకు గులాం అంటూ ఒక ఉగ్రవాద సంస్థ ఫొటోను పోస్ట్ చేస్తే, దానిపై ఇంతవరకు ప్రభుత్వం తేల్చలేదని, అసలు తాను ఉగ్రవాదినా, జాతివాదినా అర్థంకావడం లేదన్నారు. ఒక మంత్రి హైదరాబాద్‌ను ఉగ్రవాదుల అడ్డా అంటున్నారని, దానికి సాక్ష్యాలున్నాయా అని ప్రశ్నించారు.

**నీట్ మినహాయింపునకు నో**

వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్ష నుంచి తమ రాష్ట్ర విద్యార్థులకు మినహాయింపునివ్వాలన్న తమిళనాడు, పుదుచ్చేరి ప్రభుత్వాల విజ్ఞప్తిని తిరస్కరించినట్లు కేంద్ర మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్ లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. కాగా, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు నీరజ్ శేఖర్ రాజీనామాను రాజ్యసభ చైర్మన్ ఆమోదించారు.

**లోక్‌సభ ముందుకు సరోగసీ బిల్లు**

దేశంలో వాణిజ్య సరోగసీ (అద్దెగర్భం) విధానంపై త్వరలోనే నిషేధం పడనుంది. ఇందుకు సంబంధించిన సరోగసీ (నియంత్రణ) బిల్లు-2019ను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. సరోగసీ విధానం ద్వారా పిల్లలను పొందాలనుకునేవారు 'నైతిక, నిస్వార్థ' కారణాల రీత్యా అద్దెగర్భం కోసం తన సమీప బంధువుల సాయాన్నే తీసుకోవాల్సి ఉంటుంది.


లోక్‌సభలో అమిత్ షా, అసదుద్దీన్ ఒవైసీ

### అమిత్ షా, ఒవైసీ మధ్య మాటల యుద్ధం

లోక్‌సభలో ఎన్‌ఐఏ బిల్లుపై చర్చ సందర్భంగా అమిత్ షా, ఒవైసీ మధ్య మాటల యుద్ధం రాజుకుంది. బీజేపీ సభ్యుడు సత్యపాల్ సింగ్ మాట్లాడుతుండగా, ఒవైసీ తదితర విపక్ష సభ్యులు అడ్డుతగలడంతో వాగ్యుద్ధం మొదలైంది. ఓ కేసుకు సంబంధించి నాటి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఓ రాజకీయ నేత బెదిరించారని సింగ్ ఆరోపించారు. ఈ ఆరోపణలను ఖండించిన ఒవైసీ.. ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో షా జోక్యం చేసుకుంటూ.. సభ్యులు మాట్లాడుతుంటే వినడం నేర్చుకోవాలని అసద్ వైపు వేలు చూపుతూ సూచించారు. తనవైపు వేలు చూపొద్దని, తాను భయపడబోనని అసద్ స్పష్టం చేశారు. తాను భయపెట్టడం లేదని, ఇతరులు చెప్పేది వినాలని మాత్రమే చెబుతున్నానని అమిత్ షా పేర్కొన్నారు.

### క్రికెట్ అంటేనే బంతులు.. పరుగులు.. వికెట్లు

బ్యాట్స్‌మెన్ బంతిని టచ్ చేసి బ్యాటింగ్ క్రీజ్ నుంచి నాన్ స్ట్రయికింగ్ ఎండ్ వరకు సురక్షితంగా వెళ్తే అతడి ఖాతాలో ఓ పరుగు చేరుతుంది. అదేవిధంగా జట్టు ఖాతాలోనూ ఓ రన్ కలుస్తుంది. ఒకవేళ బ్యాట్స్‌మెన్ కొట్టిన బంతిని ఫీల్డర్లు అడ్డుకోకుండా అది మైదానం అంచున ఉన్న గీత దాటితే దాన్ని బౌండ్రీగా పరిగణిస్తారు. నేలకు తాకుతూ వెళ్తే ఫోర్.. నేరుగా వెళ్తే సిక్స్.

### ఇప్పుడెందుకు ఈ క్రికెట్ రూల్స్ అనుకుంటున్నారా..!

సింగిల్స్ ద్వారా వచ్చినా.. బౌండ్రీల ద్వారా వచ్చిన పరుగుకు ఉన్న ప్రాముఖ్యత మారేదుండదు. ఆ మాటకొస్తే.. సింగిల్స్ ద్వారా స్ట్రయిక్ రొటేట్ చేస్తూ సాగిన ఇన్నింగ్స్‌కే విలువెక్కువ. ఆటగాళ్ల నుంచి అభిమానుల వరకు దాదాపుగా అందరి అభిప్రాయం ఇదే. కానీ ఐసీసీ మాత్రం పరుగు, పరుగులోనూ తేడా ఉందని.. సింగిల్స్ ద్వారా వచ్చినవి ఒక లెక్కా.. బౌండ్రీల ద్వారా వచ్చినవి మరో లెక్క అని కొత్త భాష్యం చెప్తున్నది. అంతేకాదు ఇలాంటి ఓ వింత రూల్ ప్రకారం ప్రతిష్ఠాత్మక ప్రపంచకప్ విజేతను తేల్చేసింది.

### జగజ్జేతను తేల్చింది ఆ మాయదారి నిబంధనే..!

లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య ఆదివారం జరిగిన 12వ ప్రపంచకప్ ఫైనల్లో ఇరు జట్ల స్కోర్లు సమమయ్యాయి. ఫలితం తేల్చడం కోసం 'సూపర్ ఓవర్' నిర్వహిస్తే అది కూడా 'టై'గానే ముగిసింది. అయినా ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించారు. అసలు విషయం ఏంటయ్యా అంటే.. మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఎక్కువ బౌండ్రీలు కొట్టింది అని తేల్చారు. పరుగు ఎలా చేసినా పరుగే అయినప్పుడు.. సూపర్ ఓవర్‌లోనూ స్కోర్లు సమమైన సమయంలో కావాలంటే వికెట్లను పరిగణించాలి కానీ.. ఈ మాయదారి నిబంధన ఏంటి అనేది మాత్రం ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఏదేమైనా ఐసీసీ విచిత్ర నిబంధనల కారణంగా తుదికంటా పోరాడిన న్యూజిలాండ్ రెండోసారి రిక్తహస్తాలతోనే వెనుదిరిగాల్సి రాగా.. క్రీడా విశ్లేషకులు మాత్రం ఈ నిబంధనను చీల్చి చెండాడుతున్నారు.

# ఐ ఛీ ఛీ!

- ఐసీసీ రూల్స్‌పై మాజీల మండిపాటు
- 'బౌండ్రీల లెక్క'పై సర్వత్రా విమర్శలు





**లండన్/మెల్‌బోర్న్/న్యూఢిల్లీ:**

ప్రపంచకప్ ఫైనల్లో విజేతను తేల్చడం కోసం అనుసరించిన ఐసీసీ నిబంధనలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజా ఆటగాళ్ల నుంచి మాజీ దిగ్గజాల వరకు ఆ రూల్స్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. ఇరు జట్ల స్కోరు సమానమైనప్పుడు ఫలితాన్ని తేల్చేందుకు 'సూపర్ ఓవర్' నిర్వహించడం పరిపాటి. కానీ అందులో కూడా స్కోరు ఒక్క 'టై'తే.. అప్పుడు మ్యాచ్‌లో కొట్టిన బౌండ్రీల ఆధారంగా విజేతను తేల్చడం సరైంది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం లార్డ్స్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ ఫైనల్లో ఇలాంటి మాయదారి రూల్ ప్రకారమే న్యూజిలాండ్ వరుసగా రెండోసారి రన్నరప్‌తో సరిపెట్టుకోవల్సి వచ్చింది. మ్యాచ్‌లో నమోదైన బౌండ్రీల ఆధారంగా విజేతను తేల్చడంతో.. తుదిపోరులో న్యూజిలాండ్ (16 బౌండ్రీలు; 14 ఫోర్లు, 2 సిక్సర్లు) కంటే.. ఎక్కువ బౌండ్రీలు కొట్టిన ఇంగ్లండ్ (24 బౌండ్రీలు; 22 ఫోర్లు, 2 సిక్సర్లు)ను ట్రోఫీ వరించింది.

### ఇప్పటికైనా మార్చండి..

వికెట్ల మధ్య పరిగెత్తి తీసినా.. బౌండ్రీల ద్వారా వచ్చినా.. పరుగులకు ఒకే విలువ ఉండాలి కానీ.. దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఎక్కువ భారీ షాట్లు ఆడిన వారిని విజేతగా ఎంపిక చేయడం ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జెంటిల్‌మెన్ గేమ్‌లో ఇలాంటి తల తిక్క రూల్స్ ఏంటని పలువురు విమర్శిస్తున్నారు. 'ఇదో చెత్త రూల్' అని భారత మాజీ ఓపెనర్ గౌతమ్ గంభీర్ ట్విట్టర్‌లో పేర్కొంటే.. 'నిబంధనలపై ఇప్పటికైనా దృష్టిపెట్టాలి' అని ప్రస్తుత ఓపెనర్ రోహిత్ శర్మ అని అన్నాడు. 'ఈ నిబంధనలతో నేను ఏకీభవించడం లేదు. కానీ ఏం చేస్తాం రూల్స్ అంటే రూల్సే' అని యువరాజ్ సింగ్ అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ స్కాట్ స్టైరిస్ ఓ అడుగు ముందుకు వేసి 'ఐసీసీ జోక్ చేస్తున్నట్లుంది' అని వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. 'ఐసీసీ రూల్స్ ఊహకు అందకుండా ఉన్నాయి. ఇంగ్లండ్‌కు ట్రోఫీ ఇవ్వడం కంటే ఇరుజట్లను విజేతలుగా ప్రకటించి ఉంటే బాగుండేది' అని భారత స్పిన్ దిగ్గజం బిషన్ సింగ్ బేడీ పేర్కొంటే.. 'ఐసీసీ రూల్స్ గురించి నాకు పెద్దగా అవగాహన లేదు. కానీ న్యూజిలాండ్‌కు అన్యాయం జరిగింది' అని భారత టెస్టు ప్లేయర్ చటేశ్వర్ పుజారా అభిప్రాయపడ్డాడు. 'పరుగులు, వికెట్ల ఆధారంగా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిని అనుసరిస్తున్నప్పుడు.. తుదిపోరు ఫలితాన్ని కేవలం బౌండ్రీల ద్వారానే తేల్చడం సరైన పద్ధతి కాదని నా అభిప్రాయం' అని ఆస్ట్రేలియా మాజీ బ్యాట్స్‌మన్ డీన్ జోన్స్ అన్నాడు. 'విజేతను తేల్చడం కోసం వినియోగించిన పద్ధతి చాలా కఠినమైనది. దీన్ని మార్చాల్సిన అవసరం ఉంది' అని ఆసీస్ మాజీ పేసర్ బ్రెట్‌లీ అభిప్రాయపడ్డాడు.

### ఆరు కాదు ఐదే..



మెగా టోర్నీ ఫైనల్ చివరి ఓవర్‌లో జరిగిన మరో చిత్రమైన సంఘటనపై కూడా పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో మార్టిన్ గప్టిల్ వేసిన త్రో బెన్ స్టోక్స్ బ్యాట్‌కు తాకి ఓవర్‌త్రో రూపంలో బౌండ్రీ చేరింది. అప్పటికే తొలి పరుగు పూర్తిచేసిన స్టోక్స్ రెండో పరుగు ముగించే క్రమంలో బ్యాటింగ్ క్రీజు వద్ద డైవ్ కొట్టగా.. గప్టిల్ వేసిన బంతి స్టోక్స్ బ్యాట్‌ను తాకి బౌండ్రీకి వెళ్లింది. ఫీల్డ్ అంపైర్ ధర్మసేన 2+4 కలిపి మొత్తం 6 పరుగులు ఇంగ్లండ్ ఖాతాలో చేర్చాడు. కాగా.. ఇది క్రికెట్ నిబంధనలకు విరుద్ధమని.. ఫీల్డర్ త్రో వేసే సమయానికి పూర్తి చేసిన పరుగులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని మాజీ అంపైర్లు అంటున్నారు. ఐసీసీ రూల్స్ ప్రకారం ఆ బంతికి ఆతిథ్య జట్టుకు 5 పరుగులే ఇవ్వాలని.. అలా కాకుండా 6 రన్స్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై ఆస్ట్రేలియా మాజీ అంపైర్, ఐదుసార్లు ఐసీసీ బెస్ట్ అంపైర్ అవార్డు అందుకున్న సైమన్ టఫెల్ స్పందిస్తూ.. 'ఇది అంపైరింగ్ తప్పిదం అని స్పష్టంగా తెలుస్తున్నది. ఇంగ్లండ్‌కు దక్కాల్సింది ఐదు పరుగులే. ఆ ఉత్కంఠ పరిస్థితిలో బ్యాట్స్‌మన్ రెండో పరుగు పూర్తిచేసినట్లు అంపైర్లు భావించారు. కానీ ఫీల్డర్ త్రో చేసే నిర్దిష్ట సమయంలో బ్యాట్స్‌మెన్ ఎక్కడున్నారు అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. టీవీ రిప్లేల ప్రకారం గప్టిల్ త్రో వేసే సమయానికి ఒక పరుగు మాత్రమే పూర్తైంది. అంటే 1+ఓవర్‌త్రో రూపంలో వచ్చిన 4తో కలుపుకొని 5 పరుగులే ఇవ్వాలి. కానీ అంపైర్ నిర్ణయంపై వ్యాఖ్యలు చేయడం సబబు కాదు' అని అన్నాడు. 'న్యూజిలాండ్ ప్రపంచకప్ ఆశలను ధర్మసేన చిదిమేశాడు. 6 పరుగులు కాదు 5 ఇవ్వాల్సింది' అని భారత మాజీ అంపైర్ హరిహరన్ పేర్కొన్నాడు. కాగా ఈ అంశంపై స్పందించేందుకు ఐసీసీ నిరాకరించింది.

### గతంలో సంయుక్త విజేత..

ఐసీసీ నిబంధనలు మార్చకముందు ప్రపంచకప్ ఫైనల్ 'టై' అయితే ఇరు జట్లను సంయుక్త విజేతలుగా ప్రకటించేవారు. కానీ ఇటీవల మారిన నిబంధనల ప్రకారం సూపర్ ఓవర్‌ను ప్రవేశ పెట్టారు. అది కూడా సమమైతే బౌండ్రీల ఆధారంగా విజేతను ప్రకటిస్తారు. అయితే ఇది సరైనది కాదని సంయుక్త విజేత పద్ధతే బాగుండేదని పలువురు విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

### మా గుండె పగిలింది..

ఇక న్యూజిలాండ్ మాజీ ఆటగాళ్లైతే.. ఈ నిబంధన వల్ల తమ గుండె పగిలిందని పేర్కొంటున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్లో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత ఓవర్లలో 241/8 స్కోరు చేస్తే.. బదులుగా ఇంగ్లండ్ కూడా 50 ఓవర్లలో సరిగ్గా అన్నే పరుగులకు ఆలౌటైంది. దీంతో సూపర్ ఓవర్ ద్వారా ఫలితం తేల్చాల్సి వచ్చింది. అందులో కూడా ఇరు జట్లు చెరో 15 పరుగులు చేయడంతో మ్యాచ్‌లో ఎక్కువ బౌండ్రీలు కొట్టిన ఇంగ్లండ్‌ను విజేతగా ప్రకటించారు. 'బౌండ్రీలను పరిగణనలోకి తీసుకునే కన్నా.. మ్యాచ్‌లో ఎక్కువ వికెట్లు పడగొట్టిన న్యూజిలాండ్‌ను విజేతగా ప్రకటించాల్సింది. కానీ ఈ బౌండ్రీల లెక్కేంటో అర్థం కావడం లేదు. క్రికెట్ అంటేనే పరుగులు వికెట్ల సమరం. మరి అలాంటప్పుడు రన్స్ సమమైనప్పుడు వికెట్లను పరిగణించాల్సింది' అని పేర్కొన్న కివీస్ మాజీ పేసర్ కైల్ మిల్స్ ఈ అంశంపై తామెలాంటి ఫిర్యాదు చేయదల్చుకోవడం లేదని రూల్స్ అంటే రూల్సే అనడం న్యూజిలాండ్ క్రీడాస్ఫూర్తికి నిదర్శనం.

### ఐసీసీ నిబంధన ఏం చెబుతున్నది ?

ఐసీసీ నియమావళి 19.8 నిబంధన ప్రకారం బ్యాట్స్‌మన్ బంతిని కొట్టిన అనంతరం అతడు పూర్తి చేసిన పరుగులతో పాటు.. ఓవర్ త్రో రూపంలో వచ్చిన పరుగులను కలిపి బ్యాటింగ్ చేసే జట్టుకు ఇవ్వాలి. ఫీల్డర్ త్రో వేయడానికి ముందే పూర్తైన పరుగులకే ఈ నిబంధన వర్తిస్తుంది. కానీ టీవీ రిప్లేలో తేలిందేంటంటే.. డీప్ మిడ్‌వికెట్‌లో గప్టిల్ బంతిని అందుకొని త్రో చేసే సమయానికి స్టోక్స్, రషీద్ రెండో పరుగు పూర్తి చేయలేదు. అంటే రూల్స్ ప్రకారం అప్పటికి ఒక్కటే పరుగు పూర్తైంది. దీంతో అంపైర్ ఆ ఒక పరుగుతో కలుపుకొని 5 ఇవ్వాల్సింది. కానీ ఫీల్డ్ అంపైర్ ధర్మసేన మాత్రం ఈ నిబంధనను తుంగలో తొక్కి మరో ఆలోచన లేకుండా 6 పరుగులు ఇచ్చేశాడు. ఆ తర్వాత మరో మూడు పరుగులు చేసిన ఇంగ్లండ్ సరిగ్గా న్యూజిలాండ్ చేసినన్ని పరుగులే చేసి ఆలౌటైంది. ఈ ఒక్క పరుగు ఎంత ముఖ్యమైందో ఆ తర్వాతగానీ న్యూజిలాండ్‌కు తెలిసిరాలేదు.



# విలియమ్సన్.. నీకు సలాం!

**నమస్తే తెలంగాణ క్రీడా విభాగం**

సాధారణ మ్యాచ్‌లో అంపైర్ల వల్లనో.. నిర్వాహకుల వల్లనో ఓ చిన్న పొరపాటు దొర్లితేనే.. ఆటగాళ్లు అగ్గిమీద గుగ్గిలం అయిపోతారు. అంపైర్లతో వాదించడం, రూల్స్ సరిగ్గా లేవనే వ్యాఖ్యలు చేయడం, నిర్వాహకులపై నిందలు వేయడం సర్వసాధారణం. నాలుగేళ్ల కఠోర తపస్సు.. అంతకుమించి చిన్నప్పటి నుంచి కన్న కల కండ్ల ముందే దూరమవుతున్నా.. మొహంపై చిరునవ్వు చెరగనివ్వకుండా.. సహచరుల్లో స్ఫూర్తి నింపుతూ.. నింపాదిగా సమాధానమివ్వడం సాధ్యమయ్యే పనే నా.. అంతర్జాతీయ క్రికెట్‌లో ధోనీకి మిస్టర్ కూల్ అనే ముద్ర ఉంది. భావోద్వేగాలను నియంత్రించుకోవడంలో అతడిని మించినవారు లేరని లెక్కకు మిక్కిలి సార్లు రుజువైందే. కానీ, ప్రపంచకప్ సెమీఫైనల్లో కీలక తరుణంలో రనౌటై వెనుదిరుగుతున్న సమయంలో ధోనీని చూసిన వారెవరికైనా.. అతడి కంట్లో చెమ్మ కదిలించే ఉంటుంది. దృఢచిత్తంతో నిర్ణయాలు తీసుకునే మహీ.. ఐపీఎల్ 12వ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ సందర్భంగా.. ఔటై మైదానం వదిలేసిన తర్వాత అంపైర్ తప్పుడు నిర్ణయం ఇచ్చాడని తిరిగి గ్రౌండ్‌లోకి వచ్చి వాదనకు దిగాడు. ఈ రెండు సందర్భాలు చాలు ధోనీకి కూడా భావోద్వేగాలు ఉన్నాయి. అతడు కూడా మనలాంటి మామూలు మనిషే అని.



ఆదివారం విశ్వసమరం ఫైనల్ సూపర్ ఓవర్‌లో చివరి బంతికి 2 పరుగులు తీయలేక రనౌటైన.. గప్టిల్ అక్కడే క్రీజు లో పడి చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడుస్తుంటే.. అతడిని ఆపడం ఎవరి తరం కాలేదు. మరో ఎండ్‌లో ఉన్న నీషమ్ అయితే.. పిల్లలూ మీరు భవిష్యత్తులో క్రీడారంగంలోకి రాకండి, వేరే వృత్తిలో స్థిరపడండి అని స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

కానీ ఒక్కడు మాత్రం ఎలాంటి ప్రతిస్పందన లేకుండా.. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినట్లు.. 'నీ పని నువ్వు చేసుకెళ్లు, ఫలితం గురించి ఆలోచించకు' అన్న చందంగా గుండె నిబ్బరంతో అడుగు ముందుకేశాడు. చేతుల్లోకి వచ్చిన విశ్వకిరీటం తమ తప్పు లేకుండానే చేయి దాటి పోయినా.. కనీసం మారు మాటైనా మాట్లాడలేదు. చిరునవ్వుతో ఫలితాన్ని స్వీకరించాడు. మ్యాచ్ అనంతరం కామెంటేటర్లు అడిగిన ప్రశ్నలన్నింటికీ నవ్వుతూనే సమాధానాలిచ్చాడు. మిన్ను విరిగి మీద పడ్డా చలించని ఆత్మవిశ్వాసం అంటారే అచ్చం అలాగే. నిబద్ధతకు నిలువెత్తు రూపంలా అతడు గంభీరంగా మాట్లాడుతూ ఉంటే.. కదిలిపోని క్రికెట్ అభిమాని లేడంటే అతిశయోక్తి కాదు. మనమింతవరకూ మాట్లాడుకుంది మరెవరి గురించో కాదు.. న్యూజిలాండ్ కెప్టెన్ **కేన్ స్టువర్ట్ విలియమ్సన్** గురించే. అతడే ఆ మౌన ముని. నిండుకుండ తొణకదంటారు. కేన్‌ను చూస్తే అది నిజమనిపిస్తుంది. ప్రపంచకప్‌లో సహచరుల నుంచి పెద్దగా సహకారం అందకపోయినా.. ఒంటరిగా బండిని లాక్కుంటూ వచ్చి జట్టును ఫైనల్ చేర్చాడు. తుదిపోరులో స్వల్ప స్కోరే చేసినా తన నాయకత్వ చతురతతో ఇంగ్లండ్‌ను నిలువరించాడు. అత్యధిక పరుగుల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచినా.. అతడికే ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అందడానికి కేన్ సారథ్యమే ప్రధాన కారణం అనడంలో రవ్వంత అతిశయోక్తి లేదు. చేతుల్లోకి వచ్చిన క్యాచ్‌ను బౌండ్రీ రోప్ సమీపంలో పట్టినట్లే పట్టి బౌల్ట్ గీత దాటినా కనీసం అతడిపై కసురుకోని కేన్.. ఆ తర్వాత గప్టిల్ వేసిన త్రో స్టోక్స్ బ్యాట్‌ను తాకి బౌండ్రీ వెళ్తే.. 5 పరుగులే ఇవ్వాల్సిన చోట అంపైర్ 6 ఇచ్చినా.. ఇది బాధాకరం భవిష్యత్తులో ఇలాంటివి జరగకూడదు అని నింద తమపైనే వేసుకున్నాడే తప్ప.. ఇదేంటి ఇలాంటి నిర్ణయం ప్రకటించారు అని అంపైర్లను పల్లెత్తు మాట అనలేదు.. ఆఖరికి సూపర్ ఓవర్ కూడా 'టై' అయ్యాక బౌండ్రీలు ఎక్కువ కొట్టిన కారణంగా ప్రత్యర్థిని విజేతగా ప్రకటించినా కనీసం ఈ నిబంధన సరిగ్గాలేదు అని కూడా అనకుండానే ఓటమిని అంగీకరించాడు.

ఎన్ని తప్పిదాలు జరిగినా.. కనీసం అది తప్పు అని కూడా నిందించక కేవలం చిన్న చిరునవ్వుతోనే తిరుగు పయనమైన వీరుడా నీకు వందనం.. అభివందనం. నువ్వు మా గుండెల్లో పది కాలాల పాటు పదిలంగా ఉంటావు. ప్రపంచకప్ గెలవక పోయి ఉండొచ్చు.. సెమీస్‌లో మమ్మల్ని ఇంటి దారి పట్టించి ఉండొచ్చు.. కానీ నీ గుండె నిబ్బరం చూశాక నీ వ్యక్తిత్వానికి సలాం చేస్తున్నాం.

# జొకోనే టాప్..

- ఆ తర్వాతి ర్యాంకుల్లో రఫెల్ నాదల్, రోజర్ ఫెదరర్
- మహిళ సింగిల్స్‌లో బార్టీదే అగ్రస్థానం



**పారిస్:**

వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్న సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ తన నంబర్ వన్ ర్యాంకును మరింత పదిలం చేసుకున్నాడు. సోమవారం విడుదలైన అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ర్యాంకుల జాబితాలో 12,415 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి సత్తా చాటాడు. ఇక జొకోకు 4,500పాయింట్ల దూరంలో ఉన్న స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ (7,945) రెండో ర్యాంకును నిలబెట్టుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో జొకో చేతిలో ఓడిన స్విస్ దిగ్గజం రోజర్ ఫెదరర్(7,460) మూడో ర్యాంకులో ఉండగా, డొమినిక్ థీమ్(ఆస్ట్రియా; 4,595) నాలుగో స్థానంలో ఉన్నాడు. అనూహ్యంగా వింబుల్డన్ సెమీస్ చేరిన బటిస్టా అగట్ (స్పెయిన్) తొమ్మిది స్థానాలను మెరుగుపరుచుకొని 13వ ర్యాంకుకు చేరుకున్నాడు. భారత అగ్రశేణి ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ 89వ ర్యాంకులో ఉన్నాడు.

**మూడో స్థానానికి హలెప్**

వింబుల్డన్ టోర్నీ ప్రిక్వార్టర్స్‌లోనే నిష్క్రమించిన ఆస్ట్రేలియా క్రీడాకారిణి ఆష్లే బార్టీ 6,605 పాయింట్లతో మహిళ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. రెండు, మూడు స్థానాల్లో నవోమీ ఒసాక (6,257), కరోలినా ప్లిస్కోవా(6,055) కొనసాగుతున్నారు. అసాధారణ ఆటతో వింబుల్డన్ మహిళల సింగిల్స్ టైటిల్ దక్కించుకున్న రొమేనియా భామ సిమోనా హలెప్(5,933) మూడు స్థానాలు మెరుగు పరుచుకొని ఏడు నుంచి నాలుగో ర్యాంకుకు దూసుకొచ్చింది. గత శనివారం జరిగిన తుదిపోరులో హలెప్ చేతిలో ఓటమి చెందిన సెరెనా విలియమ్స్(అమెరికా) 9వ ర్యాంకుకు చేరుకుంది.



# షూటింగ్‌లో భారత్ జోరు

పతకాల పట్టికలో అగ్రస్థానం



**న్యూఢిల్లీ:** జూనియర్ ప్రపంచకప్‌లో భారత షూటర్లు సత్తా చాటుతున్నారు. జర్మనీలోని సుహ్ల్‌లో సోమవారం జరిగిన 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో తమిళనాడుకు చెందిన ఎలావెనిల్ వలరివన్ మన దేశానికే చెందిన మెహూలీ ఘోష్‌ను ఓడించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. 251.6పాయింట్లతో వలరివన్ అగ్రస్థానంలో నిలిస్తే.. 250.2తో మెహూలీ రజతాన్ని ఒడిసిపట్టింది. ఇక 10మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళా టీం విభాగంలో ఎలావెనిల్, మెహూలీ, శ్రేయా అగర్వాల్‌లతో కూడిన భారత జట్టు పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతోపాటు మొత్తం 1883.3 స్కోరు సాధించి గత రికార్డును(1880.7) తిరగరాసింది. ఇప్పటిదాకా టోర్నీలో భారత షూటర్లు 14 పతకాలు (6 స్వర్ణాలు, 6 రజతాలు, 2 కాంస్యాలు) సాధించి పతకాల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నారు.

**భారత బాక్సర్లకు పతకాల పంట**

సెర్బియాలో జరిగిన వొజ్వొదినా గోల్డెన్ గ్లవ్ అంతర్జాతీయ టోర్నీలో భారత యువ బాక్సర్లు సత్తా చాటారు. 4 రజతాలతో పాటు ఓ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. 49 కేజీల విభాగంలో సెలోయ్ సాయ్, బిలోట్సన్ ఎల్ సింగ్(56కేజీలు), అజయ్ కుమార్(60కేజీలు), విజయ్‌దీప్(69కేజీలు) ఫైనల్స్‌లో పరాజయం పాలై రజత పతకాలు సాధించారు.

# కిక్ బాక్సింగ్ రిఫరీగా శేఖర్




**వనపర్తి క్రీడలు:** జాతీయ స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు వనపర్తికి చెందిన కరాటే శేఖర్ రిఫరీగా ఎంపికయ్యాడు. ఈ నెల 18 నుంచి 21 వరకు వాకో ఇండియా వరల్డ్ అసోసియేషన్ ఆఫ్ కిక్ బాక్సింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హర్యానా వేదికగా పోటీలు జరుగనున్నాయి. మహర్షి దయానంద్ యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సీనియర్ క్యాడెట్ జాతీయ స్థాయి పోటీలకు శేఖర్ రిఫరీగా వ్యవహరించనున్నాడు. రిఫరీగా ఎంపికైన శేఖర్‌ను సోమవారం కిక్‌బాక్సింగ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి మహిపాల్ అభినందించారు.

# వెస్టిండీస్ టూర్‌కు 19న జట్టు ఎంపిక

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్ సెమీ ఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించడంతో తీవ్ర నిరాశలో ఉన్న టీమ్‌ఇండియా త్వరలో వెస్టిండీస్‌లో పర్యటించనుంది. ఆగస్టు 3న ప్రారంభమయ్యే ఈ టూర్‌లో విండీస్‌తో మొత్తం మూడు టీ20లు, 3వన్డేలు, 2 టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ పర్యటనకు వెళ్లే జట్టును ఈ నెల 19న ఎంపిక చేయనున్నారు. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు ఎలా వ్యవహరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. 'ముంబైలో ఈ నెల 19న సెలక్టర్లు సమావేశమవుతారు. ధోనీ నుంచి మాకు ఎలాంటి సమాచారం లేదు. సెలక్టర్లకు, ఆటగాళ్లకు మధ్య సంబంధాలు ఉంటాయి. ప్రపంచకప్‌లో ధోనీ బాగా ఆడాడు. అయితే, ఆటలో కొనసాగాలా లేదా అనే విషయాన్ని అతడు మాత్రమే నిర్ణయించుకోగలడు' అని సోమవారమిక్కడ జరిగిన సీవోఏ సమావేశం అనంతరం బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు.

# మెరిసిన గైక్వాడ్, గిల్

- విండీస్-ఏపై భారత్-ఏ విజయం



**నార్త్ సౌండ్:** విండీస్ వేదికగా జరుగుతున్న అనధికార వన్డే సిరీస్‌లో భారత్-ఏ జట్టు అదరగొడుతున్నది. సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్-ఏపై 65పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌లో 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత జట్టులో ఓపెనర్లు రితురాజ్ గైక్వాడ్(102బంతుల్లో 85), శుభ్‌మన్ గిల్(83 బంతులో 62) అద్భుతంగా ఆడారు. వీరిద్దరూ మొదటి వికెట్‌కు 151 పరుగులు జోడించినా తర్వాతి బ్యాట్స్‌మెన్ మోస్తరుగా ఆడడంతో నిర్ణీత 50ఓవర్లలో భారత్ 8వికెట్లకు 255 పరుగులు చేసింది. విండీస్ బౌలర్లలో రొమారియా షెఫర్డ్ (4/36) రాణించాడు. భారత బౌలర్ నవ్‌దీప్ సైనీ 5వికెట్లతో విజృంభించడంతో లక్ష్య ఛేదనలో విండీస్ తీవ్రంగా తడబడింది. 190 పరుగులకే ఆలౌటై వరుసగా రెండో పరాజయాన్ని మూటగట్టుకుంది.

# ఐసీసీ జట్టులో రోహిత్, బుమ్రా

కోహ్లీకి దక్కని చోటు

**లండన్:** ప్రపంచకప్ టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసిన 11మంది ఆటగాళ్లతో కూడిన మేటి జట్టును అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) సోమవారం ప్రకటించింది. ఈ జట్టులో భారత్ నుంచి డాషింగ్ ఓపెనర్, టోర్నీ టాప్ స్కోరర్ రోహిత్ శర్మ, స్పీడ్‌స్టర్ జస్ప్రీత్ బుమ్రాకు చోటు దక్కింది. అయితే టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ జట్టులో లేకపోవడం కాస్త షాకిచ్చింది. బ్యాటింగ్‌తో పాటు తన జట్టును సమర్థంగా ముందుకు నడిపి.. ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ అవార్డు గెలుచుకున్న న్యూజిలాండ్ సారథి కేన్ విలియమ్సన్‌ను ఐసీసీ జట్టుకు కెప్టెన్‌గా ఎంచుకుంది.

**ఐసీసీ ప్రపంచకప్ ఎలెవన్ జట్టు**

రోహిత్ శర్మ (భారత్), జాసన్ రాయ్ (ఇంగ్లండ్), కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్; కెప్టెన్), జో రూట్ (ఇంగ్లండ్), షకీబ్ అల్ హసన్ (బంగ్లాదేశ్), బెన్ స్టోక్స్ (ఇంగ్లండ్), అలెక్స్ కేరీ, మిచెల్ స్టార్క్ (ఆస్ట్రేలియా), జోఫ్రా ఆర్చర్(ఇంగ్లండ్), లూకీ ఫెర్గూసన్ (న్యూజిలాండ్), జస్ప్రీత్ బుమ్రా(భారత్) 12వ ఆటగాడు: ట్రెంట్ బౌల్ట్(న్యూజిలాండ్).




**టాప్‌లోనే కోహ్లీ, బుమ్రా**

ఐసీసీ వన్డే బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో టీమ్ ఇండియా కెప్టెన్ కోహ్లీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. బౌలింగ్ విభాగంలో బుమ్రా నంబర్‌వన్ ర్యాంకును పదిలం చేసుకున్నాడు. ప్రపంచకప్ తర్వాత ఐసీసీ సోమవారం ప్రకటించిన వన్డే ర్యాంకుల్లో 886 పాయింట్లతో కోహ్లీ టాప్‌లో ఉంటే.. ప్రపంచకప్‌లో ఐదు సెంచరీలు సహా టాప్ స్కోరర్‌గా నిలిచిన రోహిత్ శర్మ(881) తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు. కివీస్ కెప్టెన్ విలియమ్సన్(796) ఆరో ర్యాంకుకు చేరుకున్నాడు. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ స్టోక్స్(694) ఐదుస్థానాలను మెరుగుపరుచుకొని తొలిసారిగా టాప్-20లో అడుగు పెట్టాడు. బౌలింగ్‌లో 809 పాయింట్లతో బుమ్రా తొలి ర్యాంకులో ఉంటే... కివీస్ బౌలర్ బౌల్ట్ (740) రెండో స్థానంలో ఉన్నాడు. టీమ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్(123) టాప్‌లో ఉండగా భారత్(122) రెండో స్థానంలో కొనసాగుతున్నది.



సచివాలయంలో చైనా ప్రతినిధులతో మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమావేశం

## తెలంగాణలో పెట్టుబడులకు చైనా ఆర్ట్స్ అసోసియేషన్ ఆసక్తి

### పర్యాటకాభివృద్ధిపై మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు చైనా ఆర్ట్స్ అసోసియేషన్ ఆసక్తి కనబరిచింది. సోమవారం సచివాలయంలో అసోసియేషన్ ప్రతినిధులతో పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే రెండు రోజుల నుంచి చైనా ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటించారని మంత్రి ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో పర్యాటకాభివృద్ధిపై పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని కనబరిచారని పేర్కొన్నారు. సీఎం దృష్టికి వారి ప్రతిపాదనలు తీసుకువెళ్తానని చెప్పారు. చైనా ప్రభుత్వ రంగ సంస్థ చైనా ఆర్ట్స్ అసోసియేషన్‌కు చెందిన ప్రతినిధులు సచెంగ్ వెయి, వాన్ గెలి, సురేష్ విజయన్, ఆసగర్ అలీ గత రెండు రోజులుగా రాష్ట్రంలో ఉన్న చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. ఈ క్రమంలోనే గోల్కొండ, రామోజీ ఫిలిం సిటీ, హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే విషయమై మంత్రితో చర్చించారు. అయితే హుస్సేన్‌సాగర్‌లోని రోప్‌వే, కేబుల్ పాడ్ కార్, వాటర్ స్పోర్ట్స్ తదితర పర్యాటకులను అకట్టుకునే ప్రతిపాదనలతో ముందుకు రావాలని చైనా ప్రతినిధులకు మంత్రి సూచించారు. కాగా, తెలంగాణ అభివృద్ధి, ఇక్కడి సమతుల్య వాతావరణానికి తోడు.. చారిత్రక నగరం కావడం వల్ల హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు పలు దేశాలకు చెందిన కంపెనీలు ముందుకు వస్తున్నాయని మంత్రి అన్నారు. సమావేశంలో పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ మనోహర్, టీఎస్‌టీడీసీకి చెందిన టూరిజం అధికారులు పురేందర్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

# ద్రవ్యోల్బణం.. వాణిజ్యం.. అదుర్స్.. బెదుర్స్..

## జూన్‌లో

### రెండేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 2.02 శాతంగా నమోదైన టోకు ధరల సూచీ

### 9.71 శాతం క్షీణించి 25 బిలియన్ డాలర్లకు పరిమితమైన ఎగుమతులు

**న్యూఢిల్లీ, జూలై 15:**

ద్రవ్యోల్బణం గణాంకాలు మెప్పిస్తే.. వాణిజ్య గణాంకాలు నొప్పించాయి. గత నెల జూన్‌లో టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) 23 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 2.02 శాతానికి దిగొచ్చింది. ఇదే సమయంలో దేశీయ ఎగుమతులు గతేడాది జూన్‌తో పోల్చితే 9.71 శాతం దిగజారి 25.01 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. సోమవారం కేంద్ర గణాంకాల కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టడం, ఇంధన, విద్యుత్ చార్జీల భారం దిగడం వంటివి డబ్ల్యూపీఐ నుంచి ఆర్థిక వ్యవస్థకు ఉపశమనాన్ని కలిగించాయి. అంతకుముందు నెల మేలో 2.45 శాతంగా ఉన్న టోకు ద్రవ్యోల్బణం.. గతేడాది జూన్‌లో 5.68 శాతంగా నమోదైంది. ఆహారోత్పత్తుల ధరలు మేతో పోల్చితే జూన్‌లో స్వల్పంగా 6.99 శాతం నుంచి 6.98 శాతానికే తగ్గగా, కూరగాయల ధరలు మాత్రం 33.15 శాతం నుంచి 24.76 శాతానికి జారాయి. అయితే ఉల్లిగడ్డ ధర మాత్రం పెరిగింది. మేలో





15.89 శాతంగా ఉంటే.. జూన్‌లో 16.63 శాతంగా ఉన్నది. అయినప్పటికీ 2017 జూలై తర్వాత అత్యంత కనిష్ఠ స్థాయికి టోకు ధరలు దిగివచ్చాయి. నాడు 1.88 శాతంగానే నమోదైంది. జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఆరు నెలల గరిష్ఠానికి చేరి 3.18 శాతంగా నమోదైన తరుణంలో హోల్‌సేల్ ద్రవ్యోల్బణం తగ్గడం జీడీపీకి కొత్త జోష్‌నిచ్చిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఈ ఏప్రిల్‌కుగాను డబ్ల్యూపీఐ డేటాను 3.07 శాతం నుంచి 3.24 శాతానికి పెంచారు. ఇదిలావుంటే గతేడాది జూన్‌తో చూస్తే దేశీయ ఎగుమతులు ఈ ఏడాది జూన్‌లో 9.71 శాతం పతనమైయ్యాయి. పోయినసారి 27.7 బిలియన్ డాలర్లుగా ఉంటే.. ఈసారి 25.01 బిలియన్ డాలర్ల వద్దే నిలిచాయి. రత్నాలు, ఆభరణాలు, ఇంజినీరింగ్, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు పడిపోవడమే ఇందుకు కారణం.

**వాణిజ్య లోటు 15.28 బిలియన్ డాలర్లు**

దిగుమతులూ 9 శాతం పడిపోగా, క్రిందటిసారితో చూస్తే 44.3 బిలియన్ డాలర్ల నుంచి 40.29 బిలియన్ డాలర్లకు దిగాయి. దీంతో వాణిజ్య లోటు 15.28 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గతేడాది జూన్‌లో 16.6 బిలియన్ డాలర్లుగా ఉన్నది. రత్నాలు, ఆభరణాల ఎగుమతులు 16.3 శాతం పతనమై 2.82 బిలియన్ డాలర్లుగానే ఉండటం ఎగుమతుల్ని తగ్గించి వాణిజ్య లోటును పెంచేందుకు కారణమైంది. గతేడాది జూన్‌లో 3.37 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని రత్నాలు, ఆభరణాల ఎగుమతి ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) తెలిపింది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ప్రభావం కనిపిస్తున్నదని మండలి వైస్ చైర్మన్ కోలిన్ షా పీటీఐతో అన్నారు. ఇరు దేశాల మధ్య పెరిగే వాణిజ్య ఉద్రిక్తతలు.. మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీయగలవన్న ఆందోళనల్ని ఆయన వ్యక్తం చేశారు. 'అమెరికా-చైనా వాణి జ్య యుద్ధం.. చైనా నుంచి విడి వజ్రాల డిమాండ్‌ను ప్ర భావితం చేస్తున్నది. దేశీయం గా అధిక కస్టమ్స్ సుంకాలు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), నగదు కొరత వంటి అంశా లూ రత్నాలు, ఆభరణాల ఎగుమతి రంగాన్ని దెబ్బతీస్తున్నాయి. నీరవ్ మోదీ-మెహుల్ చోక్సీ కుంభకోణం సెగ సైతం తగులుతున్నది' అని షా తెలిపారు. ఈ ఏప్రిల్-జూన్‌లో 10.38 శాతం క్షీణించి 9.18 బిలియన్ డాలర్లుగా రత్నాలు, ఆభరణాల ఎగుమతులు నమోదైయ్యాయన్న ఆ యన నిరుడు ఇదే వ్యవధిలో 10.25 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు చెప్పారు. జూ న్‌లో స్వర్ణాభరణాల ఎగుమ తి 15.41 శాతం పడిపోయి 913. 88 మిలియన్ డాలర్లుగా ఉందని, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.22 శాతం పతనమై 3.03 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని తెలిపారు. ముడి, పాలీష్డ్ వజ్రాల ఎగుమతీ 19.38 శాతం తగ్గి 1.68 బిలియన్ డాలర్లకు దిగజారింది.

**జింబాబ్వేలో ద్రవ్యోల్బణం 175%**

**హరారే:** జింబాబ్వేలో ద్రవ్యోల్బణం ఏకంగా 175 శాతంగా నమోదైంది. కరెన్సీ విలువలోనే కాదు.. ద్రవ్యోల్బణం విషయంలోనూ ఆ దేశం భయంకర గణాంకాలను చూపిస్తున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమై.. ఇతర దేశాల కరెన్సీని తమ జాతీయ కరెన్సీగా ప్రకటించుకుంటున్న జింబాబ్వేలో గత నెల వార్షిక ద్రవ్యోల్బణం 175.66 శాతంగా నమోదైంది. ఈ మేరకు సోమవారం అక్కడి అధికారులు తెలియజేశారు. అంతకుముందు మే నెలలో ఇది 97.85 శాతంగా ఉందని ఓ ప్రకటనలో జింబాబ్వే జాతీయ గణాంకాల ఏజెన్సీ స్పష్టం చేసింది. జింబాబ్వే డాలర్ విలువ మహా పతనం మధ్య 2009 నుంచి అమెరికా డాలర్‌నే తమ జాతీయ కరెన్సీగా ఆ దేశం కొనసాగిస్తున్నది. గత నెలలోనే ఇతర కరెన్సీలకు మళ్లింది.



## ఎన్‌బీఎఫ్‌సీలకు ఆటో, నిర్మాణ రంగాల సెగ

### అమ్మకాలు లేక పడిపోతున్న రుణాల పంపిణీ

**న్యూఢిల్లీ, జూలై 15:** మూలిగే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా తయారైంది దేశంలో బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల పరిస్థితి. అసలే రుణ భారం పెరిగిపోయి నానా ఇబ్బందులు పడుతున్న ఎన్‌బీఎఫ్‌సీలకు.. ఆటో, నిర్మాణ రంగాల్లోని మందగమనం సెగ తగులుతున్నది మరి. ఆటో సేల్స్, ఇండ్ల కొనుగోళ్లు అంతంతమాత్రంగానే ఉండటంతో రుణాల పంపిణీ దిగజారి ఎన్‌బీఎఫ్‌సీలకు వ్యాపారం దూరమవుతున్నది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో గడిచిన మూడేండ్లకుపైగా కాలంలో ఎన్నడూ లేనంతగా రుణాల మంజూరు తగ్గిపోయింది. ఆటో, రియల్ ఎస్టేట్ రంగాలేగాక ఇతర నాన్-రిటైల్ రంగాల పరిస్థితీ ఇబ్బందికరంగానే ఉందని మోతీలాల్ ఓస్వాల్‌లో ఎన్‌బీఎఫ్‌సీ విశ్లేషకుడు అల్పేష్ మెహెతా అన్నారు. అయితే హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్స్ వంటి సంస్థల పరిస్థితి బాగానే ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ సంస్థలకు బ్యాంకుల నుంచి, మ్యూచువల్ ఫండ్స్ నుంచి మూలధన సాయం సమస్యలు రాలేదని, నగదు కొరత ఇబ్బందీ ఎదుర్కోలేదని చెప్పారు. అయినప్పటికీ మిగతా ఎన్‌బీఎఫ్‌సీల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని, దీంతో ఈ ఏప్రిల్-జూన్‌లో మొత్తం రుణాల వృద్ధి 15 శాతానికే పరిమితమైందని, 2017 మార్చి తర్వాత ఇదే అత్యంత కనిష్ఠమని మోతీలాల్ ఓస్వాల్ అన్నది. హెచ్‌డీఎఫ్‌సీ, ఎంఏఎస్ ఫైనాన్షియల్, పీఎన్‌బీ హౌజింగ్ ఆదాయ వృద్ధి బాగున్నా.. ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్, ఇండియా బుల్స్ హౌజింగ్ ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్ వృద్ధి తగ్గవచ్చంటూ ఏప్రిల్-జూన్‌కుగాను అంచనా వేసింది.

**సెప్టెంబర్ నుంచే తిరోగమనం**

గతేడాది సెప్టెంబర్ నుంచి దేశీయ ఆటో రంగంలోని అన్ని ప్రధాన సంస్థల వాహన అమ్మకాలు క్రమేణా క్షీణిస్తున్నాయి. ఈ ఏడాది మే నెలలో ఆటో దిగ్గజం మారుతీ సుజుకీ.. తమ ఉత్పత్తిని వరుసగా నాలుగో నెల దాదాపు 18 శాతం తగ్గించుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఇక నిరుడు సెప్టెంబర్ నుంచే ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ సంక్షోభం మొదలైంది. తొలిసారి ఈ ఇన్‌ఫ్రా దిగ్గజం చెల్లింపుల్లో విఫలమైనట్లు బహిర్గతమైంది. ఇక డీహెచ్‌ఎఫ్ఎల్ పరిస్థితి ప్రస్తుతం చూస్తూనే ఉన్నాం. ఈ జనవరి-మార్చి వ్యవధిలో ఏకంగా రూ.2,223 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. సంస్థ మనుగడే ఇప్పుడు ప్రశ్నార్థకంగా ఉన్నది. ఈ సంస్థ కూడా 2018 సెప్టెంబర్ నుంచే రూ.40,000 కోట్లకుపైగా చెల్లింపుల సమస్యను ఎదుర్కొంటున్నది.

# బజారంతా బేజారే!

### ఆందోళనలో వ్యాపార రంగం ▪ దేశ ఆర్థిక మందగమనంపై పరిశ్రమ దిగులు

### మూడేండ్లలో మునుపెన్నడూ లేని స్థాయికి బిజినెస్ సెంటిమెంట్ పతనం ▪ ఐహెచ్ఎస్ మార్కిట్ అధ్యయనం

**న్యూఢిల్లీ, జూలై 15:**

దేశీయ వ్యాపార రంగం ఆందోళనలో ఉన్నది. 2016 జూన్ నుంచి గమనిస్తే ఈ ఏడాది జూన్‌లో మునుపెన్నడూ లేని స్థాయికి బిజినెస్ సెంటిమెంట్ పడిపోయింది. గత నెల 12-26 మధ్య జరిగిన అధ్యయనం ఆధారంగా ఐహెచ్ఎస్ మార్కిట్ ఇండియా బిజినెస్ ఔట్‌లుక్ సోమవారం విడుదలైంది. ఇందులో భారతీయ వ్యాపార, పరిశ్రమ చుట్టూ దిగులు మేఘాలు అలుముకున్నట్లు తేలింది. ఆర్థిక మందగమనం, వేగం తగ్గిన ప్రభుత్వ విధానాల అమలు, పడిపోయిన అమ్మకాలు, నీటి కొరత తదితర అంశాలపై వ్యాపార వర్గాలు భయాందోళనతో ఉన్నట్లు ఐహెచ్ఎస్ మార్కిట్ ప్రధాన ఆర్థికవేత్త పొలియానా డీ లిమా తెలిపారు. ప్రతికూల పరిస్థితుల మధ్య కొత్త నియామకాలకు, పెట్టుబడులకు బ్రేక్ పడిందని చెప్పారు. ఫలితంగా ఉత్పాదకత కూడా తగ్గుముఖం పట్టిందని లిమా వివరించారు.

**సమస్యలు-సవాళ్లు**

ప్రస్తుతం మార్కెట్‌ను పలు సమస్యలు, సవాళ్లు తీవ్రంగా వేధిస్తున్నాయి. కార్మికుల్లో నైపుణ్య లేమి, పన్నుల భారం, రుణ లభ్యత, మొండి బకాయిలు తదితర ఆర్థిక ఇబ్బందుల సమస్యలను వ్యాపారులు ప్రధానంగా ఎదుర్కొంటున్నట్లు ఐహెచ్ఎస్ మార్కిట్ అధ్యయనం తెలిపింది. అలాగే డిస్కౌంట్లను కోరే కస్టమర్లు ఎక్కువైపోయారని, ప్రతీ వస్తువు ధరను తగ్గించాలని అడిగేవారు మార్కెట్‌లో అధికంగా కనిపిస్తున్నారని చెప్పింది. ఇది ప్పుడు మార్కెట్ వర్గాలకు ఓ సవాల్‌గా పరిణమిస్తున్నదని పేర్కొంది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఒడిదుడుకులకు లోనవుతుండటం.. ధరల్లో స్థిరత్వాన్ని లోపించేలా చేస్తున్నదని, దిగుమతులు భారమై సరసమైన ధరలకు మార్కెట్‌లో ఏదీ లభించలేని పరిస్థితి ఉందని తాజా సర్వే స్పష్టం చేసింది. ఫలితంగా వినియోగదారుడు సంతృప్తికరంగా ఉండటం లేదన్నది.

**భవిష్యత్తుపైనే ఆశలన్నీ**

సమీప భవిష్యత్తులోనైనా పరిస్థితులు చక్కబడకపోతాయా? అన్న ఆశాభావంతో దేశీయ వ్యాపార రంగం ఉందని సర్వే వెల్లడించింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు వ్యాపార సంస్కరణలకు మొగ్గు చూపుతుందని, ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెడుతుందన్న విశ్వాసంతో కనిపిస్తున్నట్లు చెప్పింది. కాగా, మార్కెట్ సెంటిమెంట్ బలపడాలంటే.. వర్షాలు సమృద్ధిగా కురువాలని, అప్పుడే వినియోగదారుల్లో.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోళ్ల సామర్థ్యం పెరుగుతుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం సైతం వ్యాపార, పారిశ్రామిక రంగాలకు ఊతమిచ్చే నిర్ణయాలు తీసుకుంటే మళ్లీ జీడీపీ పరుగులు పెట్టగలదన్న నమ్మకాన్ని కనబరుస్తున్నారు.



## ఎస్‌బీఐకి రూ.7 కోట్ల జరిమానా

**ముంబై, జూలై 15:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) భారీ జరిమానా విధించింది. మొండి బకాయిల (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)కు సంబంధించి నిబంధనల ఉల్లంఘనకుగాను ఏకంగా రూ.7 కోట్ల జరిమానా వేసింది. ఈ మేరకు సోమవారం రిజర్వ్ బ్యాంకు తెలియజేసింది. రిస్క్ మేనేజ్‌మెంట్‌లో అవకతవకలు, ఇతరత్రా కారణాలూ ఈ జరిమానాకు దారి తీశాయి. ఇప్పటికే మొండి బకాయిల్లో ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే ఎస్‌బీఐ అగ్రస్థానంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంక్ ఇంకా ఏమరుపాటుగానే ఉండటం ఆర్బీఐ ఆగ్రహానికి కారణమైంది. ఆదాయ ధ్రువీకరణ, ఆస్తుల వర్గీకరణ, కొత్త ఖాతాలు, ప్రస్తుత ఖాతాల నిర్వహణ వంటి విషయాల్లో ఎస్‌బీఐ నిబంధనలను పాటించలేదని ఆర్బీఐ చెబుతున్నది.

## రియల్‌మీ ఎక్స్, 3ఐ

- దేశీయ మార్కెట్‌కు సరికొత్త మొబైల్స్ పరిచయం
- రూ.16,999-19,999 ధరల శ్రేణిలో ఎక్స్
- రూ.7,999-9,999 ధరల్లో 3ఐ లభ్యం




సోమవారం న్యూఢిల్లీలో రియల్‌మీ ఎక్స్, 3ఐ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

**న్యూఢిల్లీ, జూలై 15:** దేశీయ మార్కెట్‌కు మరో రెండు సరికొత్త రకం స్మార్ట్‌ఫోన్లను పరిచయం చేసింది రియల్‌మీ. ఎక్స్, 3ఐ పేరుతో వచ్చిన ఈ మొబైల్స్‌లో చాలా ప్రత్యేకతల్నే పొందుపరిచింది సంస్థ. సోమవారం ఇక్కడ అట్టహాసంగా జరిగిన ప్రారంభోత్సవ వేడుకలో రియల్‌మీ సంస్థ.. ఎక్స్ వేరియేషన్‌తో ప్రీమియం ఫోన్స్ విభాగంలోకి ప్రవేశించింది. రియల్‌మీ ఎక్స్ ప్రారంభ ధర రూ.16,999. గరిష్ఠ ధర 19,999గా ఉండగా, 4జీబీ, 8జీబీ ర్యామ్‌లతో ఇవి లభించనున్నాయి. 6.53 అంగుళాల ఫుల్ హెచ్‌డీ సూపర్ ఎమోఎల్‌ఈడీ తెరతో పాప్-అప్ కెమెరాతో రియల్‌మీ ఎక్స్ అత్యంత ఆకర్షణీయంగా ఉన్నది. క్వాల్కామ్ స్నాప్‌డ్రాగన్ 710 ప్రాసెసర్‌తో, 48 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా, 16 మెగాపిక్సల్ ఫ్రంట్ కెమెరా, అదనంగా మరో 5 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరా దీని సొంతం. స్టోరేజీ సామర్థ్యం 128 జీబీ. ఇక 3ఐ కనిష్ఠ ధర రూ.7,999 (3జీబీ ర్యామ్)గా, గరిష్ఠ ధర రూ.9,999 (4జీబీ ర్యామ్)గా ఉన్నది. 6.2 అంగుళాల హెచ్‌డీ తెర, 13 మెగాపిక్సల్, 2 మెగాపిక్సల్ బ్యాక్ కెమెరాలు, 13 మెగాపిక్సల్ ఫ్రంట్ కెమెరా ఇందులో ఉన్నాయి. దీని స్టోరేజీ సామర్థ్యం 64జీబీ అని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 24 నుంచి ఫ్లిప్‌కార్ట్, తమ సొంత వెబ్‌సైట్లలో ఈ ఫోన్లు లభ్యమవుతాయని చెప్పారు. కాగా, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 50 నగరాలలో 8 వేల రిటైల్ ఔట్‌లెట్లలో విక్రయాలు జరుపుతున్న సంస్థ.. ఈ ఏడాది చివరికల్లా 150 నగరాల్లో 20 వేల రిటైల్ ఔట్‌లెట్లలో అమ్మకాలను ఈ సందర్భంగా లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ ఏప్రిల్-జూన్ వ్యవధిలో దేశవ్యాప్తంగా మొబైల్ అమ్మకాల్లో రియల్‌మీ 2వ స్థానంలో ఉన్నట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.

## 160 పాయింట్లు పుంజుకున్న సెన్సెక్స్

### ఇన్ఫీ, ద్రవ్యోల్బణాల జోష్



**ముంబై, జూలై 15:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం లాభాల్లో ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 160.48 పాయింట్లు పుంజుకుని 38,896.71 వద్ద ముగియగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 35.85 పాయింట్లు అందుకుని 11,588.35 వద్ద నిలిచింది. దేశీయ ఐటీ రంగంలో రెండో అతిపెద్ద సంస్థ ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు మదుపరులను ఆకట్టుకున్నాయి. దీనికితోడు జూన్ ద్రవ్యోల్బణం గణాంకాలుండటంతో సూచీలు లాభాల్లో నడిచాయి. టోకు ధరల సూచీ దాదాపు రెండేండ్ల కనిష్ఠానికి పరిమితమైంది. దీంతో ఒకానొక దశలో సెన్సెక్స్ 39,023.97 స్థాయిని తాకింది. ఇక ఇన్ఫోసిస్ షేర్ విలువ 7.20 శాతం లాభపడింది. సంస్థ మార్కెట్ విలువ ఈ ఒక్కరోజే రూ.17,636.08 కోట్లు ఎగిసి రూ.3,34,777.08 కోట్లకు చేరింది. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో అంచనాలను మించి ఇన్ఫోసిస్ లాభాలను ప్రకటించిన విషయం తెలిసిందే. టీసీఎస్ షేర్ విలువ కూడా 1.77శాతం పెరిగింది. టెక్ మహీంద్రా 1.73 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 0.24 శాతం చొప్పున లాభపడ్డాయి. ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, యెస్ బ్యాంక్, ఎస్‌బీఐ, హీరో మోటోకార్ప్ షేర్లు 2.28 శాతం మేర నష్టపోయాయి. ఈ క్రమం లో బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌లూ 0.63 శాతం వరకు పడిపోయాయి. ' ఇదిలావుంటే చైనా జీడీపీ గణాంకాలు ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.2 శాతానికి దిగజారడం ఆసియా మార్కెట్లను కలవరపాటుకు గురిచేసింది. అయితే చాలావరకు కోలుకోవడంతో మదుపరులు ఊపిరి పీల్చుకున్నారు. అమెరికాతో వాణిజ్య యుద్ధం నడుమ ఏకంగా 27 ఏండ్ల కనిష్ఠానికి వృద్ధిరేటు పతనమైంది.

## రుణదాతలతో డీహెచ్‌ఎఫ్ఎల్ చర్చలు

### ఆర్థిక సాయం, రుణాల పునర్వ్యవస్థీకరణ అంశాలే ప్రధానం

### 30 శాతం పతనమైన షేర్ విలువ

**న్యూఢిల్లీ, జూలై 15:**

సంక్షోభంలో చిక్కుకున్న డీహెచ్‌ఎఫ్ఎల్.. రుణదాతలు, వాటాదారులతో చర్చలు జరుపుతున్నది. ఆర్థిక సాయం, రుణాల పునర్వ్యవస్థీకరణ అంశాలే ప్రధానంగా ఇవి సాగుతున్నాయి. 'మేము వాటాదారులు, రుణదాతలను కలుస్తున్నాం. రుణాల్లో ఎలాంటి కోతలు పెట్టకుండానే క్రెడిటర్లతో చర్చలు జరుపుతున్నాం' అని సంస్థ చైర్మన్, ఎండీ కపిల్ వాధవాన్ చెప్పారు. గతేడాది సెప్టెంబర్ నుంచి రూ.41,800 కోట్ల చెల్లింపులు జరిపామన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2018-19) చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో ఏకంగా రూ.2,223 కోట్ల నికర నష్టాన్ని సంస్థ చూపిన విషయం తెలిసిందే. పెరిగిన మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ), తగ్గిన రుణాల పంపిణీ.. సంస్థ నష్టాలను విపరీతంగా పెంచేశాయి. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2017-18) ఇదే వ్యవధిలో సంస్థ రూ.134 కోట్ల లాభాన్ని అందుకోవడం గమనార్హం. మొత్తం 2018-19లో సంస్థ నష్టం రూ.1,036 కోట్లుగా ఉండగా, 2017-18లో ఇది రూ.1,240 కోట్ల లాభంగా ఉన్నది.




**మరింత సమాచారం కావాలి**

డీహెచ్‌ఎఫ్ఎల్ ఆడిటర్లు సంస్థ ఆర్థికాంశాలపై తమకు మరింత సమాచారం కావాలని కోరుతున్నారు. కంపెనీల చట్టం-2013లోని సెక్షన్ 143 కింద యాజమాన్యం నుంచి ఆర్థిక వివరాలను సేకరించే పనిలో ఉన్నారని సంబంధిత వర్గాల సమాచారం. డెలాయిట్ హస్కిన్స్, చతుర్వేది అండ్ షా.. సంస్థ ఆడిటర్లుగా వ్యవహరిస్తున్నాయి. అయితే డెలాయిట్ ఇండియా ప్రతినిధిని వివరాలు కోరగా దీనిపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు. మరోవైపు సంస్థ షేర్ విలువ సోమవారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ట్రేడింగ్‌లో 29.15 శాతం నష్టపోయి రూ.49.20 వద్ద స్థిరపడింది.





**శ్రీవారి సేవలో గవర్నర్, హరీశ్‌రావు**

తిరుమల శ్రీవారిని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు దర్శించుకున్నారు. సోమవారం ఉదయం వీఐపీ విరామసమయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. -తిరుమల, నమస్తే తెలంగాణ

## ప్రపంచ స్కౌట్ జంబోరీకి తెలంగాణ ప్రాతినిధ్యం


- ఉత్తరఅమెరికాలోని వెస్ట్‌వర్జీనియాలో ఈ నెల 22 నుంచి నిర్వహణ
- హాజరుకానున్న రాష్ట్రశాఖ సంయుక్త కార్యదర్శి మంచాల వరలక్ష్మి



**హైదరాబాద్/బన్సీలాల్‌పేట్, నమస్తే తెలంగాణ:** అమెరికాలోని వెస్ట్‌వర్జీనియాలో ఈ నెల 22 నుంచి ఆగస్టు 2 వరకు జరిగే 24వ ప్రపంచ స్కౌట్ జంబోరి- 2019కి భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్రశాఖ సంయుక్త కార్యదర్శి మంచాల వరలక్ష్మి హాజరవుతున్నారు. అంతర్జాతీయ సేవా బృందం (ఐఎస్టీ) సభ్యురాలిగా ఈమె ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్రశాఖ నుంచి ఐదుగురు ఎంపికైనా, అమెరికా వీసా అందని కారణంగా కేవలం వరలక్ష్మి ఒక్కరే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ.. ఉత్సవాల్లో వెళ్తున్నందుకు సంతోషంగా ఉన్నదని, అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్న తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితకు ధన్యవాదాలని తెలిపారు. జూలై 17న వర్జీనియా నగరానికి బయలుదేరి వెళ్తున్నానని చెప్పారు.

## తిరుమలలో యువతిపై ఎలుగుబంటి దాడి

**తిరుమల:** తిరుమలలోని అటవీప్రాంతంలో ఓ యువతిపై ఎలుగుబంటి దాడి చేసింది. ఇంటి నుంచి గొడవపడి అలిగి వచ్చిన తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా మద్దిమడుగుకు చెందిన విజయలక్ష్మి వారంరోజులుగా తిరుమలలో ఉంటున్నది. సోమవారం మధ్యాహ్నం ఆమె గోగర్భం డ్యామ్‌లో స్నానంచేసిన తర్వాత ఎలుగుబంటి దాడికి పాల్పడింది. దీంతో కాళ్లు, చేతులకు తీవ్రగాయాలైన విజయలక్ష్మిని అశ్విని దవాఖానకు తరలించారు.



- గోగర్భం డ్యామ్ అటవీ ప్రాంతంలో ఘటన
- బాధితురాలిది నాగర్‌కర్నూల్ జిల్లా మద్దిమడుగు

దవాఖానలో విజయలక్ష్మిని పరామర్శిస్తున్న తిరుమల స్పెషలాఫీసర్ ధర్మారెడ్డి



## ఏసీబీ కేసుల్లో నిష్పాక్షికంగా ఉండాలి

- హెచ్‌వోడీలకు సీఎస్ జోషి ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏసీబీ కేసుల విచారణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, అవసరమైతే పునర్విచారణ చేయాలని అన్నిశాఖల అధిపతులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఒక సర్క్యులర్ జారీచేశారు. సాక్షులను పిలిపించి విచారణ పూర్తిచేయాలని, సరైన ఆధారాలు ఉన్నా.. కేసు విచారణ పూర్తయి ఫైల్ మూసేసిన తర్వాతకూడా క్రమశిక్షణాధికారులు డినోవో ఎంక్వైరీ పద్ధతిలో రీఓపెన్ చేసి విచారణ చేసి శిక్ష పడేలా చూడాలని స్పష్టంచేశారు. అవినీతి అధికారులకు క్లీన్‌చిట్ ఇస్తుండటం వల్ల ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోతున్నదని సర్కారు భావిస్తున్నది. విధిగా శిక్ష పడాలన్న ఉద్దేశంతో 1993 డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీస్ చట్ట నిబంధనలు వినియోగించుకోవాలని సీఎస్ ఆదేశించారు.

# నీటి వృథాను అరికట్టాలి

- నీటి నిర్వహణను జాతీయ ప్రాధాన్యంగా గుర్తించాలి
- నీటి వ్యవహారాల నిపుణుడు కేఈ సీతారాం, ఆస్కి చైర్మన్ పద్మనాభయ్య

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచంలోని ప్రాణులన్నింటికీ జీవనాధారమైన నీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉన్నదని ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన నీటి వ్యవహారాల నిపుణుడు కేఈ సీతారాం, ఆస్కి చైర్మన్ కే పద్మనాభయ్య సూచించారు. 'భారతదేశంలోని నగరాల్లో నీటి పునరుద్ధరణ' అనే అంశంపై అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఆస్కి)లో సోమవారం జరిగిన సమావేశంలో సీతారాం, పద్మనాభయ్య మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యధికంగా భూగర్భ జలాలను వినియోగిస్తున్న దేశంగా ఇండియా నిలిచిందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు మరింత తగ్గిపోతాయని, దీంతో 2020 వరకు కోట్ల మంది ప్రజలకు నీటి కరువు ఏర్పడటం ఖాయమని హెచ్చరించారు. నీటి వనరులన్నీ వర్షాలపైనే ఆధారపడతాయని, వర్షపు నీటిని సమర్థంగా నిలువచేసుకోవాలని చెప్పారు. పట్టణాల్లో పెరుగుతున్న సిమెంట్ నిర్మాణాల కారణంగా వర్షపు నీరు భూమిలోకి ఇంకడం లేదని, ఫలితంగా భూగర్భజలాలు పడిపోతున్నాయని తెలిపారు. రోజురోజుకూ తగ్గిపోతున్న భూగర్భ జలాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదన్నారు. దీనికోసం కేంద్రం ప్రత్యేక వాటర్ పాలసీని రూపొందించి, నీటి నిర్వహణను జాతీయ ప్రాధాన్యంగా గుర్తించాలని, ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ఆస్కి డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ నిర్మలతోపాటు ప్రొఫెసర్ వీఎస్ చారి తదితరులు పాల్గొన్నారు.



ఆస్కిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఏడీబీ నీటి వ్యవహారాల నిపుణుడు కేఈ సీతారాం



నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసు ఉన్నతాధికారులు

## కోగంటి కనుసన్నల్లోనే రాంప్రసాద్ హత్య

- ఐదుగురు నిందితులు అరెస్టు.. వారంరోజుల్లోనే కేసు ఛేదించిన పోలీసులు

**ఖైరతాబాద్:** స్టీలు వ్యాపారి తెలపోలు రాంప్రసాద్ హత్య మిస్టరీని పంజాగుట్ట పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. ఈ హత్యకేసులో ఏ1 నిందితుడు కోగంటి సత్యంతో సహా ఐదుగురు నిందితులను అరెస్టుచేశారు. ఏపీలోని విజయవాడ భారతినగర్‌లో నివాసం ఉండే ఏ1 నిందితుడు కోగంటి సత్యనారాయణ (60), కృష్ణలంకకు చెందిన ఏ2 నిందితుడు టేక్యం శ్యామ్‌సుందర్ అలియాస్ శ్యామ్ (50), గుంటూరు జిల్లా రేపల్లె మండలం పేటూరుకు చెందిన పులివర్తి బాల నాగ ఆంజనేయప్రసాద్ (35), మందె ప్రీతం అలియాస్ బాజీ (22), పులివర్తి రాము (27)ను అరెస్టుచేసిన పోలీసులు.. సోమవారం సాయంత్రం హైదరాబాద్ పశ్చిమ మండల డీసీపీ కార్యాలయంలో మీడియా ముందు ప్రవేశపెట్టారు. రెండేండ్ల క్రితమే రాంప్రసాద్ హత్యకు కోగంటి సత్యం పథకం రచించాడని డీసీపీ ఏఆర్ శ్రీనివాస్ తెలిపారు. రాంప్రసాద్‌ను హత్య చేస్తుండగా, అతి సమీపంలోనే కోగంటి సత్యం నిలబడి హంతకులకు సూచనలు చేశాడని.. సెల్‌ఫోన్ సిగ్నల్‌ను ట్రాక్ చేయడం ద్వారా పక్కా సాక్ష్యాలను సేకరించామని వెల్లడించారు. సోమాజిగూడ యశోద దవాఖానలో రాంప్రసాద్ చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాతే అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు విచారణలో తేలిందన్నారు. సమావేశంలో పంజాగుట్ట ఏసీపీ ఎం తిరుపతన్న, సీఐ పీ కరుణాకర్‌రెడ్డి, డీఐ ఎన్ అశోక్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

## విద్యాప్రమాణాలపై దృష్టిపెట్టాలి:పాపిరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యా ప్రమాణాలను మెరుగుపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, అక్రెడిటేషన్, అసెస్‌మెంట్, ర్యాంకింగ్ సిస్టంను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉన్నదని ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి పేర్కొన్నారు. విద్యాప్రమాణాల పెంపు, ఐదేండ్ల విద్యాప్రణాళికపై చర్చించేందుకు ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో సోమవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నిపుణులు, పారిశ్రామిక వర్గాలతో నిర్వహించిన సమ్మేళనంలో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. చర్చలో విద్యామండలి వైస్ చైర్మన్ లింబాద్రి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ, ఓయూ వీసీ తిరుపతి రావు తదితరులు సూచనలు చేశారు.

# రుణమాఫీపై కసరత్తు

- విధివిధానాలు వచ్చే నెలలో ప్రకటించే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో రూ.లక్షలోపు ఉన్న పంటరుణాల మాఫీకి సంబంధించిన విధివిధానాలను వచ్చేనెలలో ప్రకటించే అవకాశం ఉన్నట్టు సచివాలయవర్గాలు వెల్లడించాయి. వీలైనంత త్వరగా మార్గదర్శకాలు రూపొందించి మొదటిదశ కింద కొంత మొత్తం జమచేయాలనే భావనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. 2019 డిసెంబర్ 11వ తేదీ వరకు ఉన్న రూ.లక్షలోపు పంట రుణాలన్నింటినీ మాఫీచేస్తామని ప్రకటించిన సీఎం కేసీఆర్.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ.6వేల కోట్లు కేటాయించడం విశేషం. ఇప్పటికే రాష్ట్రస్థాయి బ్యాంకర్లతో సంప్రదించిన ఆర్థికశాఖ కొంత సమాచారాన్ని సేకరించింది. పంట రుణాల మాఫీ అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు, ఏ సీజన్ నుంచి తీసుకొన్న రుణాలను పరిగణనలోకి తీసుకొంటారనే దానిపై తర్జనభర్జన కొనసాగుతున్నది. కుటుంబంలో ఒక్క రైతుకే వర్తింపజేయడం, బంగారం తాకట్టుపెట్టి రుణం తీసుకుంటే.. మాఫీ ఇవ్వాలా వద్దా అనే విషయాలపై లోతుగా చర్చిస్తున్నట్టు సమాచారం. ఇదిలాఉండగా.. రుణమాఫీకి రూ.20వేల కోట్లు సరిపోతాయని బ్యాంక్‌లు ప్రభుత్వానికి నివేదించగా.. వ్యవసాయశాఖ మాత్రం రూ.26వేల కోట్లు అవసరమని అంచనావేసింది. గతంలో 2017 సెప్టెంబర్ నాటికి ఆఖరి విడుత రుణమాఫీ పూర్తయినందున అప్పటినుంచి 2018 డిసెంబర్ 11 వరకు లెక్కలోకి తీసుకొని ఈ అంచనాలు వేసినట్టు తెలుస్తున్నది. బ్యాంకర్లు చెరకు, పసుపు రైతులను పరిగణనలోకి తీసుకోలేదని, దానివల్లనే అంచనాల్లో తేడా ఉన్నదని వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదలచేసిన తర్వాతే లబ్ధి పొందే రైతుల సంఖ్య, చెల్లించాల్సిన సొమ్ముపై స్పష్టత వస్తుంది.

## ఓయూ దూరవిద్య అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల

**ఉస్మానియాయూనివర్సిటీ:** ఓయూ దూరవిద్యాకేంద్రం ద్వారా 2019-20 విద్యా సంవత్సరానికి పీజీ, డిగ్రీ,పీజీ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్ నోటిఫికేషన్‌ను సోమవారం విడుదలచేశారు. ఓయూ గెస్ట్‌హౌస్ ఐసీఎస్ఎస్ఆర్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ రామచంద్రం, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, పీజీఆర్ఆర్సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ చింత గణేశ్ నోటిఫికేషన్ విడుదలచేశారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర 17 పీజీ కోర్సులు, బీఏ, బీకాం, బీఎస్సీ వంటి నాలుగు యూజీ కోర్సులు, ఐదు పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నామని వీసీ ప్రొఫెసర్ రామచంద్రం తెలిపారు. ఈ ఏడాది ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, పీజీ డిప్లొమా ఇన్ డాటా అనాలిసిస్ కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు పేర్కొన్నారు.

## గంజాయి నిందితుడికి పదేండ్ల జైలుశిక్ష

రూ.లక్ష జరిమానా

**మలక్‌పేట:** గంజాయి విక్రయిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పెద్దూర్ తండావాసి కేతావత్ హీరాలాల్ (23)కు కోర్టు పదేండ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించింది. గతేడాది ఆయన 5 కిలోల గంజాయిని తరలిస్తూ పట్టుబడటంతో పోలీసులు ఎన్‌డీపీఎస్ యాక్ట్ 1985 ప్రకారం సెక్షన్ 235(2) సీఆర్పీసీ కింద కేసు నమోదుచేశారు.









# శివాలయంలో ముగ్గురి దారుణ హత్య

రక్తంతో శివుడికి అభిషేకం.. పుట్టల్లోనూ నెత్తురు • ఏపీలోని అనంతపురం జిల్లా కొర్తికోటలో దారుణం

గుప్తనిధులా.. క్షుద్రపూజలా.. గొడవలు కారణమా! • అన్ని కోణాల్లో కొనసాగుతున్న పోలీసు దర్యాప్తు

**అనంతపురం:** ఏపీలోని అనంతపురం జిల్లా తనకల్లు మండలం కొర్తికోటలో గుర్తుతెలియని దుండగులు ఆదివారం రాత్రి ఇద్దరు మహిళలు సహా ముగ్గురిని దారుణంగా చంపేశారు. ఈ హత్యలకు కారణం.. క్షుద్రపూజలా? గుప్తనిధులా? లేదా గ్రామ గొడవలా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కొర్తికోటలోని పురాతన శివాలయం శిథిలావస్థకు చేరడంతో రిటైర్డ్ టీచర్ శివరామిరెడ్డి (75) కొత్త ఆలయ నిర్మాణం చేపట్టారు. దీనికి ఆయన సోదరి కమలమ్మ (70), బెంగళూరు నివాసి సత్యలక్ష్మి (70) సహకరించారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఆలయంలో నిద్రిస్తున్న ఈ ముగ్గురూ అత్యంత కిరాతకంగా హత్యకు గురయ్యారు. దుండగులు వీరి గొంతుకోసి బండరాళ్లతో కొట్టి చంపారు. వారి రక్తంతో శివుడి విగ్రహానికి అభిషేకం చేశారు. ఆలయం సమీపంలోని పాముల పుట్టల్లో కూడా రక్తాన్ని పోశారు. గుప్త నిధుల కోసం వచ్చిన దుండగులు నరబలి ఇచ్చారని కొందరు.. క్షుద్రపూజల కోసం ఈ ఆలయాన్ని ఉపయోగించుకున్నారని మరి కొందరు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. కొర్తికోటలో ప్రభుత్వ భూమి ఎకరా 40 సెంట్లు గుడిపేరుతో రిజిస్టర్ చేయించాలని శివరామిరెడ్డి ప్రయత్నించగా.. గ్రామస్థులు ఇటీవల అడ్డుకున్నారు. ట్రిపుల్ మర్డర్‌కి కారణం.. క్షుద్రపూజలా? లేక గ్రామంలో జరిగిన గొడవలా? అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.



కొర్తికోట శివాలయంలో దారుణహత్యకు గురైన వ్యక్తులు

## ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా రోజా బాధ్యతలు

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక కల్పనా సంస్థ (ఏపీఐఐసీ) చైర్‌పర్సన్‌గా వైఎస్సార్సీపీ నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఏపీ ప్రభుత్వం గత బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆమె రెండేండ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.






## అక్రమాలపై విచారణలో ఆలస్యమెందుకు?

- హీరాగ్రూప్ కేసులపై హైకోర్టు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రూ.50 వేల కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న హీరా గ్రూప్‌పై దర్యాప్తులో ఆలస్యంపై హైకోర్టు అసహనం వ్యక్తంచేసింది. హీరాగ్రూప్ కంపెనీలపై దాఖలైన ఎఫ్ఐఆర్‌లో తాజా పరిస్థితిపై నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. ప్రజల నుంచి రూ.వేల కోట్లు వసూలు హీరాగ్రూప్ ఎండీ నౌహీరాషేక్‌పై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని బాధితులు పిల్ దాఖలు చేశారు.

**ఎర్రమంజిల్‌పై కొనసాగిన వాదనలు**

ఎర్రమంజిల్‌లో నూతన అసెంబ్లీ, మండలి కాంప్లెక్స్‌ను నిర్మించాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాల్లో సోమవారం వాదనలు కొనసాగాయి. ఎర్రమంజిల్ ప్యాలెస్ హెరిటేజ్ భవనంగా గుర్తించకుండా తెలంగాణ హెరిటేజ్ యాక్ట్ 2017ను తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మంగళవారానికి వాయిదా వేసింది.

## పోలవరం పూర్తిచేస్తాం

- టీడీపీ చేసిందేమీ లేదు
- ఏపీ అసెంబ్లీలో మంత్రి అనిల్

**అమరావతి:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఏపీ జల వనరులశాఖ మంత్రి అనిల్‌కుమార్ చెప్పారు. దశలవారీగా ప్రాజెక్టు పనులను పూర్తిచేస్తామని అన్నారు. పోలవరం ప్రాజెక్టు కోసం టీడీపీ ప్రభుత్వం చేసిందేమీలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టుపై సోమవారం ఏపీ అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబుకు ఈ ప్రాజెక్టును పూర్తిచేద్దామన్న ధ్యాసే లేదన్నారు.

**బాబు విదేశీ పర్యటనలపై విచారణ జరుపాలి**

విదేశీ పర్యటనల పేరిట రూ.39 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన బాబుపై విచారణ జరుపాలని వైసీపీ ఎమ్మెల్యే కాకాని గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు.




## సముద్రయానం.. ప్లాస్టిక్ అధ్యయనానికి మహిళా బృందం



**ప్లాస్టిక్ ఇప్పుడు ప్రపంచవ్యాప్త సమస్య. సముద్రాల్లో దీని తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నది. దీన్ని అధ్యయనం చేయడానికి, పరిష్కారాలను కనుగొనడానికి మహిళా బృందం ప్రపంచంలోని మహాసముద్రాల్లోకి వెళ్లబోతున్నది.**

సముద్రంలో పేరుకుపోతున్న టాక్సిన్స్, ప్లాస్టిక్ వ్యర్థాల తీవ్రతను, వాటి ప్రభావాన్ని అధ్యయనానికి అంతర్జాతీయ మహిళా బృందం ముందుకెళ్తుంది. ఏడు మహాసముద్రాల్లో 3800 నాటికల్ మైళ్ల సముద్రయానం చేయనుంది. 'ఎక్స్‌పెడిషన్ ఎరౌండ్ ద వరల్డ్' అనే సంస్థ ఈ యాత్ర చేయించాలని నిర్ణయించుకుంది. ఆ సంస్థ డైరెక్టర్ ఎమిలి పెన్ పర్యవేక్షణలో 300 మంది మహిళలు సముద్ర ప్రయాణంలో పాల్గొంటారు. శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, టీచర్లు, ఫిల్మ్‌మేకర్లు, ప్రొడక్ట్ డిజైనర్లు, వివిధ వయస్సులో ఉండే ఫొటోగ్రాఫర్లతో పాటు ఎన్నో రంగాల్లో అనుభవం ఉన్న వాళ్లు ఈ కార్యక్రమంలో ఉంటారు. రానున్న సెప్టెంబర్‌లో యూకే నుంచి ప్రారంభమవబోతున్నది. పూర్తి అధ్యయనం, దాని ఫలితాల తర్వాత 2021 సెప్టెంబర్‌లో ఈ సముద్రయానం ముగియనుంది. సప్తసముద్రాల్లో ఏటా ఎనిమిది ట్రిలియన్ల ప్లాస్టిక్ సముద్రాల్లో చేరుతున్నదని ఎమిలి పెన్ చెప్తున్నది. 2050 వరకల్లా ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సముద్రాల్లో జీవులకన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువ ఉంటాయని ఆమె అంటున్నది. అందుకే ఈ ప్రయాణానికి పూనుకున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది.

నమస్తే తెలంగాణ
# జిందగీ
మంగళవారం 16 జూలై 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



**గురువుగా.. వృత్తిధర్మాన్ని పాటిస్తూ..
విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నది.
రచయితగా.. కలం పట్టి సమాజంలోని కుళ్లు,
కుతంత్రాలను కడిగి పడేస్తున్నది..
సమాజ సేవలో.. అన్నార్థులపాలిట అమ్మగా మారుతున్నది..
అభాగ్యుల ఆకలి తీర్చి అక్కున చేర్చుకుంటున్నది.
యోగా గురువుగా.. ఆరోగ్య సమాజానికి నిరంతరం శ్రమిస్తున్నది.
మనిషిగా.. సాటి మనుషులకు సాయపడమంటూ బోధిస్తున్నది.
అన్ని బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూనే..
సమసమాజ స్థాపనకు ఎంతో కృషి చేస్తున్నది బండి ఉష..
పలు రంగాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ లెక్కల
టీచర్ పరిచయమిది.**



# సామాజిక ఉషస్సు!



**విద్య** బతుకునకు దారి చూపితే.. వివేకంతో జీవితాన్నే నేర్చుకున్నారు ఉష. ఏ పనైనా అంతఃకరణశుద్ధితో చేస్తే.. విజయం దాసోహమవుతుంది అనడానికి బండి ఉష చక్కటి ఉదాహరణ. తమ గురించి తాము ఆలోచించుకునే సమయంలేని ఈ రోజుల్లో కూడా.. ఉపాధ్యాయినిగా, రచయితగా, సమాజ సేవకురాలిగా, యోగా గురువుగా రాణిస్తున్నారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆమె ప్రస్థానం మొదలవుతుంది. యోగా నేర్పి, పాఠశాలకు వెళ్తారు ఉష. విద్యార్థులకు పాఠాలు బోధించి, డ్రిల్ పీరియడ్‌లో యోగా కూడా నేర్పుతారు. పాఠశాల ముగిసిన తర్వాత సేవాకార్యక్రమాల్లో బిజీగా పాల్గొంటారు. తీరిక సమయాల్లో రచయిత్రిగా సమాజ శ్రేయస్సుకోసం రచనలు, కవితలు, పద్యాలు, వ్యాసాలు రాస్తుంటారు. ఇలా.. వృత్తితో పాటు ప్రవృత్తికీ వన్నె తెస్తున్నారు బండి ఉష.

**విద్యార్థి దశ నుంచే..**

బండి ఉషది ఖమ్మం పట్టణానికి దగ్గర్లోని ఆరెంపుల గ్రామం. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఉష.. తండ్రి కష్టాన్ని దగ్గరగా చూశారు. భవిష్యత్ మంచిగా ఉండాలంటే చదువొక్కటే మార్గమని నమ్మారు. చదువులో కష్టాన్ని ఇష్టంగా మలుచుకొని టీటీసీకి ఎంపికైయ్యారు. ఉపాధ్యాయురాలిగా కొనసాగుతూనే డిగ్రీలో మ్యాథ్స్ చేసి, మాస్టర్స్‌లో ఎకనామిక్స్, తెలుగు, అదనంగా బీఈడీ చేసి, ఉన్నత విద్యావంతురాలిగా ఎదిగారు ఉష. ప్రస్తుతం ఖమ్మం రూరల్ మండలంలోని జలగం నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లెక్కల టీచర్‌గా పనిచేస్తున్నారు. శాస్త్రీయ పద్ధతిలో విద్యార్థులను సానపడుతూ.. లెక్కల్లో సులభపద్ధతిని వివరిస్తూ 10/10 జీపీఏ సాధనకు తోడ్పడుతున్నారు.

**సాహితీ వనంలో..**



సామాజికాంశాలే కథా వస్తువులుగా ఎన్నో రచనలు చేశారు ఉష. ఇప్పటి వరకు 40కి పైగా కథలు రాశారు. 600లకు పైగా పద్యాలు, 150 వరకు కవితలు.. వందల సంఖ్యలో వ్యాసాలు రాశారు. సాహిత్యరంగంలో ఎన్నో రచనలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. మనిషి జీవితంలోని అన్ని పార్శ్వాలూ ఆమె కవితా వస్తువులే. వివిధ పత్రికలు, మాసపత్రికల్లో ప్రచురితమైన తన కవితల్లోని ఆణిముత్యాల్లాంటి 54 కవితలతో ఇటీవలనే 'ఉషా కిరణాలు' పేరిట కవితా సంపుటిని వెలువరించారు. 'గ్రహణం వీడిన వేళ' కథల సంపుటి ఢిల్లీలో విడుదల చేశారు. ఇక పద్య రచనలోనూ ఆమె దిట్టే. నీతి సంబంధమైన విషయాలతో విద్యార్థులకు ఉపయోగపడేలా ఎన్నో పద్యాలు రాశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాహితీ సంస్థ 'రంజని' నుంచి రెండుసార్లు పురస్కారాన్ని అందుకున్నారు ఉష. వాటిల్లో ఒకటి అవధాన సమ్రాట్ మాడుగుల నాగఫణిశర్మ చేతుల మీదుగా అందుకున్నారు.

**బంగారు బోనం ఎత్తింది..**

ఇటీవల బోనాల జాతరను పురస్కరించుకొని ఢిల్లీ తెలంగాణ భవన్‌లో బంగారు బోనం ఎత్తుకునే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకున్నారు ఉష. 'లాల్ దర్వాజ సింహవాణి' వారు ఈ అవకాశాన్ని కల్పించారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొని పద్మాదేవేందర్‌రెడ్డి నుంచి నగదు పురస్కారాన్ని, సత్కారాన్ని పొందారు ఉష. ఇప్పటికీ కొత్తగూడెం ఆకాశవాణి కార్యక్రమాల్లో బండి ఉష పాల్గొంటుంటారు.

**సేవా కార్యక్రమాల్లో..**

ఎన్ని బాధ్యతలు ఉన్నా.. ఉష ఎప్పుడూ సేవా కార్యక్రమాలను మరువలేదు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా అన్నార్థులకు సేవనందిస్తున్నారు. అప్పుడప్పుడు తానే సొంతంగా వండి, అనాథలకు విందు భోజనం అందిస్తుంటారు. వివిధ సంస్థల్లో నిర్వహించే అన్నదానాల్లో పాల్గొని సేవలందించడం, వృద్ధాశ్రమాల్లో పండ్లు పంపిణీ చేయడం వంటివి చేస్తున్నారు. బహుముఖంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు, పలు రచనలకుగాను ఆమె అనేక సంస్థల నుంచి సన్మానాలు, సత్కారాలు పొందారు. రంజని – విశ్వనాథ పురస్కారం, ఇదే సంస్థ నుంచి రాయప్రోలు రామకృష్ణ పురస్కారాన్ని పొందారు. ఇవి కాకుండా.. విడుదల – నీహారిక, మట్టూరి కమలమ్మ స్మారక పురస్కారం, సోమేపల్లి పురస్కారం, వేద ధర్మశాస్త్ర పరిషత్ పురస్కారం, మల్లెతీగ పురస్కారం, రేపటికోసం పురస్కారం, భానూదయ సంస్థ నుంచి కవితా పురస్కారం, సిరి కల్చరల్ ఫౌండేషన్ ఉగాది పురస్కారం, నవకలం కవితా పురస్కారం, ధ్యానమండలి పురస్కారం అందుకున్నారు ఉష.

**యోగా గురువుగా..**

ఉష స్కూల్‌లో చదువుకున్నప్పటి నుంచే ఆమెకు యోగా అలవాటు ఉంది. ఈ క్రమంలో 'అరవింద యోగా విద్యాలయం' స్థాపించారు. అంతకుముందు 'నేచర్‌క్యూర్'లో యోగా శిక్షకురాలిగా చేశారు. అరవింద యోగా సెంటర్ ద్వారా ఎంతోమందికి ఉచితంగా ఆసనాలు నేర్పిస్తున్నారు. ప్రతిరోజూ కనీసం 150 మందికి శిక్షణ ఇస్తుంటారు. తన దగ్గరికి వచ్చిన వారికి ఎంతో మందికి అధిక బరువు తగ్గించగలిగారు. ఎందరికో స్పాండిలైటిస్, మైగ్రేన్, సైనస్, అస్తమా, గ్యాస్ ట్రబుల్, నడుము నొప్పి, కీళ్ల నొప్పులు, సయాటికా, నల్లమచ్చలు, రుతు సంబంధమైన సమస్యలను నివారించగలిగారు. ఈ కృషిలో తన జీవిత భాగస్వామి దండా లక్ష్మణ్ కూడా తోడ్పాటును అందిస్తుంటారు. ఆయన కూడా యోగా గురువే.

**ఆలోచింపజేస్తే చాలు..!**

> కవిత్వం ఒక తీరని దాహం. ఎంత రాసినా ఇంకా రాయాలనిపిస్తూనే ఉంటుంది. నా రచనలన్నీ సామాజిక అవగాహనకు తోడ్పడతాయని, తప్పు దోవ పడుతున్న సమాజాన్ని ఆలోచింప చేసేవిగా ఉంటాయని నేను బలంగా విశ్వసిస్తున్నా. కవిత్వమైనా, రచనలైనా మనిషిని ఉన్నతుడిగా ఎదిగేలా చేస్తాయని నా నమ్మకం. నా కవితలను, కథలను, పద్యాలు, వ్యాసాలను ఆదరిస్తూ.. ప్రోత్సహిస్తున్న వారందరికీ నా ధన్యవాదాలు. నాకు చేతనైనంత వరకు సమాజ సేవ కోసం తప్పకుండా కృషి చేస్తా.
>
> **- బండి ఉష**

...డప్పు రవి

## క్యాన్సర్‌ను జయించేందుకు ప్రపంచ పర్యటన




**క్యాన్సర్ ఉంటే చావు సమీపించినట్లేనా? ఇది ఉందని తెలితే రోజురోజుకూ కుంగిపోవాల్సిందేనా? చాలామంది దీనినొక భయంకరమైన వ్యాధిగా పరిగణిస్తారు. రోజులు లెక్కపెట్టుకుంటూ బతుకుతారు. కానీ ఆ దంపతులు మాత్రం ఈ వ్యాధి ఉన్నప్పటికీ ప్రపంచాన్ని చుట్టి రావాలనుకున్నారు.**

ముంబైకి చెందిన ముక్తవర్మ, సంజీవ దంపతులు. ప్రస్తుతం సంజీవ ప్రభుత్వ రిజిస్ట్రార్‌గా ఉద్యోగ విరమణ చేశారు. ముక్త వర్మ ఫార్మసూటికల్ కంపెనీలో పని చేసేవారు. వివాహ సమయంలో వేదికపై తీసుకున్న ఒక్క నిర్ణయం వారిని ప్రపంచాన్ని చుట్టి వచ్చేలా చేసింది. పెండ్లి సమయంలో తనకు కొత్త ప్రదేశాలు చుట్టి రావడమంటే ఇష్టమని సంజీవ ముక్తతో చెప్పింది. ఆ తర్వాత ఇద్దరూ పాస్‌పోర్టు తీసుకున్నారు. ఆమె విధులు నిర్వహించే రోజులు మినహా మిగతారోజులన్నీ ప్రయాణం కోసం కేటాయించేవారు. ఒక్కోసారి నెలలో 15 రోజులు కొత్త ప్రదేశాల్ని చుట్టి వచ్చేవారు. ఈ క్రమంలో కొంతకాలంగా సంజీవ రొమ్ముక్యాన్సర్‌తో బాధ పడుతున్నది. ఊపిరితిత్తులకు, మెదడుకు ఈ క్యాన్సర్ ప్రబలింది. డాక్టర్లు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. కానీ సంజీవ తన ఇష్టాన్ని మాత్రం వదులుకోలేదు. తన పయనం క్యాన్సర్ వల్ల ఆగిపోకూడదని అనుకుంది. కీమోథెరపీ చికిత్స పొంది తన ప్రయాణాన్ని పునఃప్రారంభించింది. 'నాకిష్టమైన పనిని చేస్తుండడంతో అనారోగ్యం నుంచి పూర్తిగా కోలుకున్నాను. నాలా ఇక జీవితం అయిపోయిందనుకొనే వారికి నేనొక స్ఫూర్తి కావాలనుకున్నా. క్యాన్సర్ వల్ల జీవితం ముగియలేదు అని ప్రచారం చేస్తూ ఈ ప్రయాణం సాగించాలని అనుకుంటున్నా' అని సంజీవ చెబుతున్నది. 34 యేండ్లుగా యూరప్, లండన్, నెదర్లాండ్స్, బెల్జియం, ఆస్ట్రేలియా, జర్మనీ, స్విట్జర్‌లాండ్, ఇటలీ, ఫ్రాన్స్, రష్యా దేశాల్లో పర్యటించారు. ప్రయాణం ద్వారా మానసిక ఆనందాన్ని పొంది సంజీవ క్యాన్సర్‌ను జయించింది.

## జుట్టును బట్టి తలస్నానం



**కొందరు ప్రతి రోజూ తలస్నానం చేస్తుంటారు. ఇంకొందరు వారానికోసారి కూడా చేయరు. అయితే తలస్నానం జుట్టును బట్టి కూడా తలస్నానం చేయాల్సి ఉంటుందనే విషయం చాలా మందికి తెలియదు.**

- ఆయిలీ హెయిర్ ఉండేవారు ప్రతి రెండు రోజులకు ఒకసారి తలస్నానం చేస్తే మంచి ఫలితం ఉంటుంది. తలస్నానం చేసిన ప్రతిసారీ జుట్టుకు కొంత సిరం, నూనెను అప్లై చేయాలి. ఇలా చేస్తే క్రమంగా జుట్టుకు పోషణ అందుతుంది.
- పొడిబారిన జుట్టు ఉన్నదంటే జుట్టుకు అవసరమైన తేమ లోపించిందని అర్థం. షాంపూతో జుట్టును తరచూ శుభ్రం చేసుకోవడం కారణంగా జుట్టు మరింత తేమను కోల్పోతుంది. పొడి జుట్టు ఉన్నవారు వారంలో రెండుసార్లు 2 నుంచి మూడు రోజుల విరామంతో తలస్నానం చేయవచ్చు.
- మందపాటి జుట్టు ఉన్న వారు వారానికి ఒకసారి తలస్నానం చేయడం మంచిది. జుట్టు ఒత్తుగా ఉండి చుండ్రు సమస్యతో బాధపడుతున్నవారు వారానికి రెండుసార్లు స్నానం చేస్తే మంచిది.
- పొడవాటి జుట్టు ఉన్నవారు జుట్టును తరచూ శుభ్రం చేయాల్సి ఉంటుంది. ఇతర జుట్టు రకాలతో పోలిస్తే దట్టమైన జుట్టు ఉన్నవారికి ఆయిల్, జిడ్డు సమస్య ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ప్రతి రోజు తలస్నానం చేయాలని ఉంటుంది. కానీ ప్రతి రోజు తలస్నానం చేయడం వల్ల జుట్టు పలుచబడుతుంది. వారానికి రెండు లేదా మూడు సార్లు స్నానం చేస్తే మంచిది.
- ఉంగరాల జుట్టు ఉన్నవారు ప్రతి మూడు రోజులకు ఒకసారి తలస్నానం చేస్తే మంచిది. వదులుగా పలుచగా జుట్టు ఉన్నవారు రోజు విడిచి రోజు తలస్నానం చేసినా మంచిదే. అధిక రసాయనాలుండే షాంపూలకు బదులు సహజ సిద్ధ మార్గాలను అనుసరిస్తే మంచిది.

### వంటింటి చిట్కాలు



- పాస్తాను ఉడికించే నీళ్లలో స్పూన్ ఆలివ్ నూనె, కొద్దిగా ఉప్పు వేయాలి. ఇలా చేస్తే ఒకదానికొకటి అతుక్కోదు.
- పన్నీర్‌ని బ్లాటింగ్ పేపర్‌లో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటుంది. ఇలా నిల్వ చేసిన దాన్ని పదిహేను రోజులలోపు వాడితే మంచిది.
- ఆకుకూరలు, కూరగాయలు కడిగేటప్పుడు నీళ్లల్లో చిటికెడు వంటసోడా వేస్తే ఆకుకూరలు రంగు మారకుండా ఉంటాయి.
- అన్నం మెత్తబడినప్పుడు క్యారెట్‌ని తురిమి అందులో వేస్తే అన్నం పొడిపొడిగా అనిపిస్తుంది.

## గిరిజన యువతి సాహసం



**ప్రపంచంలోనే భయంకరమైన అటవీ ప్రాంతాల్లో ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మాద్ ఒకటి. మావోయిస్టుల ప్రభావ ప్రాంతం కావడంతో చుట్టు పక్కల వారు అటువైపు వెళ్లడానికి వెనకాడుతుంటారు. అటువంటి అబుజ్‌మాద్ ప్రాంతంలో ఓ గిరిజన యువతి ధైర్యంగా మెడికల్ షాప్ ఏర్పాటు చేసింది.**

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కిర్త డొర్ప అనే 23 ఏండ్ల గిరిజన యువతి మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో మెడికల్ షాప్ ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకూ ఆ ప్రాంతానికి రెవెన్యూ మ్యాప్ లేదు. ప్రభుత్వాధికారులు సైతం అక్కడ పనిచేయాలంటే వణుకుతుంటారు. సర్కారు నియంత్రణ అంతంత మాత్రమే. ఆయా ప్రాంతంలో నివసించే వారికి సరైన వసతులు అందుబాటులో లేవు. దంతెవాడ, నారాయణ్‌పూర్ జిల్లాల్లో కొన్ని గ్రామాలనే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో నివసించేవారికి అర్చ అనే గ్రామంలో మాత్రమే నిత్యావసరవస్తువులు దొరుకుతాయి. ఈ గ్రామం జిల్లా కేంద్రానికి 70 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడికి వెళ్లాలంటే రవాణా సౌకర్యాలు లేవు. కాలినడకన వెళ్లాలి. 2014లో యునిసెఫ్ ఆయా గిరిజన గ్రామాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించేందుకు ఇంటింటికీ తిరిగి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టింది. ఆ సమయంలో యునిసెఫ్ వలెంటీర్లకు కిర్త డొర్ప అనువాదకురాలిగా పనిచేసింది. అప్పుడు 70 గిరిజన గ్రామాలు చుట్టి వచ్చింది. అలా పర్యటించడం వల్ల ఆమె అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి తెలుసుకున్నది. కిర్త డొర్ప సోదరునికి క్లినిక్‌లో పనిచేసిన అనుభవం ఉండడంతో అతని సలహాలు తీసుకొని ఆ ప్రాంతంలో మెడికల్ స్టోర్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించుకుంది. వైద్యనిపుణులను సంప్రదించి మహిళలు, చిన్న పిల్లల్లో వచ్చే అనారోగ్య సమస్యలకు పరిష్కారాలను చూపుతున్నది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో మందుల దుకాణం ఏర్పాటు చేసి ధైర్యంగా గిరిజనులకు సేవలందిస్తున్న ఆమెను అందరూ ప్రశంసిస్తున్నారు.

II.
నమస్తే తెలంగాణ
జీవనరేఖ
[ కరీంనగర్ ]
మంగళవారం 16 జూలై 2019

# ఊపిరితిత్తులు భద్రం

మీరు ట్రాఫిక్‌లో ఎక్కువ సేపు ఉంటున్నారా? ఎయిర్ పొల్యూషన్‌తో వేగలేక మాస్క్ వేసుకొని వెళ్తున్నారా? అయితే మీ ఊపిరితిత్తులు జర భద్రం.




ఎయిర్ పొల్యూషన్ డైరెక్ట్ స్మోకింగ్ కంటే కూడా ప్రమాదం అని డాక్టర్లు నిత్యం చెప్తూనే ఉంటారు. వాహనాల రద్దీ పెరుగుతుంటే మనం మాత్రం చేసేదేముంది? అనుకోకండి. మాస్క్‌లు వేసుకొని.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు అనుసరించైనా సరే పొల్యూషన్‌కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు నిపుణులు. లేకపోతే ఎంతటి ఆరోగ్యవంతమైన ఊపిరితిత్తులు అయినా చాలా త్వరగా పాడైపోవడం ఖాయమంటున్నారు. వీటివల్ల క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజెస్ (సీఓపీడీ) వంటి సమస్యలు వస్తాయట. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజెస్ (జీబీడీ) ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా 300,000 మందిపై ఆ ప్రాజెక్ట్ బృందం అధ్యయనం చేసింది. సీఓపీడీ వల్ల ఆరోగ్యవంతమైన ఊపిరితిత్తులు పది సంవత్సరాల జీవితకాలాన్ని కోల్పోతాయంటున్నారు పరిశోధకులు.

# దంతక్షయానికి జీన్స్ కారణమే

**దంతాల ఆరోగ్యంపైన శారీరక, మానసిక ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. దంతాలను నిర్లక్ష్యం చేస్తే దంతక్షయం వస్తుంది. దంతక్షయం వల్ల నోటి దుర్వాసనతో పాటు ఆత్మ విశ్వాసమూ లోపిస్తుంది అంటున్నారు నిపుణులు. అయితే దీనికి కారణమేంటి?**



పంటి మీద గార ఏర్పడటం.. ఆహారం కోసం అన్వేషించే బ్యాక్టీరియా ఈ గారను ఆవాస ప్రాంతంగా మార్చుకుంటుంది. ఇవి ఆహారంలోని చక్కెర పదార్థాలను తినేసి ఆమ్ల పదార్థాలను వదిలేస్తాయి. ఇవి దంత ఎనామిల్‌ను దెబ్బతీస్తాయి. ఫలితంగా దంతక్షయం ఏర్పడుతుంది. అయితే సాధారణ కారణాలతో పాటు జీన్స్ కూడా దీనికి కారణం అంటున్నారు నిపుణులు. యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్‌కు చెందిన పరిశోధకులు ఈ అంశంపై అధ్యయనం చేశారు. దాదాపు 47 రకాల జన్యు కారణాలు దంతక్షయాన్ని ప్రేరేపిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పొద్దున్నే ఓ టాబ్లెట్.
రాత్రి మరొక టాబ్లెట్.
చిన్న విషయానికే చిరాకు.
ఏమో అవుతుందనే టెన్షన్.
ఇప్పటివరకు పెద్దవాళ్లనే బాధించిన ఈ బీపీ లక్షణాలు.. ఇప్పుడు పిల్లలనూ వేధిస్తున్నాయి.
ఏ చింతా లేకుండా హాయిగా ఉండాల్సిన పిల్లలకు అంధత్వం.. కిడ్నీ వ్యాధుల రూపంలో వెంటాడుతున్నది!
పిల్లల్లో బీపీ ఎందుకు వస్తుంది?
లక్షణాలేంటి? చికిత్స ఏంటి? తెలుసుకొని వారిని రక్షించుకుందాం.



# బీపీ.. ఇక పిల్లల వంతు!

హైపర్‌టెన్షన్ 8– 18 ఏండ్ల వయసున్న పిల్లల జీవితాలతో ఆడుకుంటున్నది. పెద్దవారిలో మాత్రమే వస్తుందనుకున్న బీపీ సమస్య కౌమార దశలోనూ దడ పుట్టిస్తున్నది. తినే తిండి.. పేరెంటింగ్.. జీన్స్ వంటి పరిస్థితులు దీనిని ప్రభావితం చేస్తున్నాయి. చదువులో పోటీ.. చిన్నప్పటి నుంచే కెరీర్ గురించి విపరీత ఆలోచనలు ఒత్తిడిని పెంచుతున్నాయి. బిజీలైఫ్‌లో పడి పిల్లల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉండకండి.

### ఎలా తెలుస్తుంది?

పిల్లల్లో హైపర్‌టెన్షన్‌ను సెంటైల్ చార్ట్ ద్వారా తెలుసుకుంటారు. వయసు, జెండర్, శరీర ఎత్తు వంటి అంశాల ఆధారంగా బీపీని గుర్తిస్తారు. సెంటైల్ చార్ట్‌లో బీపీ రీడింగ్ 90, 95, 99 ఇలా ఉంటుంది. 90 ఉంటే బీపీ లేనట్లు. 95 ఉంటే హైపర్‌టెన్షన్ ఉంది అనడానికి సంకేతం. రీడింగ్ 95–99 ఉంటే పిల్లల్లో హైపర్‌టెన్షన్ స్టేజ్–1గా గుర్తించవచ్చు. 99 కంటే ఎక్కువ ఉంటే దాన్ని స్టేజ్–2గా పరిగణించవచ్చు. ఈ తీవ్రతలను బట్టి వారి వయసు, శరీర ఎత్తు, బరువు ఆధారంగా చికిత్సకు ప్రతిపాదిస్తారు.

### ఎన్ని రకాలు?

పిల్లల్లో హైబీపీ రెండు రకాలుగా ఉంటుంది.

**1** ఎసెన్షియల్ హైపర్‌టెన్షన్. దీనినే ప్రైమరీ హైపర్‌టెన్షన్ అని కూడా అంటారు. ప్రైమరీ హైపర్‌టెన్షన్‌కు ఫలానాదే కారణం అని మాత్రం చెప్పలేం. అయితే ఎక్కువగా కనిపించే అధిక బరువు, చైల్డ్‌హుడ్ ఒబెసిటీ వంటివి కారణం అని భావిస్తారు. బాల్యదశ ముగింపులో.. కౌమారదశ ప్రారంభంలో ఎసెన్షియల్ హైపర్‌టెన్షన్ సమస్య అధికంగా ఉంటుంది.

**2** సెకండరీ హైపర్ టెన్షన్. మూత్రపిండాల సమస్యలు, హార్మోన్ల లోపం వంటివి దీనికి కారణం అవుతుంటాయి.

### వైట్‌కోట్ హైపర్‌టెన్షన్

హైపర్‌టెన్షన్‌కు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే అది ప్రాణాంతకంగా మారు ప్రమాదం ఉంది. గుండె వ్యాధులు, మూత్రపిండాల వ్యాధులు, అంధత్వం వంటి సమస్యలు వస్తాయి. కొందరిలో అయితే హైబీపీ విచిత్రంగా కనిపిస్తుంటుంది. హాస్పిటల్‌లో ఉన్నప్పుడు మాత్రమే హైబీపీ కనిపించి.. ఇంటికి వెళ్లగానే తగ్గిపోతుంది. సాధారణ పరిసరాలు.. ఇళ్లు.. ఆటస్థలాల్లో ఉన్నప్పుడు పరిశీలిస్తే వారిలో ఎలాంటి బీపీ లక్షణాలు కనిపించవు. వీరికి ఎలాంటి ప్రమాదం లేకపోయినప్పటికీ జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. చికిత్స అయితే అవసరం లేదు. ఈ రకమైన హైబీపీని 'వైట్ కోట్ హైపర్ టెన్షన్' అంటారు.

### ఎవరికి త్వరగా వస్తుంది?

నెలలు నిండకముందే పుట్టిన పిల్లలకు.. పుట్టినప్పుడు చాలా తక్కువ బరువుతో ఉన్నవారికి హైబీపీ సమస్య త్వరగా వస్తుంది. పుట్టుకతోనే గుండెజబ్బులు ఉన్నవారికి కూడా హైబీపీ ముప్పు ఉన్నట్టే. తరచూ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్‌కు గురవుతున్నారు.. మూత్రపిండాలు, మూత్రసంబంధమైన వ్యాధులు ఉన్నవారికి కూడా బీపీ త్వరగా వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి కుటుంబంలో ఎవరికైనా మూత్రపిండాల వ్యాధి ఉంటే చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే హైబీపీ వంశపారంపర్యంగా వస్తుంది. అందులోనూ మూత్రపిండాల సమస్యలున్నవారైతే త్వరగా వస్తుంది. క్యాన్సర్లు వచ్చిన పిల్లలకు, ఫిట్స్‌తో బాధపడేవాళ్లు, ఎప్పుడూ మగతగా ఉన్నట్లు కనిపించేవాళ్లు, తలనొప్పితో బాధపడేవాళ్లు, కంటిచూపు సమస్యలు ఉన్నవాళ్లకు బీపీ సమస్యలు త్వరగా వస్తున్నాయి. ఇవి దుష్ప్రభావాలకు గురిచేస్తున్నాయి కూడా. ఉదాహరణకు త్వరగా ఉద్వేగానికి గురికావడం.. వేగంగా చిరాకు పడటం.. ఎదుగుదల చాలా తక్కువగా ఉండటం.. తరుచూ వాంతులు అవుతుండటం.. శ్వాస సమస్యలు హైబీపీ ఉన్న పిల్లలను అటాక్ చేస్తాయి.



### దుష్ప్రభావాలేంటి?

హైబీపీతో బాధపడే పిల్లల్లో హైపర్‌టెన్సివ్ ఎన్‌సెఫలోపతి వంటి మెదడుకు సంబంధించిన సమస్యలు కనిపిస్తాయి. ఈ సమస్య వల్ల వాళ్లు మగతగా మారిపోతారు. కొన్నిసార్లు కోమాలోకి కూడా వెళ్తారు. ఫిట్స్ రావడం, మెదడులో రక్తస్రావం, గుండె వైఫల్యం, మూత్రపిండాల వైఫల్యం వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే బీపీ తీవ్రత.. సమయం మీద ఈ దుష్ప్రభావాలు ఆధారపడి ఉంటాయి. హార్ట్ ఫెయిల్యూర్ అనేది ప్రాణానికి ముప్పు కలిగిస్తుంది. తక్కువ సమయంలో ఎక్కువ బీపీ కనిపిస్తున్న పిల్లల కేసులను ఎమర్జెన్సీగా పరిగణించి చికిత్స చేయించాలి.

### జీవనశైలిలో మార్పులు

హైపర్ టెన్షన్ ఉన్న పిల్లలు వారి డాక్టర్ల సూచన మేరకు జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవాలి. శారీరక బరువు అధికంగా ఉంటే తగ్గించుకోవాలి. ఎత్తుకు తగిన బరువు ఉండేలా నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. దీనికోసం వ్యాయామం చేయాలి. ఆటలు ఆడాలి. ఇది భౌతికంగానే కాకుండా మానసికంగా కూడా ఉల్లాసంగా ఉంచుతుంది. కొన్ని వ్యాయామాల వల్ల ఎక్కువ అలసిపోవచ్చు. కాబట్టి నడక, సైక్లింగ్, ఈత వంటివి సహాయపడుతాయి. రోజూ కనీసం 30–60 నిమిషాల పాటు ఈ తరహా శారీరక వ్యాయామాలు చాలా అవసరం.

### ఆహారమూ మార్చాలి

పిల్లలు తినే ఆహారాల్లో ఉప్పు చాలా తక్కువగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. క్యాన్డ్ ఫుడ్, పిజ్జాలు, ఫ్రెంచ్ ఫ్రైస్, సాల్టెడ్ పొటాటో చిప్స్ వంటి జంక్ ఫుడ్ నుంచి పూర్తిగా దూరంగా ఉంచాలి. తాజా ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లు, పొట్టుతీయని ఆహారధాన్యాలతో చేసే వంటలు, కొవ్వు లేని పదార్థాలు ఎక్కువ తినిపించాలి. అతిగా వేయించిన వేపుళ్లు, తీపి మిఠాయిలు చాలా పరిమితంగా పెట్టాలి.

### నివారణ చర్యలు

పిల్లల్లో సెకండరీ హైపర్ టెన్షన్ ఉన్నప్పుడు వారికి ఏ సమస్యను బట్టి హై–బీపీ వచ్చిందో ముందుగా ఆ సమస్యకు తగిన చికిత్స అందించాలి. ఆ మందులతో పాటు పిల్లల్లో హైబీపీ తగ్గించడానికి, ఆ బీపీని నియంత్రణలో ఉంచడానికి కూడా మందులు వాడాల్సి ఉంటుంది. ఒకవేళ పిల్లల్లో హైపర్ టెన్షన్‌కు సంబంధించిన ఎలాంటి దుష్ప్రభావాలూ లేకపోయినా ఆ పిల్లల బరువు మితిమీరి ఉంటే మాత్రం భవిష్యత్తులో వారిలో ఎలాంటి దుష్ప్రభావాలు రాకుండా ముందుగానే నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వారి ఎత్తుకు తగినంతగా మాత్రమే బరువు ఉండేలా వారి బరువు తగ్గేందుకు చర్యలు తీసుకోవాలి. దీన్నే 'స్టెప్–డౌన్' చికిత్సగా పరిగణిస్తారు. ఇలాంటి పిల్లల్లో 8–12 నెలల పాటు వారి ఎత్తుకు తగినంత బరువుకు వచ్చేలా వైద్యనిపుణులు జీవనశైలిలో మార్పులు సూచిస్తారు. ఇలాంటి హై–రిస్క్ ఉన్న పిల్లలందరికీ ప్రతి మూడు నెలలకోసారి బీపీ పరీక్షించడం, ముప్పును బట్టి తగిన కంటి, గుండె, మూత్రపిండాల పరీక్షలు చేయిస్తూ ఉండటం అవసరం. ఇక మందులను కూడా ఇతర అవయవాలపై దుష్ప్రభావాలు పడకుండా ఉండేలా చాలా జాగ్రత్తగా ఎంపిక చేసి వాడటం అవసరం. బీపీ తీవ్రతను బట్టి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఉంటుంది అనేది గుర్తుంచుకోవాలి.

### ఎప్పుడు పరీక్ష చేయించుకోవాలి?

పిల్లల్లో హైబీపీని తెలుసుకోడానికి చాలా జాగ్రత్తగానూ నిశితంగానూ పరీక్షించాల్సి ఉంటుంది. ప్రాథమికంగా వారి ఆహారపు అలవాట్లను పరిగణనలోకి తీసుకోవాలి. పొట్టకు సంబంధించిన ఫిర్యాదులు ఏవైనా చేస్తున్నారా? గమనించాలి. మూత్రపిండాలు, గుండె, థైరాయిడ్ సమస్యలు ఉంటే బీపీని తప్పక పరీక్షించాలి. డయాబెటిస్ ఉన్నా, కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరాయిడ్స్ మోతాదులు ఎక్కువగా ఉన్నా, తక్కువ బరువు ఉన్నా ఆ పిల్లల బీపీని చాలా నిశితంగా పరీక్షిస్తూ ఉండాలి. పిల్లల ఎత్తు, వారి బరువు, వారి బీఎమ్ఐ వంటి అంశాలను పరిశీలించాలి. బీపీని కొలవాల్సిన సందర్భాల్లో బీపీ ఆపరేటస్‌ను చేతులకు మాత్రమే అమర్చడం కాకుండా కాళ్లకు సైతం అమర్చి కొలతలు తీసుకోవాలి. ఈ రెండు రకాల కొలతల్ని పోల్చి చూసుకోవడం చాలా అవసరం. కాళ్ల దగ్గర బీపీ కొలతలు తీసుకునేప్పుడు రెండు కాళ్లకూ కొలతలు తీసుకుంటే మంచిది లేదా కనీసం ఒక కాలికైనా కొలత తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే పిల్లలను భౌతికంగా పరీక్షించే సమయంలో వారు శారీరకంగా ఎంత శ్రమపడుతున్నారు వంటి అంశాలనూ చూడాలి.



డా. వీవీఆర్ సత్య ప్రసాద్
సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ నెఫ్రాలజిస్ట్
రెయిన్ బో చిల్డ్రెన్స్ హాస్పిటల్, హైదరాబాద్



# వెన్నునొప్పికి.. ఫుల్ ఎండోస్కోపిక్ సర్జరీ



**ఒకచోట కుదురుగా కూర్చోలేం. నిమ్మళంగా నిలబడలేం. మాట్లాడాలన్నా చిరాకు. ఆందోళన కలిగించే ఒత్తిడి. ఏంటా సమస్య? ఇంకేంటి? వెన్నునొప్పే! ఎన్ని ప్రయత్నాలు చేసినా నొప్పి తగ్గడం లేదంటున్నారు చాలామంది. మరి పరిష్కారం? ఫుల్ ఎండోస్కోపిక్ సర్జరీయే దీనికి పరిష్కారం.**

వెన్నెముక.. మనిషిని నిటారుగా నిలపడమే కాదు. ఆత్మవిశ్వాసానికి, ఆరోగ్యానికి కూడా ప్రతీక. ఇది స్వయంచోదిత నాడీ మండలంలో భాగం. చాలా కీలకమైంది. అత్యంత సున్నితమైంది కూడా. దృఢమైన వెన్నుపూసలతో నిర్మితమై ఉంటుంది. నాడీ వ్యవస్థలో ఇది ప్రధానమైంది. ఏ చిన్న డిస్టర్బెన్స్ జరిగినా విపరీతమైన బాధకు, ఆవేదనకు గురిచేస్తుంది. కాబట్టి వెన్నెముక సమస్యల పరిష్కారానికి ఆపరేషన్ తప్పనిసరి.

### పూర్తి ఎండోస్కోపిక్ సర్జరీ

వెన్నుకు చేసే శస్త్రచికిత్సల్లో ఎక్కువగా ఓపెన్ సర్జరీలే ఉన్నాయి. దీంట్లో భాగంగా ఆపరేషన్ చేయాల్సిన చోట పెద్దగాటు పెట్టి తెరచి చూస్తూ చేస్తారు. వీటివల్ల నొప్పి తగ్గడమేమోగానీ సున్నితమైన వెన్నుకు నష్టమే ఎక్కువగా జరుగుతుంది. ఇలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సమస్యను పరిష్కరించేందుకు ఉన్న ఏకైక మార్గం ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వెన్ను, మెడ భాగాల్లో అతి చిన్నగాటుతో ఎండోస్కోపిక్ విధానంలో ఆపరేషన్ చేస్తారు. దీంట్లో పెద్దగాటు పెట్టే అవకాశం ఉండదు కాబట్టి వెన్ను చుట్టున్న కండరాలకు నష్టం జరగదు. చాలా కేసుల్లో ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ ద్వారా నొప్పిని కనీస స్థాయికి తగ్గించడమేకాకుండా అత్యంత వేగంగా కోలుకునే అవకాశం ఉంది.

### ఎప్పుడు? ఎలా చేస్తారు?

ఇది సురక్షితమైన అత్యాధునిక శస్త్ర చికిత్స. సాధారణ మందులు, ఫిజియోథెరపీ వంటి సర్జరీయేతర పద్ధతుల ద్వారా వెన్నునొప్పిని తగ్గించడం సాధ్యం కాని సందర్భాల్లో ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ చేస్తారు. దీనికి తోడు వెన్ను నొప్పికి కారణమవుతున్న వెన్ను భాగాన్ని స్పష్టంగా.. ఖచ్చితంగా గుర్తించినపుడు మాత్రమే ఆపరేషన్‌ను ఎంచుకోవాలి. వెన్నుకు నొప్పి నుంచి ఉపశమనం కలిగించడానికి ఈ విధానంలో అనేక ఆధునిక.. నిర్ధారిత ప్రొసీజర్స్ వాడుతున్నారు. డీకంప్రెషన్, స్పైనల్ ఫ్యూజన్ వంటి ప్రొసీజర్లను దీనికి ఉపయోగిస్తారు. ఎముక, హెరినేటెడ్ డిస్క్ వల్ల నాడులపై ఏర్పడే ఒత్తిడిని డీకంప్రెషన్ ద్వారా తొలగిస్తారు. వెన్నులోని చిన్న ఎముకల మూలంగా ఏర్పడే సమస్యలను స్పైనల్ ఫ్యూజన్ విధానంతో పరిష్కరిస్తారు.



### వెన్నులోకి పరికరం

ఫ్యూజన్, డీకంప్రెషన్ వంటి ప్రొసీజర్లను ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ పద్ధతిలో చేయటానికి స్పైన్ ఎండోస్కోపి పరికరాన్ని వాడతారు. ప్రొసీజర్ నిర్వహించాల్సిన ప్రదేశంలో 6–8 మిల్లీ మీటర్ల అతి చిన్న గాటు పెడతారు. అక్కడి నుంచి చర్మం, మృదు కణజాలం గుండా వెన్నును చేరేదాకా ఈ పరికరాన్ని లోపలికి ప్రవేశపెడతారు. దీంతో వెన్నులోని సమస్యాత్మక ప్రదేశం వద్ద ఓ సన్నని కనెక్షన్ తయారవుతుంది. ఇది ప్రొసీజర్ పూర్తయ్యే వరకూ శస్త్రచికిత్స జరిగే ప్రాంతంలోని కండరాలను పక్కకు జరిపి ఉంచుతుంది.

### చికిత్స తర్వాత?

వెన్ను నుంచి తొలగించాల్సిన ఎముక భాగాలు ఓ గొట్టం లాంటి సన్నని కనెక్షన్ ద్వారా బయటకు వస్తాయి. ఫ్యూజన్ ప్రొసీజర్‌లో వాడే స్క్రూలు, రాడ్లను కూడా దీని ద్వారానే లోపలికి తీసుకెళతారు. ప్రొసీజర్, శస్త్రచికిత్స అనంతరం ఎండోస్కోప్‌ను తొలగిస్తారు. దీంతో కండరాలు మళ్లీ తమస్థానానికి జరుగుతాయి. ఇది కండరాలకు జరిగే నష్టాన్ని కనీసస్థాయికి పరిమితం చేస్తుంది. సంప్రదాయ ఓపెన్ సర్జరీతో పోలిస్తే ఈ కండరాల నష్టం చాలా తక్కువగా ఉంటుంది. ఓపెన్ స్పైన్ సర్జరీలో జనరల్ అనస్థీషియా ఇస్తారు. అందువల్ల ఇది పూర్తయ్యే వరకూ పేషెంట్ నిద్రలోనే ఉంటారు. ఎండోస్కోపి ప్రొసీజర్లో రీజినల్ అనస్థీషియా ఇవ్వటం వల్ల పేషంట్ స్పృహలోనే ఉంటాడు. ఈ పద్ధతి 2–3 రోజుల్లో పూర్తవుతుంది కాబట్టి ఆపరేషన్ తర్వాత పేషెంట్ ఇంటికి చేరుకోవచ్చు.

### జాగ్రత్తలేంటి?

ఫ్యూజన్ ప్రొసీజర్ చేయించుకున్న తర్వాత ఎముక గట్టి పడేందుకు కొని నెలల సమయం పడుతుంది. కానీ ఈ లోపే నొప్పి నుంచి విముక్తికలిగి పరిస్థితి మెరుగుపడుతుంది. కోలుకునే సమయంలో పేషెంట్ కదలికలు ఏవిధంగా ఉండాలి? కూర్చోవటం.. నిలబడటం.. నడవటంలో పాటించాల్సిన జాగ్రత్తలను డాక్టర్ సూచిస్తారు. వాటిని తప్పకుండా పాటించాలి. ఒక వ్యక్తి ఎంత వేగంగా సాధారణ ఆరోగ్య పరిస్థితికి చేరుకోగలరు అన్నది చేయించుకున్న ప్రొసీజర్, శస్త్రచికిత్స తీవ్రత, ఆ వ్యక్తి సాధారణ ఆరోగ్య స్థితిపై ఆధారపడి ఉంటుంది. శస్త్రచికిత్స, ప్రొసీజర్ తర్వాత కోలుకొని తిరిగి బలం పుంజుకునేందుకు డాక్టర్ ఫిజియోథెరపీ సూచించే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎలాంటి భయాలు, ఆందోళనలు పెట్టుకోకుండా ఫుల్ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీ చేయించుకుంటే మీ వెన్ను భద్రంగా ఉంటుంది.

డాక్టర్ సుకుమార్ సూర
సీనియర్ స్పైన్ & న్యూరో సర్జన్
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ, హైదరాబాద్



# చక్కెర పానీయాలతో క్యాన్సర్



**చక్కెర ఆరోగ్యానికి చేటు చేస్తుంది.. మధుమేహాన్ని తీవ్రతరం చేస్తుందని తెలుసు కదా? అంతేకాదు.. చక్కెర పానీయాలతో క్యాన్సర్ రిస్క్ పెరుగుతుందని తాజా అధ్యయనాలు చెప్తున్నాయి.**

చక్కెర పానీయాల వల్ల మధుమేహంతో పాటు ఒబెసిటీ పెరిగి క్రమంగా క్యాన్సర్‌కు దారి తీస్తుందంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ ప్యారిస్ పరిశోధకులు. 100% ఫ్రూట్ జ్యూస్ కలిసి చేసిన చక్కెర పానీయాలు, కృత్రిమంగా తయారైన తీపి పానీయాలను ఒకేసారి పరిశీలించారు. చక్కెర పానీయాల ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్, బొయెల్ క్యాన్సర్‌లు వచ్చే ప్రమాదం ఉందని చెప్తున్నారు. ఈ అధ్యయనం కోసం 40 సంవత్సరాలు పైబడిన 101,257 మంది ఆరోగ్యవంతులను పరిశీలించారు. వీరిలో 21% పురుషులను, 79% మహిళలను తీసుకున్నారు. వీరికి 3,300 భిన్నమైన పానీయాలను, ఆహారాలను ఇవ్వగా వాటిలో చక్కెర పానీయాలే డేంజర్ అని తేలింది.

# అమ్మో.. అల్జీమర్స్!



**వయసు పైబడిన వారిని వేధించే సమస్య అయిన అల్జీమర్స్ ఎన్నో దుష్ప్రభావాలకు కారణం అవుతుందట. అతి ప్రమాదకరమైన ప్రొస్టేట్ క్యాన్సర్ వంటి వ్యాధులకు గురిచేస్తుంది.**

వయసులో ఉండగా ఎంతో మేధస్సు కలిగినా.. అదంతా మర్చిపోయి మనుషులతో ఏమాత్రం సంబంధం లేదన్నట్టుగా మార్చేసే వ్యాధి అల్జీమర్స్. దీనిని ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా నష్టం తప్పదని అంటున్నది అమెరికన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ ఆంకాలజీ. వయసు పైబడిన 154000 మంది పేషెంట్లపై ఈ సంస్థ ప్రతినిధులు అధ్యయనం చేశారు. వయసు పైబడుతున్న కొద్దీ వీరిలో అల్జీమర్స్ లక్షణాలు వృద్ధి చెందుతున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. అల్జీమర్స్ క్రమంగా ప్రొస్టేట్ క్యాన్సర్‌గా మారి విరామ దశలో ఉన్న వృద్ధులను విచక్షణా రహితంగా వేధిస్తుందని చెప్తున్నారు.

## సుడోకు

**డైలీ సుడోకు 92 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 7 | 6 | 9 | 5 | 1 | 8 | 3 | 4 |
| 4 | 3 | 9 | 2 | 8 | 6 | 5 | 1 | 7 |
| 5 | 1 | 8 | 3 | 4 | 7 | 9 | 6 | 2 |
| 7 | 6 | 4 | 5 | 9 | 8 | 1 | 2 | 3 |
| 9 | 5 | 3 | 4 | 1 | 2 | 6 | 7 | 8 |
| 8 | 2 | 1 | 7 | 6 | 3 | 4 | 9 | 5 |
| 1 | 9 | 2 | 8 | 3 | 4 | 7 | 5 | 6 |
| 3 | 4 | 5 | 6 | 7 | 9 | 2 | 8 | 1 |
| 6 | 8 | 7 | 1 | 2 | 5 | 3 | 4 | 9 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు -93**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 4 | | | 9 | | 5 | | |
| 3 | | | | | | | 4 | 2 |
| | 8 | 1 | | 4 | | | | |
| | 9 | | 7 | | | | | 5 |
| 8 | | | 2 | | 6 | | | 4 |
| 1 | | | | | 9 | | 7 | |
| | | | | 2 | | 4 | 8 | |
| 7 | 2 | | | | | | | 6 |
| | | 3 | | 6 | | | 1 | |

## ట్వీట్

స్వాతిలక్రా
@IGWomenSafety



ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి. పర్యావరణాన్ని కాపాడండి. రేపటి తరం కోసం మనమంతా 'ఎవరికి వారుగా ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం అని నినదించండి!

స్వాతిలక్రాను ట్విట్టర్లో ఫాలో అవుతున్నవారి సంఖ్య
4,23,067

## కామన్‌మ్యాన్ వాయిస్

బీజేపీ ఇక్కడ టీడీపీని మింగుతుందనే సంబురం ఒకవైపు. దేశ దోపిడీదారులను చేర్చుకుంటుంది అనే బాధ ఇంకోవైపు. ఏం జరుగుతుందో?
– Karunakar Deshayi Kethireddy

నిజానికి క్రికెట్ వరల్డ్ కప్ విజేతలుగా ఇంగ్లండ్‌తో పాటు న్యూజిలాండ్‌ను కూడా ప్రకటించాల్సింది!
– Venu Bekkam

ఒకరిని ఇంప్రెస్ చేయడానికో.. ఇరిటేట్ చేయడానికో జీవించడం కాదు. నీ జీవితం నీది. నీలా నువ్వు జీవించు. ఎవరినో అనుకరించాల్సిన అవసరం ఉండదు!
– Sandhya Reddy

## వైరల్ వీడియో




హృతిక్ రోషన్, టైగర్‌ష్రాఫ్ కలిసి యుద్ధం ప్రకటించారు. ఒకరి కొకరు నువ్వా? నేనా? అని తలపడేందుకు సిద్ధమయ్యారు. వార్ సినిమాతో అక్టోబర్‌లో తెరపై మెరువనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన అఫీషియల్ టీజర్ ఇప్పుడు యూట్యూబ్ ట్రెండింగ్‌లో టాప్‌లో ఉంది.


War | Official Teaser | Hrithik Roshan | Tiger Shroff | Vaani Kapoor | Releasing 2 Oct
Total views : 5,577,558+
Published on Jul 14, 2019

నమస్తే తెలంగాణ
# శాస్త్ర
[ కరీంనగర్ ]
మంగళవారం 16 జూలై 2019

పర్యావరణం

## అడవులతో భూతాపం ఆటకట్టు

**ప్రపంచవ్యాప్తంగా పెద్ద మొత్తంలో అడవుల పెంపకం ద్వారా భూతాపాన్ని గణనీయంగా తగ్గించవచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఆధునాతన సాంకేతికతలకంటే కూడా ఇదెంతో చౌకని కూడా వారు సూచించారు.**




కారణాలేవైతేనేం, ఒకవైపు అడవుల వినాశనం నేపథ్యంలో తిరిగి వాటిని అత్యధిక విస్తీర్ణంలో పెంచడం ద్వారా (Massive Forest Restoration) భూమిపై పెరుగుతున్న అధిక ఉష్ణోగ్రతలను దీర్ఘకాలంలో అంతేస్థాయి మేర తగ్గించగలమని శాస్త్రవేత్తలు అంచనా వేశారు. సరైన మొక్కల (చెట్ల)ను, సరైన ప్రాంతం (సారవంతమైన నేలలు)లో నాటాలని, అంతర్జాతీయంగా సుమారు 0.9 బిలియన్ హెక్టార్ల మేర చెట్లను పెంచగలిగితే రాబోయే 40-100 ఏండ్లలో అవి బాగా ఎదిగి, కనీసం 205 గిగాటన్నుల బొగ్గు పులుసు వాయువు (కార్బన్ డయాక్సైడ్)ను నిలువ చేసుకోగలవని వారు తెలిపారు. అలా వాతావరణంలోని మూడింట రెండు వంతుల మేర ఆ వాయువును తగ్గించుకున్న వాళ్లమవుతామని వారన్నారు. స్విట్జర్లాండ్ సిటీ జ్యూరిచ్‌లోని 'స్విస్ ఫెడరల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'కి చెందిన 'గ్లోబల్ ఎకోసిస్టమ్ ఎకాలజీ' ప్రొఫెసర్ టామ్ క్రౌథర్ (Tom Crowther) ఆధ్వర్యంలోని పరిశోధకుల బృందం జరిపిన అధ్యయనంలో ఈ విషయం తేలింది. కార్బన్ డయాక్సయిడ్‌ను తగ్గించడానికి శాస్త్రవేత్తలు ప్రతిపాదిస్తున్న వివిధ సాంకేతికతలన్నీ ఎంతో వ్యయంతో కూడినవని, వాటన్నింటికన్నా ఈ మొక్కల పెంపకం చాలా చౌక అని వారు తెలిపారు.

విశ్వదర్శనం

## టైటానిక్ కాలబిలాలు

**సుమారు 2.5 బిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో మహా (టైటానిక్) కాలబిలాల జత నొకదానిని శాస్త్రవేత్తలు కని పెట్టారు. గురుత్వాకర్షణ తరంగాల శబ్దాలు, వాటిచుట్టూ అల్లుకొన్న నక్షత్ర సమూహాల కాంతిద్వారా వీటిని గుర్తించారు.**



విశ్వంలోనే అత్యంత అధికకాంతిని కలిగి ఉన్నట్టుగా భావిస్తున్న భారీ నక్షత్ర మండలంలో ఇటీవల వెలుగుచూసిన మహా కాలబిలాల జతను ఒకదానిని శాస్త్రవేత్తలు హబుల్ టెలిస్కోప్ అందించిన ఛాయాచిత్రాల ఆధారంగా కనిపెట్టారు. భూమికి సుమారు 250 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలోని వీటిని 'టైటానిక్ బ్లాక్‌హోల్స్' (కాలబిలాలు)గా వారు వ్యవహరిస్తున్నారు. ఇందులోని ఒక్కో భారీ కాలబిలం మన సూర్యునికన్నా సుమారు 800 మిలియన్ రెట్లు అధిక ద్రవ్యరాశిని కలిగి ఉన్నట్టు చెబుతున్నారు. ఇవి రెండూ మెల్లమెల్లగా ఒకదాని కొకటి విలీనమవుతున్నాయి. ఇలా రెండు కాలబిలాలు పూర్తిగా విలీనమయ్యే దృశ్యం రోదసిలో ఇప్పటి వరకైతే శాస్త్రవేత్తల దృష్టికి రాలేదు. ఈ కాలబిలాల జతనుంచి విడుదలవుతున్న గురుత్వాకర్షణ తరంగాల శబ్దాలు, వాటి చుట్టూ వున్న నక్షత్రాల సమూహాలు విడుదల చేసే కాంతి ఆధారంగా వీటిని గుర్తించారు. ప్రిన్సెటోన్ యూనివర్సిటీ, యుఎస్ నావల్ రీసర్చి లేబొరేటరీ పరిశోధకులు సంయుక్తంగా జరిపిన ఈ అధ్యయనం 'అస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమైంది.



ప్రకృతి పాఠాలు

# రక్షణ రహస్యాలు!

**ప్రకృతి వైపరీత్యాలు రాబోతున్న సంగతిని కొన్ని జంతువులు కొంత సమయానికి ముందే గ్రహించేస్తాయి. అదెలా? వైజ్ఞానిక శాస్త్ర, సాంకేతిక పరంగా ఎన్ని ఆవిష్కరణలు జరుగుతున్నా మానవునికి మాత్రం ఇది సాధ్యపడడం లేదు. చెప్పా పెట్టకుండా, అకస్మాత్తుగా వచ్చి పడే అసాధారణ విపత్తుల మూలంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు ఆర్థిక, ప్రాణనష్టాలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలోనే శాస్త్రవేత్తలు పైన పేర్కొన్న కొన్ని జంతువుల ఇంద్రియజ్ఞానాల రహస్యాల శోధనకు నడుం బిగించారు. ఆవిష్కృతమైన సాంకేతికతల ఆధారంగా ఒకపక్క పలు కొత్త పరిశోధనలకు శ్రీకారం చుడుతూనే, మరోపక్క ఆ నైపుణ్యాన్ని మేళవించుకొనే వినూత్న పరికరాలనూ రూపొందిస్తున్నారు.**

**ముఖ్యంగా** భూకంపాలు, సునామీలు వంటి తీవ్ర విపత్తుల రాకను ముందుగానే పసికట్టే కొన్ని జంతువులలోని అద్భుత ఇంద్రియ సామర్థ్యాలు శాస్త్రవేత్తలను ఆశ్చర్యపరుస్తున్నాయి. సహజసిద్ధమైన వాటి నైపుణ్యాలు అనుభవంలోకి వస్తున్న సందర్భాలూ తరచూ కనిపిస్తున్నాయి. నిత్యజీవితంలో పలు పెంపుడు జంతువులు ప్రదర్శించే 'తెలివితేటలు' అయితే చాలామందికి తెలిసినవే. ఇదే పద్ధతిలో అడవుల్లోని కొన్ని జంతువులు ఎంతో దూరంలో వున్న తోటి జంతువులకు తమ ఉనికిని పలు సంకేతాల ద్వారా తెలియజేస్తుంటాయని శాస్త్రజ్ఞులు గుర్తించారు. జంతువులు అతితక్కువ పౌన:పున్యం గల శబ్దతరంగాల ద్వారా తమ భావాలను తెలియపరుస్తాయని వారు అంటున్నారు.

ఏనుగులు, జిరాఫీలు, డాల్ఫిన్లు, హిప్పోలు (నీటి ఏనుగు లేదా నీటి గుర్రాలు) వంటి పెద్ద జంతువులు తమలోని భావాలను తెలియపరిచే విధానాలను పరిశోధకులు అధ్యయనం చేశారు. మృగరాజులు (సింహాలు) పరశ్రవ్య (ఎదుటి జంతువులకు చెందినవి) శబ్ద తరంగాలను చాలా తేలిగ్గా గుర్తిస్తాయని వారు అంటున్నారు. ఏనుగులు కొన్ని కిలోమీటర్ల దూరం నుంచే నీటిజాడలను పసిగట్టగలవు. తిమింగలాలు సృష్టించే తరంగాలు సుమారు 20 హెర్జ్ (Hertz) లకన్నా తక్కువలో ఉంటాయి. కొన్ని పక్షులు, చేపలు 40 హెర్జ్‌ల పౌన:పున్యానికే సునిశితంగా ఉత్తేజితమై, భూకంపాల్ని గుర్తించగలుగుతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. క్రీ.పూ. 200 సంవత్సరాల నుంచే జంతుజాలం భూకంపాల ఉనికిని పసికట్టేస్తూ, ఆ మేరకు ప్రాణాపాయం నుంచి తప్పించుకొంటున్నట్టు చరిత్ర చెబుతున్నది.

ప్రకృతి విపత్తులు జరుగబోయే ముందు పశుపక్ష్యాదుల వింత ప్రవర్తనలను వారు అధ్యయనం చేయగా పలు ఆసక్తికరమైన అంశాలు వెల్లడైనాయి. సముద్రంలో సునామీ సంభవించినపుడు (ఉదా॥కు 2004లో) ఏనుగులు ఎత్తయిన ప్రాంతాలకు పరుగెత్తడం వారు గమనించారు. శ్రీలంక, థాయ్‌లాండ్‌లలో ఈ సంఘటనలు చోటు చేసుకొన్నాయి. 1988 డిసెంబర్‌లో లెనిన్‌కన్ అనే ప్రాంతంలో కర్మాగారంలో ఎలుకలు కలుగుల్లోంచి వీధుల్లోకి బారులు తీరినట్లుగా పరుగెత్తాయి. 1975లో చైనాలోని ఒకానొక చోట అనేక పాములు బొరియల్లోంచి మైదానాలలోకి పారిపోయాయి. ఈ సంఘటనలు జరిగిన కొద్ది సమయానికే ఆయా ప్రాంతంలో భూకంపాలు సంభవించడాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు.

### కొత్త పరికరాలకు శ్రీకారం!



జంతువులలోని విశేష సామర్థ్యాల్ని పోలిన పరికరాల సృష్టికి శాస్త్రవేత్తలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిలో ఒకటే సోనార్ టెక్నాలజీ. ఇలాంటివే మరిన్ని అందుబాటులోకి రావాల్సి వున్నది. సముద్రం లోతుల్లో ప్రయాణించే సబ్ మెరైన్‌లు ఎంత దూరంలో ఉన్నాయో తెలుసుకొనేందుకు 'సోనార్' సాంకేతికత ఉపయోగపడుతున్నది. అక్కడి శబ్ద పౌన: పున్యాలను మన చెవులు వినలేవు. మానవ చెవికి సుమారు ఒక సెకనుకు 16,000 సైకిల్స్‌ను కలిగి ఉన్న శబ్దాలనే గుర్తించే శక్తి ఉంది. ఇటీవల హిరాయిట్-వాట్ (Heriot-Watt) విశ్వవిద్యాలయం, ఓషియన్ సిస్టమ్స్ లేబరేటరీ వారు సముద్రంలోని వస్తువులను గుర్తించగలిగే సాంకేతిక పరికరాలను తయారు చేశారు. బాటిల్ నోస్ డాల్ఫిన్‌లకు ఈ నైపుణ్యం ఉంటుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. డాల్ఫిన్లను 'ఎకోలొకేషన్ బయోసోనార్'గా శాస్త్రజ్ఞులు అభివర్ణిస్తారు. డాల్ఫిన్ మెదడులోని మెలోన్ (melon) అనే అవయవానికి ఈ శబ్ద తరంగాలను గుర్తించే శక్తి ఉంటుంది. డాల్ఫిన్ల కింది దవడలోని ఎముకలకు శబ్ద తరంగాలను గ్రహించగలిగే సామర్థ్యమూ ఉంటుందని వారంటున్నారు.

వాతావరణంలో, భూమిలో, సముద్రంలో సంభవించే పరివర్తనలను పశుపక్ష్యాదులు చాలా స్పష్టంగా గుర్తించగలవని శాస్త్రవేత్తలకు బోధపడింది. శ్రీలంకలో 3 కిలోమీటర్లు సునామీ అలలు ప్రయాణించినా, ఒక్క జంతువు కూడా చనిపోలేదు. భూకంప తరంగాలలో పి, యస్ తరంగాలు ఉంటాయి. యస్ తరంగాల వేగం పి తరంగాల వేగంలో సగమే ఉంటుంది. భూమిలో సంభవించే చిన్న కంపనాలను కూడా జంతువులు తేలిగ్గా గుర్తించేస్తాయని వారంటున్నారు. వాతావరణంలో సంభవించే సునిశితమైన మార్పులకు అనుగుణంగా పలు జంతువులు రక్షణచర్యలకు ఉపక్రమిస్తాయని నిర్ధారణైంది.

సముద్రంలో సునామీలు అతితీవ్ర అలజడిని సృష్టిస్తాయి. పర్యవసానంగా నీటి అలలు కొన్ని మీటర్ల ఎత్తుకు ఎగిసి పడుతుంటాయి. 6,000 మీటర్ల లోతుల్లోంచి (సముద్రగర్భంలో) కలిగే ఒత్తిడివల్ల కూడా కొన్ని ప్రకంపనలు ఉపరితలంపైకి వస్తాయి. అప్పుడు కూడా అలలు ఎన్నో మీటర్ల ఎత్తుకు ఎగుస్తాయి. వీటిని శాటిలైట్లు (కృత్రిమ ఉపగ్రహాలు) గుర్తించి, ఈ మేరకు దత్తాంశాల (డేటా)ను పరిశోధకులకు అందించగలగాలి. కానీ, ఇప్పుడు ఇది సాధ్యం కావడం లేదు.

శబ్ద తరంగాలు సముద్రంలో ఎక్కువ దూరం ప్రయాణిస్తాయి. అదే సముద్రంలోని డాల్ఫిన్లు అతి సూక్ష్మ స్థాయి ధ్వని తరంగాలను సృష్టిస్తాయి. ఇవి 20 నుండి 120 హెర్జ్‌ల పౌన: పున్యాల్ని కలిగి ఉంటాయి. ఇవి ఏ వస్తువునైనా, నీటి జంతువునైనా తాకగానే ప్రతిధ్వనులను పుట్టిస్తాయి. ఈ విషయంలో డాల్ఫిన్లకు వర్ణించలేని నైపుణ్యం ఉన్నట్టు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సుమారు 25 కిలోమీటర్ల దూరంలోంచి వెలువడే శబ్ద తరంగాలను అవి తేలిగ్గా గుర్తించగలుగుతున్నట్టు తేలింది. సోనార్ (Sonar) లాగా పనిచేసే అతిసూక్ష్మ అవయవాలు డాల్ఫిన్ తల దగ్గర ఉంటాయని శాస్త్రవేత్తలు అంటున్నారు. వీటిద్వారా అవి ధ్వని సంకేతాలను పసికట్టగలుగుతున్నట్టు కనుగొన్నారు.

జంతుజాలంలోని ఈ అద్భుత ఇంద్రియ శక్తుల్ని అనుకరిస్తూ 'ఎవోలాజిక్' అనే కంపెనీ కొన్ని పరికరాలను రూపొందించింది. వీటిని ఇప్పటికే 'ఇండియన్ ఓషియన్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్' వారు ఉపయోగిస్తున్నారు. సముద్రంలో సంభవించే సు నామీల ప్రకంపనలను కొంత ముందుగానే పసికట్టి, ఆ దత్తాంశాలను ఇవి మనకు అందిస్తాయని చెబుతున్నారు. నిజానికి సునామీ ప్రకృతిలో సం భవించే మహావిపత్తు. దీనినే కాదు, ఏ ప్రకృతి విపత్తునూ నియంత్రించడం మన చేతుల్లో ఉండదు. సముద్రంలో సునామీ అలలవల్ల కలిగే ప్రళయ వినాశనాన్ని గుర్తించడానికి సునిశితమైన ప్రెషర్ సెన్సర్లు మనకు అత్యవసరం. ఈ తరహా పరిశోధనలు వేగం పుంజుకోగలిగితే బావుంటుంది.

-డా॥ రాజూరు రామకృష్ణారెడ్డి
సెల్: 94404 32464

పృథ్వీశాస్త్రం

## 250 కోట్ల ఏండ్లుగా భూగర్భ లీకేజీ

**భూగర్భ పదార్థం గత 250 కోట్ల ఏండ్లుగా భూమ్యావరణంలోకి ప్రవేశిస్తున్నట్టు శాస్త్రజ్ఞులు తెలిపారు. అతిప్రాచీనమైన 'టంగ్‌స్టన్ ఐసోటోప్స్'లోని మార్పుల్నిబట్టి వారు ఈ నిర్ధారణకు వచ్చారు.**



**భూమి** కేంద్రంలోని పదార్థం భూమ్యావరణ అడుగునుంచి అగ్ని పర్వత చర్యల ద్వారా ఉపరితలంపైకి చేరుతున్న క్రమంలో భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు అధ్యయనాలు జరపగా, పై కీలకాంశం వెల్లడైంది. గత కొన్ని దశాబ్దాలుగా అంతుబట్టని భూగర్భ లేదా అంతర్భాగ (Core) స్థితిగతులను అంచనా వేయడానికి టంగ్‌స్టన్ (ప్రత్యేకించి స్టీలు, లైట్ బల్బుల ఫిలమెంట్ల తయారీలో ఉపయోగించే అత్యంత దృఢమైన లోహానికి చెందిన ఒక రసాయనిక మూలకం) సమస్థానీయాల (Isotopes: రసాయన మూలక రూపాలు) లో ఆయా కాలాలలో సంభవించిన అతిచిన్న పరివర్తనలను వారు ఇటీవల అధ్యయనం చేశారు. ఈ నేపథ్యంలో భూమి హృదయ కుహరంలోంచి పదార్థ ఉరుపు (Leakage) గత 2.5 బిలియన్ (250 కోట్ల) సంవత్సరాలుగా జరుగుతున్నట్టు వారు గుర్తించారు. అగ్ని పర్వతాల్లోని దాదాపు 50 శాతం వేడిమి భూమి అంతర్భాగం నుండే వస్తున్నదని, ఆవరణం (Mantle) అట్టడుగునుంచి వస్తున్న పొగలు, సెగలు అక్కడివేనని వారంటున్నారు.

అంతరిక్షంతోపాటు సూర్యునినుంచి కూడా వెలువడే అత్యధిక ప్రమాదకారక శక్తికణాల నుంచి నివాసయోగ్యమైన మన భూమండలం ఇంత సురక్షితంగా ఉంటున్నదంటే దానికి కారణం భూమి అయస్కాంత క్షేత్రమే (Earth's magnetic field) నని మనకు తెలుసు. దీనికి అసలు మూలం భూమి అంతర్భాగం. ఇది ఉపరితలం నుంచి సుమారు 2,890 కి.మీ. అడుగున మొదలై, మరో 2,260 కి.మీ. మందంతో మొత్తం దాదాపు 5000 కి.మీ. మేర (బాహ్య-అంతర పొరల మధ్య దూరం) విస్తరించి వున్నట్టు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అక్కడి కనీస ఉష్ణోగ్రత 5,000 డిగ్రీల సెల్సియస్‌కు మించి ఉన్నట్టు అంచనా. దీని ప్రత్యక్ష అధ్యయనం శాస్త్రవేత్తలకు నమూనాకైనా అందడం లేదు. అయితే, పరోక్ష పద్ధతిలో, అంటే భూమ్యావరణం అడుగునుంచి అగ్నిపర్వతాల లావాద్వారా ఉపరితలంపైకి వచ్చే పదార్థ పరిశోధనే దీనికి మూలాధారం. అంతర్భాగంలోని పదార్థంలో ప్రధానంగా ఇనుము, నికెల్‌తోసహా టంగ్‌స్టన్, ప్లాటినమ్, బంగారం వంటివి కూడా ముఖ్య లోహాలతో కలిసిపోయి ఉంటాయని వారంటున్నారు. ప్రత్యేకించి టంగ్‌స్టన్ పదార్థ రూపాలలో సంభవిస్తున్న కాలానుగుణ మార్పుల ఆధారంగా జరిగిన అధ్యయనం పై విషయాన్ని వెల్లడించింది.

ఇటీవలి 'జియోకెమికల్ పర్స్పెక్టివ్ లెటర్స్' (Geochemical Perspective Letters) లో ప్రచురితమైన ఈ పరిశోధనా ఫలితాలు సదరు లీకేజీ కాలాన్ని నిర్ధారించాయి. అతిప్రాచీన, ఆధునిక కాలాలకు చెందిన టంగ్‌స్టన్ ఐసోటోప్‌ల నిష్పత్తుల్లోని పరివర్తనల ద్వారా గత చాలాకాలంగా అంతరంగ పదార్థం ఆవరణంలోకి చేరుతున్నట్లు దీనిద్వారా స్పష్టమైంది. సుమారు 430 నుంచి 270 కోట్ల ఏండ్ల క్రితమే ఈ పదార్థ బదిలీ మొదలైనా, 250 కోట్ల ఏండ్ల కిందట ఇది పెద్ద ఎత్తున ప్రవహించినట్టు వారు చెబుతున్నారు. ఈ మేరకు తగిన శాస్త్రీయ ఆధారాలను వారు కనుగొన్నారు.


పనితనం

## నిలువెత్తు జిహ్వాశక్తి



నిలువెల్లా రసగుణ శక్తిని కలిగివున్న అద్భుత బాహ్యాంతర శరీరావయవం నాలుక. రసేంద్రియంగా దీని గొప్పతనం ప్రతి ఒక్కరికీ అనుభవమే. 'జిహ్వ చాపల్యం' అన్న మాటనుబట్టి దీని విస్తృత పనితనాన్ని, సామర్థ్యాన్ని ఊహించుకోవచ్చు. చూడడానికి చాలా సాధారణంగా కనిపించినా దేహానికి అవసరమయ్యే అత్యంతావశ్యకమైన పనులను ఇదే నిర్వర్తిస్తుంది. తనను తాకిన ప్రతీ పదార్థ రుచిని ఠక్కున మెదడుకు చేరవేసే శక్తి దీని సొంతం. వాసన చూడడం, నోట్లో ఘనాహారాన్ని నమలడానికి సహకరించడం వంటి పనులతోపాటు ఊపిరి పీల్చుకోవడం, మాట్లాడడం, ఆఖరకు ముద్దు పెట్టుకోవడం వంటి అనేక నోటి సంబంధ పనులలో దీని పాత్ర కీలకం. సుమారు 3-4 అంగుళాల పొడవున వుండే నాలుక నిర్మాణమంతా పదార్థాల రుచిని కనిపెట్టే లక్షణంతోనే ఉంటుంది. ఇది ఆసాంతం కండర అవయవం. అస్థిపంజర కండర కణజాలంతో రూపొంది ఉంటుంది కాబట్టే, మిగిలిన (జీర్ణక్రియ, గుండెవంటి మృదువైన) కణజాలానికి భిన్నంగా నియంత్రణకు లోబడి ఉంటుంది. కాబట్టే, నోటిలో తేలిగ్గా కదలగలుగుతుంది. వేడి, చల్లదనం, పీడనం వంటి గుణాల్ని వెంటనే పట్టేస్తుంది. నాలుకమీది గ్రంథులు, రుచి మొగ్గలు (taste buds) విడుదల చేసే స్రావాలవల్లే వివిధ రుచులు నాడీకణాల ద్వారా మెదడుకు చేరుతాయి.

ఎవరేమన్నారు?



ఎక్కడైతే విజన్ (vision) ఉండదో అక్కడ విశ్వాసమూ ఉండదు!

**- జార్జ్ వాషింగ్టన్ కార్వర్**
**ఆఫ్రికన్-అమెరికన్ వృక్షశాస్త్రవేత్త,**
**జీవితకాలం:** 1860-1943,
**జయంతి:** జూలై 12

## పిండి పదార్థాలే కొండంత అండ

ఆహారశాస్త్రం



మనం తినే చాలావరకు ఆహార పదార్థాలలో ఎంతోకొంత మేర పిండి పదార్థాలు (Carbohydrates) ఉంటాయి. రోజువారీ ఆహారంలో ఈ పోషకాల మోతాదే చాలా ఎక్కువ. బియ్యం, గోధుమలు, పండ్లు, పాల ఉత్పత్తులు, ఆలుగడ్డలు వంటి కూరగాయలు, తేనె వంటి తీపిపదార్థాలు వంటివాటిల్లో పిండి (గంజి) పదార్థాలు వుంటాయి. ఇవి పుష్కలంగా లభించినప్పుడు దేహానికి కొండంత అండ. ఐస్‌క్రీములు, శీతల పానీయాలు, తేనీరు, కాఫీ వంటి వాటిలోనూ చక్కెర రూపంలో ఇవి ఉంటాయి. ముఖ్యంగా గంజిపొడి (starch) వంటి కొన్ని సంక్లిష్ట పదార్థాలలోని పిండి పదార్థాలనూ మనం కష్టం మీద జీర్ణం చేసుకోవలసి ఉంటుంది. చక్కెర వంటి మరికొన్నింటిలో కార్బోహైడ్రేట్స్ లభించడమేకాక అవి చాలా తేలిగ్గా జీర్ణమవుతాయి. సులభంగా జీర్ణమయ్యేవిగా చక్కెరలోని పిండిపదార్థాలకు పేరుంది. ఇవి శరీరానికి శక్తినివ్వడమేకాక ఇతర పోషకాలతో కలిసి శక్తి ఉత్పాదనలో తమ వంతు పాత్రనూ నిర్వర్తిస్తాయి.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## బెల్‌లో అప్రెంటిస్‌లు

**ఘజియాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) ట్రేడ్ అప్రెంటిస్‌ల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**

- **కోర్సు:** ట్రేడ్ అప్రెంటిస్
- **మొత్తం ఖాళీలు:** 100
- **విభాగాల వారీగా ఖాళీలు:** మెకానికల్-29, కంప్యూటర్ సైన్స్-15, మోడ్రన్ ఆఫీస్ మేనేజ్‌మెంట్ & సెక్రటేరియల్ ప్రాక్టీస్-10, ఎలక్ట్రానిక్స్-32, ఎలక్ట్రికల్-8, సివిల్-6
- **అర్హతలు:** సంబంధిత ఇంజినీరింగ్ విభాగాల్లో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత.
- **వయస్సు:** 2019 జూన్ 30 నాటికి 28 ఏండ్లు మించరాదు.
- **స్టయిఫండ్:** నెలకు రూ. 10,400/-
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 21
- **వెబ్‌సైట్:** www.mhrdnats.gov.in

## అగ్రికల్చర్‌వర్సిటీలో ప్రవేశాలు

**రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ 2019-20 విద్యా సంవత్సరానికి వివిధ పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- ఎమ్మెస్సీ (అగ్రికల్చర్)-95 సీట్లు (రాజేంద్రనగర్‌లో 84, జగిత్యాల క్యాంపస్‌లో 11)
- **విభాగాలు:** క్రాప్ ఫిజియాలజీ, జెనెటిక్స్ & ప్లాంట్ బ్రీడింగ్, ప్లాంట్ పాథాలజీ, మైక్రోబయాలజీ, సీడ్ సైన్స్ & టెక్నాలజీ, సాయిల్ సైన్స్, ఎంటమాలజీ, ఆగ్రానమీ, ఆగ్రానమీ (వాటర్ మేనేజ్‌మెంట్), అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్
- **అర్హత:** నాలుగేండ్ల బీఎస్సీ (అగ్రికల్చర్), బీఎస్సీ (సీఏ & బీఎం)/బీఎస్సీ (అగ్రికల్చర్) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- ఎమ్మెస్సీ (హోమ్ సైన్స్)-17 సీట్లు (హోమ్ సైన్స్ కాలేజ్, సైఫాబాద్ క్యాంపస్‌లో)
- **విభాగాలు:** ఫుడ్స్ & న్యూట్రిషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ & ఫ్యామిలీ స్టడీస్, ఫ్యామిలీ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హోం సైన్స్ ఎక్స్‌టెన్షన్ & కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్
- **అర్హత:** నాలుగేండ్ల బీఎస్సీ (హోమ్ సైన్స్) బీహెచ్‌ఎస్సీ (రూరల్), బీహెచ్‌ఎస్సీ/బీఎస్సీ (ఆనర్స్) హోమ్ సైన్స్, బీఎస్సీ (ఆనర్స్) ఫుడ్ సైన్స్ & న్యూట్రిషన్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- ఎంబీఏ (అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్)-18 సీట్లు (రాజేంద్రనగర్ క్యాంపస్‌లో)
- **అర్హత:** నాలుగేండ్ల బీఎస్సీ (అగ్రికల్చర్/హార్టికల్చర్), బీఎస్సీ (సీఏ & బీఎం), బీటెక్ (అగ్రికల్చర్ ఇంజినీరింగ్), బీవీఎస్సీ & ఏహెచ్, బీఎఫ్ఎస్సీ, బీహెచ్ఎస్సీ(రూరల్), బీఎస్సీ (హెచ్ఎస్సీ), బీటెక్ (డెయిరింగ్)/ బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బీఎస్సీ (ఫుడ్ సైన్స్ & టెక్నాలజీ), బీఎస్సీ (ఆనర్స్) ఫుడ్ సైన్స్ & న్యూట్రిషన్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- ఎంటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్- 7 సీట్లు (సంగారెడ్డి, బాపట్ల క్యాంపస్‌లో)
- **అర్హత:** నాలుగేండ్ల బీటెక్ (అగ్రికల్చర్ ఇంజినీరింగ్), బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఐసీఏఆర్ నిర్వహించే AIEEA PG - 2019 పరీక్ష
- పీహెచ్‌డీ-38 సీట్లు (అగ్రికల్చర్-29 , హోమ్ సైన్స్-7, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ-2)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబెక్టుల్లో ఎమ్మెస్సీ (అగ్రికల్చర్), ఎంటెక్ (అగ్రికల్చర్ ఇంజినీరింగ్), ఎమ్మెస్సీ (హోమ్ సైన్స్) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఐసీఏఆర్ నిర్వహించే పరీక్ష AICE-JRF / SRF (PGS)-2019)కు 60 శాతం, ఎమ్మెస్సీ లెవల్‌కు 30 శాతం, బీఎస్సీ లెవల్‌కు 10 శాతం వెయిటేజీ ఇచ్చి తుది ఎంపిక చేస్తారు.
- **ఫీజు:** జనరల్, బీసీలు రూ.1800/- ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీలు రూ. 900/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.pjtsau.ac.in

## నర్సింగ్‌లో డిప్లొమా కోర్సు

**ధన్‌బాద్‌లోని కోల్ ఇండియా లిమిటెడ్ పరిధిలోని భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ (బీసీసీఎల్) జనరల్ నర్సింగ్ & మిడ్ వైఫరీలో డిప్లొమా కోర్సు ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.**



- డిప్లొమా ఇన్ జనరల్ నర్సింగ్ & మిడ్ వైఫరీ (డీజీఎస్ఎం)
- **కాలవ్యవధి:** మూడేండ్లు
- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి 45 శాతం మార్కులతో ఇంటర్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత
- **వయస్సు :** 2019 సెప్టెంబర్ 30 నాటికి 17 నుంచి 23 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ.150/-
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చిరునామా:** Principal, School of Nursing, Central Hospital, Jagjivan Nagar, Dhanbad-826003
- **చివరితేదీ:** ఆగస్టు 14
- **ప్రవేశపరీక్ష:** సెప్టెంబర్ 3
- **వెబ్‌సైట్:** www.bccl.gov.in

## సంతూర్ విమెన్స్ స్కాలర్‌షిప్స్

**దేశంలోని ప్రముఖ కంపెనీ విప్రో కన్జ్యూమర్ కేర్ (విప్రో కేర్) సంతూర్ విమెన్స్ స్కాలర్‌షిప్ కోసం అర్హత, ఆసక్తి కలిగిన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది.**



- **స్కాలర్‌షిప్‌ల సంఖ్య:** 900
- **అర్హతలు:** ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్ పూర్తిచేసి, 2019-20 విద్యా సంవత్సరంలో ఫుల్‌టైం బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు అర్హులు.
- ఆర్థిక ఇబ్బందుల వలన ఇంటర్ తర్వాత ఉన్నత విద్య చదవలేని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ర్టాలకు చెందిన బాలికల కోసం విప్రో సంస్థ ఈ స్కాలర్‌షిప్స్‌ను అందజేస్తుంది.
- **స్టయిఫండ్:** ఏడాదికి రూ. 24,000/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో
- **చిరునామా:** Wipro Cares- Santoor Schlorship, Doddakannelli, Sarjapur Road, Bangalore-560035
- దరఖాస్తులను ఈ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.
- **ఈ-మెయిల్:** santoor.scholarship@buddy4study.com లేదా call on 0120 6834200
- **చివరితేదీ:** ఆగస్టు 15
- **వెబ్‌సైట్:** www.santoorscholarships.com

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 16 జులై 2019


'నానీస్ గ్యాంగ్‌లీడర్' చిత్రంలో ఓ దృశ్యం

## రివెంజర్స్ గ్యాంగ్

నాని హీరోగా నటిస్తున్న చిత్రం 'నానీస్ గ్యాంగ్‌లీడర్'. విక్రమ్.కె.కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్, మోహన్ చెరుకూరి (సి.వి.ఎం) నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోమవారం హీరో నాని ట్విట్టర్ ద్వారా విడుదలచేశారు. 'బామ్మ, వరలక్ష్మి, ప్రియ, స్వాతి, చిన్ను..రివెంజర్స్ అసెంబుల్' అనే వ్యాఖ్యను జోడించిన ఫస్ట్‌లుక్ ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఇందులో ఓ చిన్నారితో పాటు భిన్న వయస్కులైనా నలుగురు మహిళలు బైనాక్యూలర్స్‌లో దేనినో చూస్తుండగా వారి మధ్యలో బైనాక్యూలర్ చేతిలో పట్టుకొని తీక్షణంగా చూస్తూ నాని కనిపిస్తున్నారు. 'విభిన్నమైన పాయింట్‌తో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఓ గ్యాంగ్ ప్రతీకారం నేపథ్యంలో సాగుతుంది. సినిమాలోని తొలి పాటను ఈ నెల 18న, టీజర్‌ను 24న విడుదల చేయనున్నాం. ఆగస్టు 30న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు. 'ఆర్‌ఎక్స్ 100' ఫేమ్ కార్తికేయ కీలక పాత్రను పోషిస్తున్నారు. ప్రియాంక, లక్ష్మి, శరణ్య, అనీష్ కురువిళ్లా, ప్రియదర్శి, రఘుబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, సినిమాటోగ్రఫీ: మిరోస్లా కుబా బ్రోజెక్, మాటలు: వెంకీ, డార్లింగ్ స్వామి, ఎడిటింగ్: నవీన్ నూలి.



# దిల్‌రాజు సమర్పణలో


కీర్తి సురేష్

'హైదరాబాద్ బ్లూస్' 'ఇక్బాల్' వంటి సినిమాలతో సృజనాత్మక దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు నగేశ్ కుకునూర్. ఆయన తెలుగు చిత్రసీమలోకి అడుగుపెడుతూ కీర్తి సురేష్, ఆది పినిశెట్టి, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో ఓ స్పోర్ట్స్ రొమాంటిక్ కామెడీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు ప్రముఖ నిర్మాత దిల్‌రాజు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. ఆగస్టులో చివరి షెడ్యూల్‌ను జరుపబోతున్నారు. క్రీడా నేపథ్యంలో వినోదం, రొమాన్స్ కలబోతగా ప్రేక్షకులకు నవ్యానుభూతినందించే చిత్రమిదని చెబుతున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: చిరంతన్‌దాస్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, సహనిర్మాత: శ్రావ్యవర్మ, నిర్మాణ సంస్థ: వర్త్ ఏ షాట్ మోషన్ ఆర్ట్స్, నిర్మాత: సుధీర్‌చంద్ర, దర్శకత్వం: నగేష్ కుకునూర్.

# విజయం కోసం కొత్తగా ఆలోచించాను!

**మాస్ ఇతివృత్తాలకు వాణిజ్య హంగులను మేళవిస్తూ సినిమాల్ని తెరకెక్కిస్తుంటారు దర్శకుడు పూరి జగన్నాథ్. పవర్‌ఫుల్ సంభాషణలు, విలక్షణమైన క్యారెక్టరైజేషన్‌తో హీరోయిజాన్ని పతాక స్థాయిలో ఆవిష్కరిస్తుంటారాయన. అందుకే తెలుగు చిత్రసీమలోని హీరోలంతా ఆయనతో ఒక్కసినిమా అయినా చేయాలని ఎదురుచూస్తుంటారు. 'టెంపర్' తర్వాత సరైన కమర్షియల్ సక్సెస్ కోసం నిరీక్షిస్తున్న పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. రామ్ కథానాయకుడు. ఈ నెల 18న విడుదలకానుంది. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో పూరి జగన్నాథ్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..**



**మీ గత సినిమాలతో పోలిస్తే 'ఇస్మార్ట్ శంకర్'లో ఎలాంటి వైవిధ్యత కనిపిస్తుంది?**

• 'టెంపర్' తర్వాత నాకు సరైన హిట్ లేదు. ఈ సినిమాతో ఎలాగైనా విజయాన్ని అందుకోవాలని కొత్తగా ఆలోచించాను. రెగ్యులర్ సినిమాలకు భిన్నమైన ఇతివృత్తంతో 'ఇస్మార్ట్ శంకర్'ను తెరకెక్కించాను.

**రామ్‌తో తొలిసారి పనిచేశారు. ఈ కాంబినేషన్ ఎలా వర్కవుట్ అయ్యింది?**

• రామ్‌తో సినిమా చేయాలని చాలా రోజులుగా అనుకుంటున్నా. అనివార్య కారణాల వల్ల మా కలయిక ఆలస్యమైంది. కథ సిద్ధం చేసుకోకుండా రామ్‌ను కలిశాను. 'గుడ్‌బాయ్ పాత్రలు చేసి బోర్ కొట్టింది. నన్ను బ్యాడ్‌బాయ్‌గా చూపించండి' అని రామ్ అన్నారు. ఆ తర్వాత ఇద్దరం కలిసి 'ఇస్మార్ట్ శంకర్' కథ రాసుకున్నాం. రౌడీ మనస్తత్వం ఉన్న హైదరాబాదీ యువకుడిగా రామ్ కనిపిస్తాడు. బ్యాడ్ నేచర్‌తో పాటు అతడిలో కొన్ని మంచి లక్షణాలు ఉంటాయి. అవేమిటన్నది తెరపై ఆసక్తిని పంచుతాయి.

**బ్రెయిన్ చిప్ అనే కాన్సెప్ట్‌కు ప్రేరణ ఎక్కడ నుంచి వచ్చింది?**

• కొత్త ఆలోచనలకు చాలా వరకు హాలీవుడ్ సినిమాలే స్ఫూర్తినిస్తాయి. నేను రాసుకున్న కథలన్నీ అలా సిద్ధం చేసుకున్నవే.

**తెలంగాణ నేపథ్యంలో సినిమా చేయాలని ఎందుకనిపించింది?**

• తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో సినిమా చేయాలనే కోరిక ఉంది. ఇందులో రామ్ హైదరాబాద్ యువకుడిగా కనిపిస్తాడు కాబట్టి తెలంగాణ యాసలో అతడు డైలాగ్‌లు చెబితే బాగుంటుందనిపించింది. కథకు అది బాగా కుదిరింది.

**తెలంగాణ యాస కోసం మీరు ఎలాంటి పరిశోధన చేశారు?**

• నా భార్య లావణ్య తెలంగాణ అమ్మాయే. తనతో పాటు మా అబ్బాయి ఆకాష్ ఇంట్లో ఎక్కువగా అదే యాసలో మాట్లాడుతుంటారు. రోజు వినే భాష కాబట్టి తెలంగాణలో సంభాషణలు రాయడానికి కష్టంగా అనిపించలేదు. తెలంగాణకు చెందిన శ్రీధర్ అనే కో డైరెక్టర్ డైలాగ్స్ విషయంలో సహాయం చేశారు.

**తెలంగాణ యాసలో తొలిసారి సంభాషణలు రాయడం ఎలా ఉంది? రామ్ డైలాగులు చెప్పడానికి ఇబ్బంది పడ్డారా?**

• తెలంగాణ యాసపై నాకు పట్టుండటం వల్ల ఎలాంటి సమస్య ఎదురవ్వలేదు. కానీ రామ్ సినిమాల్లో, నిజజీవితంలో తెలంగాణ యాసలో ఎప్పుడు మాట్లాడలేదు. సినిమా పూర్తయ్యేలోపు అతడు తెలంగాణ భాషతో ప్రేమలో పడిపోయాడు. ఇప్పుడు అందరితో తెలంగాణ యాసలోనే మాట్లాడుతున్నాడు.

**ఇద్దరు హీరోయిన్ల పాత్రలు ఎలా ఉంటాయి?**

• దూకుడు మనస్తత్వం కలిగిన వరంగల్ అమ్మాయిగా నభానటేష్ కనిపిస్తుంది. డాక్టర్‌గా డీసెంట్ పాత్రలో నిధి అగర్వాల్ నటించింది.

**రామ్ మాస్ పాత్రలో ఒదిగిపోవడానికి సమయం పట్టిందా?**

• రామ్ ఇలాంటి పాత్ర కోసం చాలా రోజులుగా ఎదురుచూస్తున్నారు. తనలోని ఎనర్జీని ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఎవరూ తెరపై ఆవిష్కరించలేదు. ఆ ఎనర్జీని వాడుకొని ఈ సినిమా చేశాం.

**సినిమా హిట్టయితే వెధవ కూడా జీనియస్‌గా కనిపిస్తాడు. అదే పరాజయం పాలైతే ప్రతిభావంతుడిని వెధవ కిందే జమకడతారు. ఇండస్ట్రీలో సక్సెస్‌ను అనుసరించే అన్నీ జరుగుతాయి.**

**దర్శకుడిగా మీకున్న ఇమేజ్‌ను వరమని అనుకుంటున్నారా? శాపమని భావిస్తున్నారా?**

• అందులో ప్లస్, మైనస్ రెండు ఉంటాయి. అందరిని ప్రేమించే తత్వం వల్ల మంచితో పాటు కొన్నిసార్లు చెడు జరుగుతుంది.

**మీతో పనిచేసిన హీరోలంతా మళ్లీ మళ్లీ పనిచేయాలనుందని చెబుతుంటారు?**

• నటులకు ఎలాంటి సమస్యలు ఎదురవ్వకుండా షూటింగ్ అంతా ప్రశాంతంగా జరిగేలా చూసుకుంటాను. వారి ముఖంలో టెన్షన్ కనబడనీయను. హీరోల్ని డిస్టర్బ్ చేయను.

**ఈ సినిమాకు సీక్వెల్ చేయాలని అనుకుంటున్నారని వార్తలు వినిపిస్తున్నాయి?**

• కథపై చాలా నమ్మకంతో ఉన్నాను. అందుకే సీక్వెల్ కోసం టైటిల్ రిజిస్టర్ చేయించాను. పక్కా ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం తప్పకుండా అన్ని వర్గాల వారిని అలరిస్తుంది..

**మీ తనయుడు ఆకాష్‌తో మళ్లీ ఎప్పుడూ సినిమా చేయబోతున్నారు?**

• ఆకాశ్ హీరోగా రూపొందుతున్న 'రొమాంటిక్' చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నాను. యాభై శాతం చిత్రీకరణ పూర్తయింది.

**బాలకృష్ణతో మరోసినిమా చేయబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి?**

• బాలకృష్ణ అంటే నాకు చాలా ఇష్టం. కథ సిద్ధం చేసుకున్న తర్వాత ఆయన్ని కలుస్తాను. ఇప్పటివరకు అన్ని రకాల కథాంశాలతో ఆయన సినిమాలు చేశారు. బాలయ్య టచ్ చేయని కొత్త జోనర్‌లో సినిమా చేయాలనుంది.



**'చందమామ' 'అలా మొదలైంది' 'మహాత్మ' 'కల్యాణ వైభోగమే' వంటి చిత్రాల ద్వారా ప్రతిభావంతుడైన రచయితగా గుర్తింపును సంపాదించుకున్నారు లక్ష్మీభూపాల్. ఇటీవల విడుదలైన 'ఓ బేబీ' చిత్రానికి ఆయనే సంభాషణలందించారు. సినిమా విజయాన్ని పురస్కరించుకొని లక్ష్మీభూపాల్ పాత్రికేయులతో ముచ్చటించారు.**

# లక్ష పారితోషికం పెంచేవాడిని!

'నేను పరిశ్రమలోకి వచ్చి 15ఏళ్లు అవుతున్నది. దాదాపు 60కి పైగా చిత్రాలకు మాటల్ని అందించాను. 'ఓ బేబీ' రచయితగా నాకెంతో సంతృప్తినిచ్చింది. నా వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న చాలా సంఘటనలు ఈ సినిమాలో ఉన్నాయి. అందుకే కథతో బాగా కనెక్ట్ అయిపోయా. ఇందులో బేబీ పాత్రకు రాసిన సంభాషణల వెనక మా అమ్మ, అమ్మమ్మ చెప్పిన మాటల స్ఫూర్తి ఉంది. అందుకే ఈ సినిమా విజయాన్ని వారిద్దరికి అంకితమిస్తున్నా. చిత్ర కథాంశం కొరియాదే అయినా మన ఆత్మను మేళవించి తెరకెక్కించారు. నేను పనిచేసిన సినిమాలు ఫెయిల్ అయ్యాయేమో కానీ..రచయితగా నేను ఎప్పుడూ ఫెయిల్ కాలేదు. ప్రతిభాసామర్థ్యాలు ఉన్నాయి కాబట్టే 60 సినిమాలకు మాటలు రాసే అవకాశం లభించింది. ఫెయిల్యూర్స్ వచ్చినప్పుడు నిరాశ చెందలేదు. అపజయాలు పలకరించిన ప్రతిసారి నేను లక్ష పారితోషికం పెంచేవాడిని. మరింత కసితో మాటలు రాసేవాణ్ణి.

**అందుకే అవకాశాలు రాలేదేమో..**

పెద్ద హీరోల చిత్రాలకు కొన్ని అవకాశాలు వచ్చాయి. కానీ అవి కార్యరూపం దాల్చలేదు. రవితేజ 'బలాదూర్' చిత్రానికి పనిచేశాను. నేను పంచ్ డైలాగులకు, ప్రాసలకు దూరంగా ఉంటాను కాబట్టే పెద్ద సినిమా అవకాశాలు రాలేదేమో. అగ్ర కథానాయకుల సినిమాలకు మాటలు రాయాలని ఉంది. మంచి ఛాన్స్‌ల కోసం ఎదురుచూస్తున్నా. నేను స్టార్ హీరోలతో పనిచేయలేదు కానీ..వైజయంతీ మూవీస్, ఉషాకిరణ్ మూవీస్, సురేష్‌ప్రొడక్షన్స్ వంటి అగ్ర నిర్మాణ సంస్థలకు పనిచేశాను.

**అందుకే దర్శకత్వం వైపు..**

తాము రాసిన విధంగా దర్శకులు సినిమాలు తీయడం లేదనే కోపంతో రచయితలు దర్శకత్వం వైపు మొగ్గుచూపుతున్నారు. నాకు మాత్రం డైరెక్షన్ అంటే ఆసక్తి లేదు. నా దగ్గర 24 వరకు కథలున్నాయి. అవసరమైతే వాటిని ఇతర దర్శకులకు ఇస్తాను. 'ఓ బేబీ' సంభాషణలు బాగున్నాయని చాలా మంది ఫోన్ చేసి అభినందించారు. ఈ సినిమా విజయంతో ఏడు సినిమాల్లో ఆఫర్లొచ్చాయి. వాటిలో కొన్ని కథలు నాకు నచ్చలేదు. ప్రస్తుతం నందినిరెడ్డి, తేజ దర్శకత్వంలో వస్తున్న సినిమాలకు మాటలు రాస్తున్నా. నా వ్యక్తిగత అనుభవంలో పరిశ్రమలో నేర్చుకోవడానికి ఏమీ ఉండదు. డబ్బులు సంపాదించుకోవడమే ఇక్కడ చేయాల్సిన పని.


బ్రహ్మానందం, అలీ, కార్తికేయ, అర్జున్ జంధ్యాల

# నా బుజ్జి బంగారం

'ప్రతి ఇంట్లో భార్య పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అందుకే వారిని 'బుజ్జిబంగారం' అని అంటుంటాం. నేను నా భార్యను అలాగే పిలుస్తాను. బుజ్జిబంగారం అనే పల్లవితో మొదలైన ఈ పాట వినసొంపుగా ఉంది' అని అన్నారు హాస్యనటుడు అలీ. కార్తికేయ, అనఘ జంటగా నటిస్తున్న చిత్రం 'గుణ 369'. అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అర్జున్ జంధ్యాల దర్శకుడు. ఈ సినిమాలోని 'నా బుజ్జిబంగారం' అనే గీతాన్ని హాస్యనటులు బ్రహ్మానందం, అలీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హీరో కార్తికేయ మాట్లాడుతూ 'ప్రేమలో ఉన్న ప్రతి జంట పాడుకునే పాట ఇది. బ్రహ్మానందం, అలీ లాంటి గొప్ప హాస్యనటులు ఈ గీతాన్ని విడుదలచేయడం ఆనందంగా ఉంది. వారి ఆశీస్సులు పొందడం అదృష్టంగా భావిస్తున్నాను' అని తెలిపారు. యథార్థ సంఘటనల ఆధారంగా వాస్తవికతకు పెద్దపీట వేస్తూ ఈ చిత్రాన్ని రూపొందించామని దర్శకుడు పేర్కొన్నారు. 'ఈ నెల 17న అల్లు అరవింద్, బోయపాటి శ్రీను చేతులమీదుగా ట్రైలర్‌ను విడుదల చేస్తున్నాం. ఆగస్టు 2న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: చైతన్‌భరద్వాజ్, కెమెరామెన్:రామ్.


మౌర్యాని

# సుందరాంగుడి ప్రేమాయణం

కృష్ణసాయి, మౌర్యాని జంటగా నటిస్తున్న చిత్రం 'సుందరాంగుడు'. ఎమ్.వినయ్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. బీసు చందర్‌గౌడ్ నిర్మాత. సినిమా షూటింగ్ తుదిదశకు చేరుకున్నది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చివరి షెడ్యూల్ చిత్రీకరిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'జమీందార్ కుటుంబంలో పుట్టిన ఓ అందవికారుడైన యువకుడి కథ ఇది. నిజమైన ప్రేమను అన్వేషిస్తూ సాగించిన ప్రయాణంలో అతడు తెలుసుకున్న వాస్తవాలేమిటన్నది ఆకట్టుకుంటుంది. బావమరదళ్ల ప్రేమకథ అందంగా ఉంటుంది. త్వరలో దుబాయ్‌లో చిత్రీకరించనున్న పాటతో సినిమా షూటింగ్ పూర్తవుతుంది' అని తెలిపారు. వినూత్నమైన కథ, క్యారెక్టరైజేషన్స్‌తో దర్శకుడు వినయ్‌బాబు ఈ సినిమాను రూపొందిస్తున్నారని నిర్మాత పేర్కొన్నారు. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేస్తున్నామని నాయకానాయికలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జూ రేలంగి, మిర్చి మాధవి, వెంకట హనుమ తదితరులు పాల్గొన్నారు.


రఘుబాబు, ప్రియాంక

# 'ఎర్రచీర' రహస్యం

శ్రీకాంత్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఎర్రచీర'. సత్యసుమన్‌బాబు దర్శకుడు. సెప్టెంబర్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హారర్ యాక్షన్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. బేబి సాయితేజస్వి, కారుణ్యాచౌదరి, రఘుబాబు, కమల్‌కామరాజు తదితరులు ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. హారర్‌తో పాటు చక్కటి వినోదం కూడా ఉంటుంది. ఎర్రచీర రహస్యం ఏమిటన్నది ఆసక్తికంగా ఉంటుంది. ప్రస్తుతం రఘుబాబు, ప్రియాంక ఆగస్టీన్‌లపై ఐటెంసాంగ్‌ను చిత్రీకరిస్తున్నాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: చందు, మాటలు: గోపీ విమలపుత్ర, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సత్యసుమన్‌బాబు.


ధృవతార , సురేష్ కొండేటి

# కులానికి అతీతంగా

80వ దశకంలో విజయవాడ రాజకీయాల్ని ప్రభావితం చేసిన దేవినేని నెహ్రూ, వంగవీటి రంగా కథతో తెరకెక్కుతున్న చిత్రం 'దేవినేని'. శివనాగు దర్శకుడు. రాము రాథోడ్ నిర్మిస్తున్నారు. దేవినేని నెహ్రూ పాత్రలో తారకరత్న, వంగవీటి రంగా పాత్రలో సురేష్ కొండేటి నటిస్తున్నారు. ఇటీవలే సినిమాలోని వంగవీటి రంగా లుక్‌ను విడుదల చేశారు. తాజాగా వంగవీటి రంగా భార్య రత్నకుమారి లుక్ రిలీజైంది. ఆమె పాత్రలో తమిళనటి ధృవతార నటించింది. భర్తకు చేదోడుగా ఉంటూ ఆయన కష్టాల్లో తోడుగా నిలిచిన మహిళగా రత్నకుమారికి గొప్ప పేరుందని దర్శకుడు చెప్పారు. తన ప్రత్యర్థి సామాజిక వర్గానికి చెందిన మహిళను పెళ్లాడిన రంగా ప్రేమకు కులం అడ్డుగోడ కాదని నిరూపించారని తెలిపారు. ఈ సినిమా మరో రెండు షెడ్యూల్స్‌తో చిత్రీకరణ పూర్తవుతుందని నిర్మాతలు తెలిపారు.